# మిసిమి

చింతనాత్మక సాహిత్యం



మాసపత్రిక జూన్ 2010 రూ. 20/-



తానతందాన

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*


**సంపుటి 21 జూన్ 2010 సంచిక 6**



*ప్రధాన సంపాదకుడు:*

చెన్నూరు ఆంజనేయరెడ్డి

*సమాలోచక మండలి:*

అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (బుద్ధఘోషుడు)
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ
డాక్టర్ జయధీర్ తిరుమలరావు
కుప్రా జితేంద్రబాబు
ముంగర జాషువా
కాండ్రేగుల నాగేశ్వరరావు
డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

*రెసిడెంట్ ఎడిటర్:*

వల్లభనేని అశ్వినికుమార్

*సంస్థాపక సంపాదకులు:*

రవీంద్రనాథ్ ఆలపాటి



*Printed & Published by*

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

ప్రతి : రూ. 20/- సంవత్సరానికి : రూ. 200/-
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25.00


# ఈ నెల...


**అమృత ఫలం** ................ 3
– డా॥ జె. లక్ష్మిరెడ్డి

**తెలుగు నాటకరంగ చరిత్ర** ................ 9
– గోపాలకృష్ణ అబ్బూరి

**మా నాన్నగారు – పుస్తక పరిచయం** ................ 13
– తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

**కాపు రాజయ్య** జనపదాల కాపు – రంగుల రాజు ................ 15
– కాండ్రేగుల నాగేశ్వరరావు

**నా కళా జీవితం–నాగపూరు** ................ 21
– నటరాజ రామకృష్ణ

**భారతీయ సంస్కృతి – సత్యాసత్యాలు** ................ 29
– ఆచార్య బి.ఎస్.ఎల్. హనుమంతరావు

**ముఖ్దూం కవిత** ................ 32
– సినారె

**పుట్టని పాప ప్రార్థన** ................ 33
– శ్రీశ్రీ

**సైగల్‌గానం** చరిత్రలో 'రికార్డ'యిన అద్భుత అధ్యాయం ................ 39
– ఆలపాటి రవీంద్రనాథ్

**మేల్కొలుపు** ................ 43
– వల్లభనేని అశ్వినికుమార్

**సంస్కర్తల కథలు** ................ 51
– డా॥ ఎన్.సి. రామానుజాచారి

**మహాకవి** ................ 55
– రాచకొండ విశ్వనాథశాస్త్రి

**మానవేంద్రనాథ్ రాయ్ ఆలోచనలు నేటికీ అక్కరకు వస్తాయా?** ................ 59
– డా॥ నరిసెట్టి ఇన్నయ్య

**తనికెళ్ల భరణికి 'శ్రీపాద పురస్కారం'** ................ 61

**పురిపండాకి శ్రీపాద ఉత్తరం** ................ 62


ముఖ చిత్రం : బతుకమ్మ పండుగ
రెండవ అట్ట : తాన తందాన
చివరి అట్ట : మాతృత్వం

చిత్రకారుడు : **డా॥ కాపు రాజయ్య**

మూడవ అట్ట : పల్లెపడుచు–చిత్రకారుడు : **డి. గోవిందరాజులు**

ఏ జాతికైనా సంస్కృతే ప్రాణనాడి.

ఆ నాడీస్పందనే జనజీవితంలో జవసత్త్వాలను నింపుతుంది.

ఆ సంస్కృతీ విశిష్టతే జాతికొక ఔన్నత్యాన్ని, ప్రత్యేక గుర్తింపును సమకూరుస్తుంది.

నేటి మన యాంత్రిక జీవితంలో దురదృష్టవశాత్తు సాంస్కృతిక, చారిత్రక విలువలపట్ల, లలితకళాస్వాదన పట్ల ఆసక్తి, అనురక్తి తగ్గుతూ వస్తున్నాయి.

ఈ వాతావరణంలో మన జన జీవనంలోని వివిధ పార్శ్వాలను స్పృశిస్తూ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, లలిత కళలపట్ల ఆసక్తిని కలిగిస్తూ, విలువైన సమాచారం అందించే వ్యాసాలను, ఇతర భారతీయ భాషా సారస్వతం నుండి అనువాదాలను, ఉత్తమ అభిరుచులుగల పాఠకుల కోసం అందించే బాధ్యతను **మిసిమి** స్వీకరించింది.

ఈ నెల మీకందించే వ్యాసాలలో ఆచార్య హనుమంతరావుగారి 'భారతీయ సంస్కృతి - సత్యాసత్యాలు', మన సంస్కృతి ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంటున్న ఆధ్యాత్మికత, భిన్నత్వంలో ఏకత్వం, సహనశీలత, శాంతిప్రియత్వాల, సునిశితమైన పరిశీలనను మీ ముందుంచుతుంది.


తన నిండు జీవితాన్ని నాట్యకళకే అంకితంచేసి అజ్ఞాతంగా పండుటాకులా రాలిపోయిన ఒక వృద్ధ కళాకారిణి వేదనాభరిత యధార్థ జీవనగాథను కళ్లకు కట్టినట్లు చిత్రించారు శ్రీ నటరాజ రామకృష్ణ తమ 'నా కళా జీవితం - నాగపూరు' వ్యాసంలో.

ఏ రచయితకు ఎదురు కాకూడని పరిస్థితులను, పేదరికాన్ని, గోదావరి లాంటి శ్రీపాదవారు ఎలా అనుభవించారో, తెలుగుజాతి మొత్తం సిగ్గుపడవలసిన స్థితి, ఆయన పురిపండా వారికి రాసిన లేఖలో దయనీయంగా వ్యక్తమౌతుంది.

**మిసిమి** సంస్థాపక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ ఆనాడు 'సైగల్ గానం' ఆస్వాదించి మనకందించిన స్పందన.

శ్రీశ్రీ శతజయంతికి మేము సైతం.... ఒక కవిత, ఒక వ్యాసం.

**- సంపాదకులు**



మనోజ్‌దాస్

# అమృత ఫలం

## 2000 సంవత్సర సరస్వతీ సమ్మాన్ స్వీకారోపన్యాసం (ఇంగ్లీషు నుంచి అనువాదం)

- జె. లక్ష్మిరెడ్డి

ఒక రచయితను పురస్కరించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆ రచయిత జీవితంలో ఒక అసాధారణ సందర్భంగా ఉంటుంది. సాధారణంగా తన చదువుకునే గదిలోని ఏకాంతంలో నుంచి తన్ను వ్యక్తీకరించుకునే రచయిత అలాంటప్పుడు విశిష్ట జనుల ఎదుటికి రావలసి ఉంటుంది. వారిలో సాహిత్యం పట్ల గాఢానురాగం ఉన్నవాళ్ళు, ఆ రంగంలో పురస్కార స్వీకర్త సహచరులు కూడా ఉంటారు.

నేను నాలుగు మాటలు మాట్లాడవలసి వచ్చే ఇలాంటి సందర్భాల్లో ఈ కార్యక్రమం అన్నింటికంటే ప్రాముఖ్యం కలది. అయితే ఇలాంటి సందర్భాల్లో ఏమి మాట్లాడాలో నిర్ణయించుకోడం నాకు చాలా కష్టంగా ఉంటుంది. చాలాచాలా ప్రాచీనకాలం నాటి గురించి నమ్మకంగా చెప్పలేను గానీ, కొంత ప్రాచీనకాలం నాటికొస్తే, భారతీయ సాహిత్య సంస్థాపకులైన వాల్మీకికి, వ్యాసునికి కూడా ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చి ఉంటుందా? అని నేను ఆలోచిస్తూ ఉంటాను.

పరిస్థితులు నానా విధాలుగా మారాయి. పురస్కారం కోసం ఒక రచయితను గానీ, సమాజానికి, రచయితకు మధ్య ఉండే దగ్గరి సంబంధాన్ని తెలియపరచే ఒక రచనను గానీ ఎంపిక చేసే పద్ధతి లేక సిద్ధాంతం కూడా ఆ మార్పు ప్రక్రియకు లోబడే ఉంటుంది. ఈ ఎంపిక ప్రక్రియలో పాలుపంచుకునే వారు — విమర్శకులు, విశేషజ్ఞత కలవారు, సృజనాత్మక రచయితలు--సమాజంలో అత్యల్ప సంఖ్యాకులుగానే ఉంటారు. అయితే వాళ్ళు సమాజంలో అన్నిటికంటే ఎక్కువ క్రియాశీలమైన, జాగరూకత గల, ప్రాణవంతమైన భాగం. వర్తమానంలో, భవిష్యత్తులో మన సంస్కృతి వికాసం దేనిపైనైతే ఆధారపడి ఉంటుందో, ఆ వివేక పూరితమైన సామూహిక చింతనను నిర్మించడానికి ఉపకరించే విలువలననుసరించి, విజ్ఞులైన వాళ్ళు ఈ నిర్ణయం చేస్తారని మనం ఆశిస్తాం.

ఇది సహజంగా మనలను ఒక ప్రధానమైన సమస్య దగ్గరికి తీసుకెళ్తుంది. మారిన పరిస్థితులు రచయితను తన పరిసరాల పట్ల మరింత మెలకువతో ఉండేట్లు చేస్తాయా? సమాజం పట్ల అతడు మరింత నిబద్ధతతో ఉండేట్లు చేస్తాయా?

బాగా ఆలోచిస్తే సమాజంతో, దాని సమస్యలతో, అది ఎదుర్కొంటున్న ప్రమాదాలతో 20వ శతాబ్దంలోని రచయిత కలగజేసుకున్నంతగా మునుపు ఏ యుగంలోని రచయితా కలగజేసుకోలేదని ఒప్పుకోక తప్పదు. దీనికి కారణం మరింతమంది రచయితలు రాయడాన్ని వృత్తిగా చేసుకొని రచయితగా తమ మనుగడ సాగించడానికి సమాజం పైన ఆధారపడడం మొదలు పెట్టడం ఒక్కటే కాదు. ప్రపంచ యుద్ధాలు, జాతులను నాశనం చేసేందుకు సాగించిన మారణకాండలు, విస్తారంగా జరిగిన ఇతర క్రూరత్వాలు, సామ్రాజ్యాల–వలసరాజ్యాల–రాచరికాల పతనం, విప్లవాలు, ప్రతివిప్లవాలు, పర్యావరణ విధ్వంసం, సాంకేతిక శాస్త్ర

డా. జె. లక్ష్మిరెడ్డి : కేంద్రసాహిత్య అకాడమీ సలహాదారులు, ప్రఖ్యాత అనువాదకులు, ఢిల్లీ. సెల్ : 09811589430

చమత్కారాలు, లాంటి బృహత్ బాహ్య సంఘటనలు రచయితను వాటన్నింటికి దూరంగా తన ప్రపంచంలోనే లీనమై ఉండనివ్వలేదు, అతన్ని కేవలం తనకిష్టమైన విషయాలపైనే రాసుకుంటూ ఉండనివ్వలేదు.

ఈ మాటతో పాటు నేను మరోమాట కూడా చెప్పాలి. రచయిత అని అనడానికి యోగ్యుడైన వాడెవ్వడూ కూడా పూర్తిగా తనలోతాను లీనమై ఎప్పుడూ ఉండలేదు. వాల్మీకి ద్వారా సీతారాముల జీవితం ఆధారంగా రామాయణం రాయడం గానీ, వ్యాసుని ద్వారా కౌరవ–పాండవుల పోరాటం ఆధారంగా మహాభారత రచన చేయడంగానీ లేక హోమర్ ద్వారా ట్రోజన్ యుద్ధం ఆధారంగా 'ఇలియడ్', 'ఒడిస్సీ'ల రచన చేయడంగానీ, వీటన్నింటికీ ప్రేరణ బాహ్య సంఘటనలే. అప్పటికీ, ఇప్పటికీ ఉన్న పెద్ద తేడా ఏమిటంటే వాల్మీకికి, వ్యాసునికి, హోమర్‌కు వారి రచనలను సమాజం ఎలా స్వీకరిస్తుంది, ఎలా స్పందిస్తుంది, అని చింతపడవలసిన అవసరం ఉండేది కాదు. వాళ్ళకు సమకాలీన సమాలోచనలతో, విమర్శలతో, విలువ కట్టడాలతో, రాయల్టీలతో, నిందా–స్తుతులతో ప్రమేయం ఉండేది కాదు. మనమైతే వాటి ప్రభావం నుంచి ఇప్పుడు తప్పించుకోలేం.

అలాంటప్పుడు తన స్వాతంత్ర్యం విషయంలో మునుపటి రచయిత పరిస్థితి బాగుండేదా లేక నేటి రచయిత పరిస్థితా అనేది మరో వివాదాస్పద విషయం. ఎందుచేతనంటే నిజమైన స్వాతంత్ర్యాన్ని కేవలం రాజకీయ దృష్టికోణం నుంచే చూడడానికి వీల్లేదు. అది ఒక క్లిష్టమైన సమస్య. అందులో అనేక ఇతర విషయాల పాత్రకూడా ఉంటుంది. ఆ విషయాల్లో సామాజిక పరిస్థితులు, పరిసరాల పట్ల వ్యక్తి అవగాహన స్థాయి, తన అహాన్ని, తన పక్షపాత దృష్టిని అదుపు చేయడంలో అతడు సాధించిన బౌద్ధిక సామర్థ్యం ప్రధాన మైనవి.

ఒక రచయితలో అంతర్గతమై ఉన్న సృజనశక్తి ఆకారం ధరించి బయటికి రావడానికి కొన్ని బాహ్య సంఘటనల నుంచి వచ్చే ప్రేరణల కోసం, ఉత్తేజం కోసం ఎదురు చూస్తుందనడంలో సందేహం లేదు. వాల్మీకికి వేటగాని నిర్దయ ప్రేరణ అయింది. గాబ్రియేలా మిస్ట్రల్ తల్లికాబోతున్న స్త్రీ మనసులో వ్యాపించిన నిస్సహాయతానుభూతి కలగగానే హఠాత్తుగా కవి అయిపోయాడు. అలాగే, కవిలోని సృజనశీలత ఒకసారి క్రియారూపం ధరించిన తర్వాత కేవలం ఆంతరిక ప్రేరణే దానికి మార్గనిర్దేశం చేయదు. అది ముందుకు సాగడంలో అనేక కారకాల, ప్రేరణల జోక్యం కూడా ఉంటుంది.

అనాదికాలం నుంచీ సాహిత్య సృజన కొన్ని ప్రధాన ప్రవృత్తులననుసరించి ముందుకు సాగుతూ వచ్చింది. మొదటిది సహజ సంఘటనలాగా గానీ లేక ఒక అతీంద్రియ సంఘటనలాగా గాని సంభవించే ఒక ఉదాత్త ప్రేరణ నుంచి సాహిత్యం పుట్టడం. పువ్వు వికసించడం లాగానో లేక ఇంద్ర ధనుస్సు ఆకాశంలో వెల్లివిరియడం లాగానో. ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం ఈ శ్రేణికి చెందుతాయి. రెండోది నీతిని బోధించాలనే లేక జీవిత సత్యాలను ఉపదేశించాలనే ఒక గొప్ప ఉద్దేశ్యంతో చేసిన రచనలు. జాతక కథలు నీతిని బోధించడానికి రాయడం జరిగితే, 'పంచతంత్రం' రాజకుమారులకు లోకజ్ఞానం అందించడానికి రాయడం జరిగింది. ఒక స్పష్టమైన సామాజిక ఉద్దేశ్యంతో రచించబడిన 'Uncle Tom's Cabin' లాంటి సాహిత్య కృతులను కూడా మనం ఈ శ్రేణిలో చేర్చవచ్చు.

జ్ఞానం, వినోదం ఇస్తూ జీవితంలోని వేర్వేరు రంగులను చిత్రించే సాహిత్యం మూడవ శ్రేణికి చెందుతుంది. అందులో జీవితంలోని సుఖ–దుఃఖాల, నైతిక–అనైతిక చర్యల చిత్రణ ఉంటుంది. సుప్రసిద్ధ 'కథా సరిత్సాగరం' మొదలుకొని కథాసాహిత్యంలోని అధికభాగం ఈ శ్రేణిలో చేరుతుంది. ఈ సాహిత్యం జీవితంలోని సంక్లిష్టతలకు సంబంధించిన మన అవగాహనా పరిధిని పెంచుతుంది.

నేనీ వర్గీకరణ కొన్ని విశిష్ట ప్రవృత్తుల ఆధారంగా మాత్రమే చేశాను. నిజానికి ఈ ప్రవృత్తులు చాలా సులభంగా ఒక దానిలో మరొకటి కలగాపులగంగా వచ్చి చేరుతూ ఉంటాయి.

ఆ తర్వాత ఉపయోగ దృష్టితో రాసే చిన్న సాహిత్య ప్రవృత్తి ఒకటుంది. ఒక రాజకీయ ప్రణాళికా పత్రం లేదా ఒక ప్రకటన కూడా ఒక్కోసారి భావాభివ్యక్తిలో చాలా ముందుకు వెళ్ళిపోతుంది. అందులో కొంత సాహిత్య గుణం ఉండే అవకాశం ఉంది. అలా ఉండడంవల్ల కలిగే హాని కూడా ఏమీ లేదు.

అయితే కాలక్రమంలో దురదృష్టవశాత్తూ ఈ కల్తీ పెరిగి పోతూవచ్చింది. అందువల్ల దేన్నైతే కేవలం వ్యాపారం, లేదా సంచలనం సృష్టించడంగా భావించ వచ్చునో, దాన్ని కూడా సాహిత్యంగా చెప్పడం జరుగుతూంది. చాలా సార్లు అందులో దురుద్దేశ్యంతో సత్సాధనాలను దురుపయోగ పరిచే ప్రవృత్తి కనపడు తూంది. ఈ విధంగా ఒక సాధారణ గిలిగింతకు, లేక పచ్చి కామోత్తేజానికి సామాజిక యదార్థం అనే అందమైన తొడుగులు తొడిగి అందరి ప్రశంసలు పొందవచ్చు. కళను వినోదం స్థాయికి, వినోదాన్ని విలాస స్థాయికి దిగజార్చే వాతావరణంలో అలాంటి ట్రిక్కులు మహా జోరుగా సాగుతూ ఉంటాయి. అలాంటప్పుడు మేలిమి బంగారు, రోల్డుగోల్డు మధ్య తేడా అంతరిస్తూ పోతుంది.

ఒక్కోసారి మన కాలంలోని ఈ ప్రవృత్తులను చూసి అయ్యో! అని తీవ్రంగా వాపోవడం మనం వింటూ ఉంటాం. అయితే అదంతా సాధారణంగా అరణ్యరోదనంగా మాత్రమే ఉండిపోతుంది. గత రెండు దశాబ్దాలుగా పాశ్చాత్య మనస్తత్వ శాస్త్రజ్ఞులు, విద్యావేత్తలు, చింతకులే కాదు, రాజకీయ నాయకులు కూడా హద్దు–అదుపులేని హింస, సెక్స్ టెలివిజన్‌లో రాత్రింబవళ్ళు చూపుతూ ఉండడం వల్ల సామాజిక వాతావరణం కలుషితం అయిపోతూందని, దీని విష ప్రభావం ప్రజలపైన పడుతూందని, పిల్లల మనోవికాసం పైన మరింత ఎక్కువగా పడుతూందని, ఎన్నోసార్లు హెచ్చరిస్తూ వచ్చారు. అయితే అర్థరహితమైన ఈ దుశ్చేష్టను ఆపడానికి ఇంతవరకు ఏమీ చేయడం జరగలేదు. ఈ క్రియాశూన్యతకున్న కారణం కనుక్కోవడం కష్టం కాదు. రాజకీయ నాయకులు, చట్టాలు చేసే ఇతర అధికారులు ఒకే మూలస్థానం నుంచి తమ శక్తి పొందుతారు. నా అభిప్రాయం డబ్బు సంచుల నుంచి అనే. ప్రసార మాధ్యమాలు కూడా వీళ్ళ నియంత్రణలోనే ఉంటాయి.

మరి ఈ పరిస్థితిని ఎవరు మార్చగలరు? ఎంత వరకైతే సామాన్య మానువుడు తన అభిరుచులను మార్చుకోడో, అంతవరకు ఈ మార్పు ఎవరూ తీసుకు రాలేరు. ఎంతవరకైతే అతని చైతన్యంలో మార్పు రాదో, అంతవరకు అతని అభిరుచుల్లో మార్పు రాదు.

అయితే ఎప్పుడో ఒకసారి మన చైతన్యంలో మార్పు తప్పక వస్తుందని నా నమ్మకం. ఎందుచేతనంటే మన జీవితంలోని వాస్తవిక శక్తి అయిన మనఃప్రేరణ, మన అంతః ప్రకృతి, ఇప్పుడు మనం ఉన్న స్థితితో సంతృప్తిపడి నిశ్చేష్టంగా ఉండిపోదు. నిజానికి మనం ఇప్పుడు వికాసపరమైన సంకటావస్థ గుండా సాగిపోతున్నామని శ్రీ అరవిందులు అంటారు. ఈ విశ్లేషణ చేసిన తర్వాత మనిషి ఈ సంకటావస్థ నుంచి బయట పడగలడని, తన ప్రస్తుత చైతన్య స్థాయిని ఉన్నతీకరించుకోగలడని కూడా ఆయన చెప్తారు. ఇది చాలా ప్రగాఢమైన విషయం. అయితే అన్ని దర్శనాలల్లో, మన కాలంలోని అన్ని భవిష్య కల్పనల్లో, ఇదొక్కటే మన ముందు నమ్మకంగా ఒక కొత్త క్షితిజాన్ని ఆవిష్కరించగలుగుతుంది, సృజనశీలతకంతా మూలమైన ఆశావాదాన్ని సముచిత మైందిగా చూపగలుగుతుంది.

నా మాతృభాష ఒరియాలో రాసిన నా నవల 'అమృత ఫల'ను ఇంత గొప్ప సరస్వతీ సమ్మాన్ పొందడానికి యోగ్యమైందిగా భావించినందుకు కే.కే. బిర్లా ఫౌండేషన్ చయన పరిషత్తుకు కృతజ్ఞుణ్ణి. జీవితానికి అర్థం తెలుసు కోవాలనే మానవుని ఆకాంక్ష భర్తృహరి కాలం నుంచి ఇప్పటిదాకా తీవ్రతరం అవుతూనే వచ్చింది. ఈ నవలలోని వస్తువు అదే. జీవితం, ప్రేమ, మృత్యువు లాంటి ఎడతెగని ప్రశ్నలతో తలపడాలనే నిజమైన కోరిక నుంచే ఈ నవల జన్మించింది. ఈ విషయాలన్నింటినీ నా నవలలో పూర్తిగా పొందుపరచలేని నా అసమర్థత వల్ల ఇందులో కొంత బలహీనత చోటు చేసుకొని ఉండవచ్చు. రచయితకు ఈ సమ్మాన్ ఇచ్చే గుర్తింపు— సరస్వతి అనే మహోజ్వలమైన పదంతో కూడి ఉండడం వల్ల కూడా— ఈ క్షణం నన్ను వినయావనతుణ్ణి చేస్తూంది, భావవిహ్వలుణ్ణి చేస్తూంది. ఈ తరుణంలో మీ అనుగ్రహపూర్వకమైన ఉపస్థితి ద్వారా ఈ గుర్తింపుకు మీరు మీ నైతిక సమర్థన అందజేస్తున్నారు. అది చూసి, ప్రస్తుత పరిస్థితుల్లో కళ పలువిధాలుగా ఉపేక్షకు గురి అవుతున్నట్లు కనిపిస్తున్నా బ్రౌనింగ్ అన్న 'The glory and good of art' ఇంకా తన ప్రాధాన్యతను నిలబెట్టుకోగలుగుతూనే ఉంది, అనే నా నమ్మకం మరింత బలపడింది. నేను కె.కె. బిర్లా ఫౌండేషన్‌కు, దీన్ని నడిపే సదాశయాలకు, ఈ కార్యక్రమాన్ని సార్థకంగా, అవిస్మరణీయంగా చేసిన మీకు కృతజ్ఞుణ్ణి.

## జీవితం, సాహిత్యం (సంగ్రహంగా) :

మనోజ్‌దాస్ ప్రఖ్యాతి పొందిన సమకాలీన కథా రచయిత. ఆంగ్లంలో రాసే భారతీయ రచయితల్లో ఒకడుగా అశేష పాఠకుల మన్ననలందినా రెండు భాషల్లోనూ రచనలు చేసే భారతీయ రచయితల్లో ఈయన అందరికంటే ఎక్కువ ఖ్యాతి పొందారు. ఆంగ్లంలో 40 రచనలు వెలువరించిన మనోజ్ దాస్ తన మాతృభాష ఒరియాలో కూడా 40 రచనలు వెలువరించారు.

''మనోజ్ దాస్ కథలు చదివి నేను చాలా ఆనందించాను. అవి నా అల్మారాలో R.K. నారాయణ్ కథల సరసన చోటు సంపాదించుకుంటాయనడంలో సందేహం లేదు. నా ఊహలో ఒరిస్సాకు, మాల్గుడికి చాలా తేడా ఉండేది. అయితే ఆశ్చర్యమేమిటంటే వీరిద్దరి కథలు దాదాపు ఒకే ప్రకృతికి చెందినవే" అంటారు ప్రసిద్ధ ఆంగ్ల రచయిత గ్రాహమ్ గ్రీన్. గ్రీన్ మాత్రమే కాక పాశ్చాత్య దేశాల్లోని ఆయన ప్రశంసకుల్లో H.R.F. కీటింగ్, విమర్శకుడు A. రసెల్ లాంటి వారు కూడా ఉన్నారు.

రసెల్ వీరిని గురించి ఇలా అన్నాడు— "మనోజ్ దాస్ నిస్సందేహంగా ఈ ఉపఖండంలోని గొప్ప కథా రచయిత. ఆయనలాగా రాయగలిగిన వారు బహుకొద్ది మందే ఉన్నారు. ఆయన కళా కౌశలాన్ని కొలిచేందుకు ఎలాంటి కొలమానాలు ఉపయోగించినా, అవి ఉత్తమమైన కథలుగా నిలుస్తాయి. మానవుని మనసును గొప్పగా ఆవిష్కరిస్తాయి. యథార్థ వాదులు యథార్థాన్ని ఏ విధంగా అర్థం చేసుకుంటారో, అది అంతకంటే కూడా సమృద్ధమైందని రుజువు చేస్తారు."

ప్రపంచంలోని అధ్యయనపరులంతా ఆయన కథల్లో, నవలల్లో భారతీయత ఉత్కృష్ట రూపాన్ని చూడగలుగు తున్నారు. భారతదేశ సాహిత్య–సాంస్కృతిక వారసత్వం యొక్క గొప్ప వ్యాఖ్యతగా కూడా ఆయనకు గుర్తింపు ఉంది.

ఒరిస్సాలో సముద్ర తీర ప్రాంతంలోని ఒక పల్లెటూళ్ళో 1934లో జన్మించిన మనోజ్ దాస్ గ్రామీణ ప్రజల ఆప్యాయతల మధ్య, ప్రకృతి రమణీయత మధ్య, పచ్చటి పచ్చిక బయళ్ళ మధ్య, తామరపువ్వులతో నిండిన జలాశయాల మధ్య, సముద్రతీర సమీపంలో పెరిగారు. అక్కడే ఆయనకు విధ్వంసకరమైన తుఫాను, దానివెంట వచ్చిన దుర్భిక్షం కూడా అనుభవంలోకి వచ్చాయి. ఎనిమిదేళ్ళ వయసులోనే సముద్రతీరంలో నివసించే సుసంపన్నులైన వారి ఇంటిని బందిపోటు దొంగలు క్రూరంగా దోచుకోవడం రెండుసార్లు చూడవలసి కూడా వచ్చింది.

పట్టణంలో చదువుకుంటూ ఉండే రోజుల్లో ఆయన అప్రయత్నంగానే రచనవైపు మళ్ళారు. ఒరియాలో ఆయన మొదటి పుస్తకం— 'శతాబ్దీర్ ఆర్తనాద్' (1949) అనే కవితా సంపుటి వెలువడే నాటికి ఆయన వయసు 14 సంవత్సరాలు మాత్రమే. 15 ఏండ్ల ప్రాయంలో ఆయన 'దిగంత' అనే పత్రిక ఆరంభించారు. తర్వాతి కాలంలో అది ఒక విశిష్ట సాహిత్య పత్రికగా రూపొందింది.

జీవితంలోని కడగండ్లకు ఏదైనా నివారణోపాయాన్ని వెదికే ప్రయత్నంలో కాలేజీ జీవితంలో ఆయన విప్లవాది అయిన యువనాయకుడుగా ఎదిగారు, ఎన్నో అధికార వ్యతిరేక ప్రదర్శనలకు నాయకత్వం వహించారు, జైలుకు వెళ్ళారు. యూనివర్సిటీ లా కాలేజీ యూనియన్ అధ్యక్ష పదవికి పోటీ లేకుండా ఎన్నికయ్యారు, స్టూడెంట్ ఫెడరేషనుకు జెనరల్ సెక్రటరీ అయ్యారు, 1956లో ఇండోనేసియాలోని బాండుంగ్ నగరంలో ఏర్పాటైన Afro-Asian Students Conferenceలో ప్రధానమైన పాత్ర నిర్వహించారు.

తాత్విక జిజ్ఞాస వీరిని మార్క్సికవాదం వైపు తీసుకెళ్ళడంతో కటక్‌లో నాలుగేండ్ల పాటు ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేసిన తర్వాత కుజంగ్ రాజవంశీయురాలు, స్వాతంత్ర్య సమరయోధులుగా పేరున్న దంపతుల కూతురు, అయిన తన భార్య ప్రతిజ్ఞాదేవితో కలిసి 1963లో పాండిచ్చేరిలోని అరవింద్ ఆశ్రమానికి వెళ్ళారు.

ఆ తర్వాత అదే వారికి స్థిరనివాసమైంది.

అక్కడి శ్రీ అరవింద అంతర్జాతీయ విద్యా సంస్థలో ఆంగ్ల సాహిత్యము, శ్రీ అరవిందుని సాహిత్యము బోధిస్తున్నారు. ప్రతిజ్ఞా దేవి మనస్తత్వశాస్త్రం బోధిస్తున్నారు.

భారతదేశ సాహిత్య– సాంస్కృతిక వారసత్వానికి దక్షుడైన వ్యాఖ్యాతగా కూడా వీరు పేరుపొందారు.

★★★

**మనోజ్‌దాసుతో డా॥ పి. రాజా జరిపిన సంభాషణ లోని కొన్ని భాగాలు:**

***రాజా :*** మనోజ్‌దాసుగారూ! ఆకాశవాణి జాతీయ కార్యక్రమానికి మీకు స్వాగతం. మనమిక్కడ మామూలు సంభాషణలో చర్చించుకునే విషయాలు దేశంలో అసంఖ్యాకంగా ఉన్న మీ పాఠకులకు చాలా అసక్తికరంగా ఉంటాయని నా నమ్మకం.

***మనోజ్‌దాస్ :*** మీ ఆశావాదానికి ధన్యవాదాలు. అయితే పరీక్ష పెట్టే ప్రశ్నలంటే నాకు బెరుకు. నా అవగాహనకు మించిన ప్రశ్నలు మీరు అడగరని ఆశించవచ్చు కదా!

***రాజా :*** మీ అవగాహనకు మించిన ప్రశ్నలా? మీ సృజన శక్తికి, మీ అనుభవానికి ఉన్న విస్తృతిని చూస్తే మీతో సంభాషించే వాళ్ళెవరూ దాన్ని దాటలేరనేది స్పష్టం! మొదటగా నేను తెలుసుకోదలచుకున్న విషయమేమిటంటే మీ సృజనశీలతకు మూలాధారమైన ప్రేరణ ఏమిటని. మీరు ఎప్పుడు, ఎలా వ్రాయడం మొదలు పెట్టారు? దానికి దోహదం చేసిన కారకాలు ఏమిటి?

***మనోజ్‌దాస్ :*** నేను సుందర ప్రకృతి పరిసరాలలో పుట్టానని మీకు తెలుసు. సముద్రం,కలువ పూలతో నిండిన చెరువులు... గ్రామీణ ప్రాంతం, పూర్తి ఏకాంతం. చుట్టూ చాలా ఎత్తయిన ఇసుక తిన్నెలు ఉండడం వల్ల, ఎద్దులబండి కూడ చేరుకోలేని చోటది. ప్రకృతి అద్భుతాల పట్ల నాలో కలిగిన ప్రతిస్పందనలకు సంబంధించిన నా చిన్ననాటి జ్ఞాపకాలలో ఒకటి, అప్పటిక బాగా పరిగెత్తడం కూడా వచ్చేది కాదు. మేఘాలు కమ్ముకున్న రోజు. తూర్పు ఆకాశాన్ని కొలుస్తున్న కొలబద్ధలాగా ఇంద్రధనుస్సు నాకు కనిపించింది. దాని అంచులు నాకు చాలా దగ్గరగా చెట్లవెనక భూమి పైకి వంగి ఉన్నట్లు కనిపించాయి. దానిని పట్టుకోడానికి పరుగు తీసి చాలా దూరం వెళ్ళిపోయా. అది చూసి మా పల్లెవాడు పరిగెత్తుకుంటూ వచ్చి, పట్టుకొని ఎత్తుకొని ఇంటి దగ్గర వదిలిపెట్టాడు. నిజానికి పిల్లలు ఆరోజుల్లో ఊరి మొత్తానికి చెందేవారు. మా ఊరి వాళ్ళంతా ఆప్యాయత చూపేవారు. ఆ తరువాత తుఫాను, కరువు వచ్చి గ్రామవాసుల సర్వస్వం హరించి వేశాయి. అది చాలదని ఒక అర్ధరాత్రి దొంగలు చొరబడి మా ఇంటిలో ఉన్న సామానంతా దోచుకొని ఒక గంటలోనే మమ్మల్ని నిరుపేదలను చేశారు. అయితే అలాంటి భయం గొలుపే సంఘటనలు కూడా మానవ నైజంలో ఊహించరాని అనేకాంశాలను నా అనుభవంలోకి తెచ్చాయి. నిదర్శనంగా ఒక విషయం చెప్తా. దొంగలు మా నాన్న చేతులు ఆయన వీపుకు బిగించి కట్టేశారు. ఆయన మంచంపైన కూర్చొని, కొన్ని తరాలుగా మా ఇంట్లో ఉంటూ వచ్చిన బంగారు అభరణాలు, దేవతా విగ్రహాలు అవి మా అమ్మవి, దొంగలు ఆయన కళ్ళముందే మూట కట్టుకుంటుంటే చూస్తూ ఉండిపోయాడు. అయితే వాళ్ళల్లో ఒక్కడు వెండి నగిషీ చేసిన మూడు హుక్కాలు సర్దుకుంటుంటే చూసి ఆయన ఒక్కసారిగా వాణ్ని అదిలించాడు 'మీ ఇరవై తరాలలో కూడా మర్యాదస్తుడెవ్వడూ పుట్టలేదా? దొంగవెధవలు మీరంతా వెళ్ళిపోయిన తరువాత నేను పొగ ఎలా తాగుతా ననుకుంటున్నారు?" ఇకవాడు ఆ అందమైన హుక్కాలను అక్కడే వదలేశాడు!

***రాజా :*** చాలా తమాషాగా ఉంది.

***మనోజ్‌దాస్ :*** కాదా మరి. ఆశ్చర్యం కూడా. ఇలాంటి అనేక సంఘటనలు, మనిషి స్వరూప స్వభావాలకు, ప్రపంచ పోకడలకు సంబంధించిన నా అవగాహనకు ఆధారాలే. అప్పుడప్పుడు నాకు అనిపిస్తుంది. ఇవన్ని లేకుండా ఉంటే ఎలా రాయగలిగేవాణ్ణి అని. నిజానికి అనేక విధాలైన అనుభవాలు మనందరిని అన్నిపరిస్థితుల్లోనూ చుట్టుకుని వుంటాయి. అందువల్ల నా రచనలకు ఎవరైన అభినందనలు తెలిపినపుడు చార్లీ చాపియన్ సినిమాలోని ఒక దృశ్యం గుర్తొస్తుంది. దేశదిమ్మరి అయిన హీరోనో, యాంటి హీరోనో అయిన అతడు ఒక పబ్లిక్ పార్కులో బెంచీపై పడుకొని రాత్రి గడిపేస్తాడు. ఉదయం సైనికుల పటాలం ఒకటి అతని ముందు మార్చిచేస్తూ వెళుతుండడం చూసి, లేచి కూర్చుంటాడు. ఇక చూడు, ఎంత ఆశ్చర్యం! సైనికులంతా అతనికి సెల్యూట్ చేస్తూ కనిపిస్తారు. హడావుడిగా అతను నుంచొని డాబుగా వాళ్ళ సెల్యూట్‌కి బదులు సెల్యూట్ చేస్తూ ఉండిపోతాడు. అయితే వాళ్ళంతా వెళ్ళిపోయిన తరువాత అనుమానం వేస్తుంది. వాళ్ళు నా కంత ప్రత్యేకంగా గౌరవం ఎందుకు చూపారు? అని ఆలోచిస్తూ కలయ చూస్తాడు. అప్పుడు అతని వెనకగా రాజఠీవి ఉట్టిపడే అబ్రహం లింకన్ విగ్రహం ఉండటం కనిపిస్తుంది. నన్ను రచయితగా చేసిన

కారకాలు గర్తుకు వచినప్పుడల్లా ఇలాంటి అభినందనలకు నేను తగుదునా? అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. ఇక్కడ నేను రచయితలలో అంతర్గతంగా ఉండే సహజ ప్రేరణ పాత్రకున్న ప్రాధాన్యాన్ని తగ్గించి చెప్పడం లేదు. అది కూడా ఒక వరమే. అది నేను కోరుకున్నంత మాత్రాన్నే చేతికందే వస్తువేమీ కాదు.

***రాజా :*** మీ కథా సాహిత్యం పైన పరిశోధన చేసిన వ్యక్తిగా ఇతరులనేకుల లాగానే నేను కూడా ఆంగ్లంలో మీరింత గొప్పగా రాయగలగడం చూసి ఆశ్చర్యపోతూ ఉంటాను. ఇక ఒరిస్సా పండితులు చాలా మంది ఒరియా సాహిత్యంలో మీకు అత్యున్నత స్థానం ఉందని చెప్పగా విన్నాను. రెండు భాషలపైనా అంత పట్టు మీరు ఎలా సాధించారు?

***మనోజ్‌దాస్ :*** ఇందులో విచిత్రం ఏమీలేదు. చాలా మంది ఇంతకు మించి కూడా సాధించారు. నా మాతృభాషలో సౌలభ్యం నాకు సహజంగానే అబ్బింది. ముఖ్యంగా మా అమ్మ కాదంబినీదేవి వల్ల. ఆమె గొప్ప సాహిత్యాభిమాని, స్వయంగా కవయిత్రి కూడా. తన గురించి అందరికీ తెలియాలనే కోరిక ఆమెకు ఉండేది కాదు. నాకు అక్షరజ్ఞానం కలగక ముందే ఆమె నాకు ఒరియా సాహిత్యంలోని శ్రేష్ఠ రచనలతో పరిచయం కలిగించింది. నేను ఇంగ్లీషులో రాయడం మాత్రం కొన్ని రెచ్చగొట్టే పరిస్థితుల్లో మొదలైంది. నేను బి.ఎ. చదువుతున్న రోజుల్లో ఆంగ్లంలో చాలా బాగా రాస్తాడని చెప్పబడే ఒక వ్యక్తి, భారతీయ గ్రామీణ జీవితంపైన రాసిన ఒక రచనను నా మిత్రుడు నాకు చదివి వినిపించాడు. అందులో వాస్తవిక చిత్రణగానీ, భారత గ్రామీణ ప్రాంతం యొక్క ఆత్మగానీ ఏమీ లేదు. అప్పుడు మారుమూల ప్రాంతంలో, కల్తీలేని పల్లెగాలిలో పుట్టి పెరిగిన నాకు వాటిని గరించి తెలుసుకోవాలని ఆసక్తి ఉన్న వాళ్ళ కోసం ఆంగ్లంలో ఆ పరిసరాలను సాకారం చేయవలసిన బాధ్యత, చేసే అధికారం ఉన్నాయనిపించింది. అయితే ఆంగ్లభాష ఆత్మలో నా ప్రవేశం మాత్రం శ్రీ అరవిందుని రచనల ద్వారానే జరిగింది. ఆంగ్లభాష కోసం ఆయన సాధించిన భావ ప్రకటనా సౌలభ్యం గాంభీర్యం వీటి విస్తృతిని ఆంగ్లపండితులుగానీ, భారతీయపండితులుగానీ ఇంకా అర్థం చేసుకోలేదు. అయితే ఆంగ్లమైనా, ఒరియా అయినా, నేను మాత్రం ఇప్పుడిప్పుడే మొదలుపెట్టిన విద్యార్థినే. నా వయస్సు దృష్ట్యా చివరి వరకు విద్యార్థిగానే ఉంటాను. ఒరియాలో స్కూలు కుర్రాన్ని, ఆంగ్లంలోని నర్సరీ పిల్లవాణ్ని. ఇక్కడ ఆంగ్లం అంటే శ్రీ అరవిందుడు రాసి చూపిన ఆంగ్లభాష.

***రాజా :*** చిత్రంగా ఉంది. అయితే శ్రీ అరవిందుడు మీకు ఆధ్యాత్మిక గురువేకాక ఆంగ్లభాష గురువు కూడా అన్నమాట!

***మనోజ్‌దాస్ :*** అవును. అయితే నాకు ఒక్కడికే కాదు, అనేక రచయితలకు కూడా ఆయన గురువు. అమల్ కిరణ్, కేడీ సేత్నా, కవిగా మారిన డా॥ నిరోద్ బరన్ లాంటి ప్రతిభావంతులైన శిష్యులు కూడా వారిలో చేరినవారే. మీకు తెలిసే ఉండొచ్చు, నూరు సంవత్సరాలు నిండిన వీరిద్దరు మన మధ్య ఇంకా ఉన్నారు. అమల్ కిరణ్, శ్రీ అరవిందునితో ఆయన రచించిన మహత్ గ్రంథం 'సావిత్రి'కి సంబంధించిన అనేకాంశాలతో సహా భాషా సాహిత్యం గురించిన ఉత్తర ప్రత్యుత్తరాలను పండితులు ఒక బంగారు గనిగా భావిస్తారు.

***రాజా :*** అరవిందుని రచనలపట్ల పాశ్చాత్య ప్రపంచ స్పందన సంతృప్తికరంగా ఉందా?

***మనోజ్‌దాస్ :*** అది సాపేక్షమనే చెప్పాల్సి ఉంటుంది. శ్రీ అరవిందుని భవిష్యత్ దర్శనాన్ని అంటే మానవుని సృష్టి, అతని మానసిక వికాసంతో, జీవ వికాస సంక్రమం సమాప్తి చెందలేదని, శ్రీ అరవిందుడు చూపిన వెలుగుబాటలో పయనించి మానవుడు ఉజ్జ్వల భవిష్యత్తును పొందగలుగు తాడని నమ్మిన నాలాంటి వాళ్ళకు ప్రపంచ ప్రతిస్పందన ఇంకా ఉత్సాహకరంగా లేదు. అయితే తటస్థంగా చూస్తే మాత్రం పాత ఆలోచనా ధోరణులకు సంప్రదాయ భావనలకు విడదీయరాని విధంగా హత్తుకుపోయిన ప్రపంచాన్ని చూసినపుడు అది చాలా సంతోషకరంగా ఉంటుంది. ఆయన రచనలు అన్ని ప్రధాన భాషల్లోకి అనువదించబడ్డాయి. ఇక్కడ మనం గుర్తుంచుకోవలసిన విషయం ప్రత్నామ్నాయ మతాన్ని ప్రతిపాదించడంలోగాని, ప్రచారంచేయడంలో గాని అరవిందునికి నమ్మకంలేదు. మార్పుగానీ, మెలకువగాని దాని ధర్మాన్నానుసరించి అదే రావాలి. వచ్చి తీరాలి. ఎందుకంటే రూపాంతర పరిణామం చెందే మానవుని శక్తిని వికాసానికి సంబంధించిన అతని భవితవ్యాన్నీ చివరకు ఏ శక్తీ అడ్డుకోలేదు.

***(ఆకాశవాణి, న్యూఢిల్లీ సౌజన్యంతో)***

# తెలుగు నాటకరంగ చరిత్ర

**- గోపాలకృష్ణ అబ్బూరి**

తెలుగులో కవిత, కథ, నవల మొదలైన ప్రక్రియల గురించిన విమర్శ ఆయా ప్రక్రియలలో అభివృద్ధికి దోహదం చేసింది. కాని తెలుగులో నాటక విమర్శ అన్నది ఇంకా ప్రారంభం కావాల్సిన విశేషంగానే మిగిలిపోయింది. నాటక రచన, ప్రదర్శనలలో తెలుగువారు సాధించినది బహుస్వల్పం. సరి అయిన విమర్శ లేకపోవడం వొక ప్రధాన కారణమే అయినా, అభిరుచిరాహిత్యం తెలుగునాటక ప్రగతికి పెద్ద ఆటంకంగా పరిణమించింది. అఖిల భారత స్థాయిలో బెంగాలీ, మరాఠీ, హిందీ, గుజరాత్, అస్సామీ, మలయాళీ, కన్నడ, తమిళ భాషలతో పోలిస్తే మన తెలుగు నాటక రంగం అర్ధశతాబ్దం వెనకబడి వున్నదని చెప్పక తప్పదు. ఈ పరిస్థితికి దారితీసిన కారణాలను వెదికి పట్టుకుని, విశ్లేషించుకునే ముందు విహంగ దృష్టితో తెలుగు నాటక పరిణామ చరిత్రను వొకసారి సమీక్షించుకోవలసిన అవసరం వుంది.

ఆంధ్రదేశంలో క్రీస్తుశకం ప్రథమ శతాబ్దానికే పూర్ణవికాసం పొందిన రూపక ప్రక్రియ వొకటివున్నట్లు పురావస్తు సాక్ష్యాల ఆధారంగా తెలుస్తోంది. అమరావతిలో లభించి, ప్రస్తుతం లండన్‌లో వున్న బ్రిటిష్ మ్యూజియంలో ప్రదర్శితమౌతున్న వొక ఫలకం మీద వొక రూపక ప్రదర్శన దృశ్యం శిల్పరూపంలో కనిపిస్తుంది. ఇందులో నేపథ్యంలో వేషధారణ చేస్తున్న నటులూ, రంగస్థలం మధ్యన నటీనటుల అభినయమూ, అందుకు తగిన సంగీతాన్ని అందిస్తున్న వాద్యకారులూ, గాయకులూ కనిపిస్తారు. రంగస్థలసామగ్రి (Stage Property) ని వినియోగించడం కూడా చూడవచ్చు. దాదాపు ఇదే విధమైన రంగస్థల ప్రదర్శన దృశ్యాన్ని అజంతా గుహలలో (1వ గుహ) వర్ణచిత్ర రూపంగా చూడవచ్చు. అమరావతీ శిల్పకాలం క్రీ.శ. 1, 2 శతాబ్దాల మధ్య కాలం కాగా, అజంతా చిత్ర కాలం క్రీ.శ. 5వ శతాబ్దికి చెందినది. నాగార్జునకొండలో యక్షిణి హారీతి దేవాలయ ప్రాంగణంలో వున్న ఆరుబయలు నాటకశాల నిర్మాణవైఖరి, అమరావతి అజంతా చిత్రాలలో కనిపించే దృశ్యాల కనుగుణంగానే వున్నది. ఈ శిల్ప చిత్రాలలో కనిపించే నాటక ప్రదర్శనా వైఖరి ఈ నాటికీ కొన వూపిరితో జీవించి వున్న యక్షగాన రూపక ప్రదర్శనా విధానానికి భిన్నంగా లేదన్నది మాత్రం గమనార్హమైన విషయం. మూడు వైపులా ప్రేక్షకులు కూర్చొని వుండగా మధ్యలో నాటక ప్రదర్శన సాగేది. నటీనటుల వెనక భాగంలో వాద్యకారులూ, బృంద గాయకులు కూర్చొని వుండేవారు. ప్రేక్షకులు కూర్చొనే స్థలం ఎత్తుగా వుండగా, రంగస్థలం పల్లంలో వుండేది. ఇదే క్రీస్తు శకం 1వ శతాబ్దం నుంచీ 5,6 శతాబ్దాల దాకా వాడుకలో వున్నట్లు ఆధారాల ద్వారా నిర్ధారితమైన రూపం. ఇదే రూపంలో వున్న నాటక శాలలు తరువాతి కాలంలో కూడా కొనసాగి వుంటాయని భావించడం అసంగతం కాబోదు.

ఇంక రూపక ప్రక్రియ గురించి చెప్పుకోవలసి వుంది. ఈ రూపకాల ప్రతులు మనకు కేవలం 15వ శతాబ్దం నుంచే అందివస్తున్నాయి. ఆ ప్రతుల ఆధారంగానూ, ఇతర గ్రంథాలలోని ప్రస్తావనల ఆధారంగానూ రూపక చరిత్ర నిర్మాణం అసమగ్రంగా నైనా జరిగింది. మనకు తెలిసినంతలో శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు మనకు పరిచితమైన తొలి యక్షగానకర్త. ఈనాటికీ అనేక గ్రంథాలయాల్లో అపరిష్కృతంగా పడివున్న తాళపత్ర ప్రతుల్లో కనిపిస్తున్న గుత్తెనదీవి రామాయణంలోని కీర్తనలూ, రచనాశైలీ సంవిధానాలను బట్టి చూస్తే అన్నమయ్య రచనగా కనిపిస్తోంది.

డా. అబ్బూరి గోపాలకృష్ణ : నాటక, చిత్రకళారంగాలకు సుపరిచితులు, ప్రసిద్ధ రచయిత, ఫోన్ : 0891-2567268

ఇక నాటక రంగ చరిత్రలో 16-17 శతాబ్దుల కాలంనాటి యక్షగానాలే అత్యధిక సంఖ్యలో కనిపిస్తున్నాయి. నాటినుంచీ నేటివరకూ ఈ రూపకాలు ఆంధ్రదేశమంతటా వ్యాపించి వున్నాయి. తంజావూరుకు చెందిన లింగం గుంట మాతృభూతకవి రచన ఈనాటి కూచిపూడి భాగవతులు ప్రదర్శిస్తున్న భామాకలాపంలో ఎనభై శాతం వరకూ వున్నది అంటే, మాతృభూతకవి రచన ఎంత వ్యాప్తి పొందిందో గ్రహించవచ్చు.


యక్షగాన రూపకాలలో కేవలం పౌరాణిక ఇతివృత్తాలే గాక సాంఘిక సమస్యలుకూడా ఇతివృత్తాలైనాయి. తంజాపురాన్నదాన మహానాటకం, సతీదానశూరం, క్రోధాపురీ రైతు విజయం వంటి సాంఘిక రూపకాలూ యక్షగానాలలో కనిపిస్తాయి. 1850 ప్రాంతాలలో విశాఖ జిల్లాలో పరిపాలకులలో కనిపించే ఆశ్రిత పక్షపాతం, లంచగొండితనం వంటి విషయాలు ఇతివృత్తంగా యక్షగాన రూపకాలు ప్రదర్శితమౌతున్నట్లు విశాఖజిల్లా వృత్తాంత సంగ్రహం ద్వారా తెలుస్తున్నది. వీటికి అత్యధిక జనాదరణ లభిస్తున్నట్లూ తెలుస్తోంది. కాని రూపకాల పేర్లూ రచయితల పేర్లూ లభించక పోవడం దురదృష్టం. అయితే యక్షగాన రూపకాల ప్రదర్శన విధానంలోనే వున్న వెసులుబాటును అనుసరించి కథకు సంబంధించని శకల ప్రాయమైన రచనలనూ ప్రదర్శించే ఆచారమూ ఉన్నది. ఈ పద్ధతిలోనే క్షీరసాగర మథనం వంటి రూపకంలో సుంకరి కొండయ, పాలుపెరుగులమ్మే పడుచు పాత్రలను ప్రవేశపెట్టి పన్ను వసూళ్లు, పరిపాలకుల అవినీతి, సామాజిక దుర్వర్తనల గురించి వ్యంగ్య హాస్య భరితమైన దృశ్యాలను ప్రదర్శించే వారు. మాచుపల్లి కైఫీయతులలో పేర్కొన్న సంబెట గురవరాజు కథ ఇటువంటిదే. తంజావూరు రాజ్యంలో నాయక రాజుల కాలంలో రచితమైన అనేక యక్షగాన రూపకాలలో సమకాలీన సమాజ వృత్తాంతాలు చోటు చేసుకున్నాయి. ఇతివృత్తం పురాణ సంబంధమైనప్పటికీ, రచయితలు సమకాలీన జీవన విధానాన్ని తమ రూపకాల్లో ప్రదర్శించారు.

యక్షగాన రూపకాలు 'పరిపూర్ణ నాటకశైలికి' (Total Theatre Style) చెందినవి. వీటిలో సంగీతం, సాహిత్యం, నృత్యం, నాట్యం, చిత్రలేఖనం, గారడి వంటి అనేక ప్రక్రియలకు ప్రవేశం వుండేది. తెలుగు కన్నడ భాషలకు యక్షగానంగా సుపరిచితమైన ఈ కళారూపమే ఇతర భాషా ప్రాంతాలలో ప్రాంతీయ శైలులతో వివిధ నామాలతో వ్యవహృతమవుతూ వస్తున్నది. గుజరాత్‌కు చెందిన భవాయి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 'నౌటంకి', బెంగాల్ ఒరిస్సాలకు చెందిన జాత్ర, కేరళకు చెందిన కథాకళి వంటి రూపాలన్నీ అతిప్రాచీనమైన యక్షగాన సంప్రదాయాన్నుంచే ఉద్భవించిన రూపాలు. అన్ని విధాలా ఆధునిక భావ ప్రకటనకూ, ఈనాటి సంక్లిష్ట జీవన విధానాన్ని ప్రదర్శించగల కళారూపాలు ఇవి. ఆంధ్ర కర్ణాటకలకు వస్తే యక్షగానం ప్రాంతీయ రూపాలను సంతరించుకొన్నా చక్కని రంగ మర్యాదలను రూపొందించుకొన్న రూపక విశేషం. యక్షగాన రూపక ప్రాచుర్యం యెంతటిదంటే, సంస్కృత నాటకాన్ని తెలుగులోకి రాకుండా నిరోధించగలిగింది. సంగ్రహంగా ఇది మన రూపక శైలి అయిన యక్షగానాల విషయం.

ఇంక ఆధునిక యుగం ప్రారంభంలో తలెత్తిన 'ఆధునిక తెలుగు నాటక రంగం' గురించి చెప్పుకోవాలి. మన నాటక చరిత్రకారులందరూ ఆధునిక తెలుగు నాటక రంగాన్నే అసలు నాటక రంగంగా భావించి పెద్ద పొరబాటు చేశారు. ధార్వాడ నాటకాల ప్రభావంవల్లనే తెలుగునాటకం ఆవిర్భవించిం దన్నంతగా ఒక వాస్తవదూరమైన విషయాన్ని ప్రచారం చేశారు. ఈ విషయాన్ని సరైన విధానంలో పరిశీలించి వాస్తవాలను గ్రహించవలసి వుంది. వక్రగతిలో సాగిన చరిత్ర రచనను తిరస్కరించి చరిత్రను సక్రమపద్ధతిలో నిర్మించుకోవలసి వుంది.

గత శతాబ్దపు మధ్యకాలంలో 1842లో కర్నాటక రాష్ట్రంలోని ఉత్తర కెనరా ప్రాంతాలనుంచి వొక యక్షగాన బృందం మహారాష్ట్రలోని సాంగ్లీ సంస్థానానికి వెళ్లి అక్కడి సంస్థానాధీశుడి సమ్ముఖాన ప్రదర్శన ఇచ్చింది. ఆనాడు కన్నడ యక్షగాన బృందం ప్రదర్శించిన రూపకం 'సీతాస్వయంవర'. సాంగ్లీ సంస్థానాధీశుడైన రాజా అప్పాసాహెబ్ ఆ రూపకాన్ని చూసి ఆనందభరితుడై తన ఆస్థాన సంకీర్తనకారుడైన విష్ణుపంత్ భావేను, ఆ రూపకాన్ని మరాఠీలోకి అనువదించ మని ఆజ్ఞాపించారు. రాజాసాహెబ్ ఆజ్ఞానుసారం విష్ణుపంత్ భావే యథామూలంగా ఆ కన్నడ యక్షగాన రూపకాన్ని మరాఠీ భాషలోకి అనువదించి, అదేశైలిలో ప్రదర్శింపచేశాడు. ఈ రూపక ప్రథమ ప్రదర్శన 1843లో జరిగింది. ఆ నాటకశైలిలోనే విష్ణుపంత్ భావే, తదనంతరం ఆయన

అనుయాయులు మరికొన్ని నాటకాలను వివిధ పురాణేతి వృత్తాలతో రచించారు. "The Marathi plays of Tanjore did not materially differ from Bhave's productions" అంటారు ప్రఖ్యాత మహారాష్ట్ర నాటక విమర్శకులు శ్రీ బాపూరావ్ నాయక్ గారు (The Marathi Theatre). ఇక్కడ నాయక్‌గారు 'మరాఠీ ప్లేస్' ఆఫ్ టాంజోర్' అనడం గమనార్హం. తంజావూరులో తెలుగు తమిళ, కన్నడ భాషలతోపాటు మరాఠీలో కూడా యక్షగాన రూపకాల రచన సాగింది. యక్షగాన రూపకశైలి భావే రచనలో కూడా కనిపిస్తోందంటే



విష్ణుపంత్ భావే మరాఠీలో యక్షగానరూపక రచన చేశాడని కదా అర్థం! ఆనాటికి అవే తొలి మరాఠీ నాటక ప్రదర్శనలు. మరాఠీలో అంతకు ముందు నాటక ప్రదర్శనలు లేవన్నది గమనార్హం. కాలక్రమేణా సాంగ్లీనాటక సమాజం విచ్ఛిన్నమైపోయి నాలుగు నాటక సమాజాలుగా యేర్పడడం జరిగింది. అలాగే యేర్పడిన సమాజాలలో వొకటి అలటేకర్ హిందూడ్రమెటిక్ కంపెనీ. ఇదే ధార్వాడ నాటక సమాజంగా యేర్పడింది. బొంబాయిలో ప్రదర్శిత మౌతున్న ఇంగ్లీష్ ఒపెరాలను చూసిన సమాజ నిర్వాహకులు అక్కడ గ్యాస్‌లైట్లనూ, రంగుల్లో దృశ్యాలను చిత్రించిన తెరలనూ, వేష భూషణా లంకారాలనూ, హార్మోనియంనూ సేకరించుకుని తమ ప్రదర్శనలలో వినియోగించడం ప్రారంభిం చారు. ఈ ధార్వాడ నాటక సమాజమే 1881 ప్రాంతంలో ఆంధ్రదేశంలో తమ ప్రదర్శనలతో పర్యటించారు. ఈ ప్రదర్శనలు హిందూస్థానీ భాషలో వుండేవి. తెలియని భాషలో, రంగు దృశ్యాల తెరల మధ్య గ్యాస్‌లైట్ల వెలుగులో కర్ణాటక హిందూస్థానీ రాగాల కలగాపులగంగా మారిన సంగీతంతో తెలుగు ప్రజలు సమ్మోహితులైనారు. పండితపామరులు ఈ ప్రదర్శనలకు కనకవర్షం కురిపించారు.

ఇక్కడ మనం గమనించవలసిన ఆశ్చర్యకరమైన విషయం యేమిటంటే తమ మధ్యనే జీవంగల భాషలో, కళా చాతుర్యం వుట్టిపడే వేషధారణతో, చక్కని అభినయంతో కనిపిస్తున్న యక్షగాన రూపకమే పైపై మెరుగులు సంతరించుకుని భాష వేషం మార్చుకుని మరాఠా నాటకంగా వచ్చిందన్న విషయాన్ని ఆనాటి పామరులు కాదు గదా పండితులు సైతం గమనించ లేదు. పోనీ ఇలాగ ఆకర్షితులైన తెలుగు వారు తమ యక్షగాన రూపకాలకు మెరుగులు దిద్ది ప్రదర్శించుకోవచ్చుననే భావననే మనసులోకి రానీయ లేదు. ధార్వాడ సమాజ నాటకాల వల్ల ఉత్తేజితులైన తెలుగు రచయితలు యక్షగాన రచనలకు పూనుకోలేదు. నాటక రచన చెయ్యాలంటే వొక వరవడి ఉండాలి. అర్థంకాని హిందూస్థానీ భాష తెలుగు పండితులకు సరైన వరవడిని ఇవ్వలేకపోయింది. నాటకాలకు వాడే భాష ప్రజలందరికీ అర్థం కావలసిన అవసరం లేదని ఆనాటి పండితులు భావించి వుండవచ్చు కూడా. ఆనాటి తెలుగు పండితులు అభ్యసించింది కావ్య భాషను మాత్రమే. గేయ రచనకన్న పద్య రచన వాళ్ళకి సులభం. అందుచేత కృతక కావ్యభాషలో పద్యాలతో తెలుగులో నాటక రచనను ప్రారంభించారు. ***కావ్యభాషలో సంభాషణలు పలకడంలో***

***ఇబ్బందిని అధిగమించడానికి నాటి నటులు కృతక శైలిని అనుసరించారు.*** తెలుగ పద్యాలను కర్ణాటక హిందూస్థానీ బాణీల కలగాపులగంగా మరాఠీ మెట్లలో పాడడం సాగించారు, మన సంగీత స్వరపద్ధతికి అంతగా అమరని హార్మోనియం సహకార వాద్యంగా ఉండడంతో నాటకాలలోని పద్యాలు వంకర నడకలు సాగించాయి. ఈ రకంగా యేర్పడిన కృతక రూపకానికే పౌరాణిక నాటకం అన్నపేరు వచ్చింది. దాదాపు అర్థశతాబ్దంపైగా ఈ పౌరాణిక రూపకం తెలుగు నాటక రంగాన్ని పరిపాలించింది. ఇప్పటిదాకా అసలు యక్షగాన రూపకం గురించీ, వేషం మార్చుకున్న కృతక నాటక రూపం గురించీ చెప్పుకున్నాం. అయితే ఇదే కాలంలో వచ్చిన మరొక శైలి నాటకాల గురించి చెప్పుకోవాల్సి వుంది.

అసలు ధార్వాడ నాటక సమాజం ఆంధ్రదేశంలో అడుగు పెట్టకముందే కందుకూరి వీరేశలింగం గారు 'వ్యవహార ధర్మబోధి'ని అన్న రూపకాన్ని చక్కని వాడుక భాషలో రాసి తన విద్యార్థులతో ప్రదపర్శింపచేశారు. ఆనాటి నాగరక సమాజంలో వెల్లివిరుస్తున్న అవినీతిని అన్ని కోణాలోంచీ చూపించారు. వీరేశలింగంగారి ఆవేదన ఆవేశంగా మారిపోవడం వలన పాత్ర మనస్తత్త్వ చిత్రీకరణా, సన్నివేశ కల్పనలో సమన్వయమూ, పాత్రలను మధ్య వుండవలసిన వైరుధ్యాలనూ, సంఘర్షణలనూ విస్మరించారు. 'వ్యవహార ధర్మబోధినిని ప్రహసనంగా పేర్కొంటున్నా, నిజానికి అందులో ప్రహస లక్షణాలేవీ లేవు. చక్కని నాటకంగా దానిని పరిగణించడంలో యెవరికీ అభ్యంతరం ఉండవలసిన అవసరంలేదు.

ఈ 'వ్యవహార ధర్మ బోధిని'ని విద్యార్థులచేత ఆయన 1880లో ప్రదర్శింపచేశారు. ఈ ప్రదర్శన ధార్వాడ కంపెనీ రాకకు ముందే జరిగింది. ఇది పూర్తిగా వచన నాటకం. ఈ రూపకానికి వరవడి ఆంగ్లంలోని నాటక రచన. నాటక రంగానికి అనుకూలమైన వ్యావహారిక భాష ప్రథమంగా విస్తృత విషయ వివరణకు వినియోగితమైంది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ నాటికీ ఈ నాటకం చదివీ, ప్రదర్శించీ ఆనందించతగినది. తెలుగు భాషలో, విదేశీ ప్రభావంతో ఆధునిక నాటకాన్ని రచించిన ఘనత కందుకూరి వారిదే. కందుకూరి వీరేశలింగం గారి రచన తెలుగులో వచన నాటకాలకు శ్రీకారం చుట్టింది. ఆంగ్ల సంప్రదాయాన్ని ఆంధ్రులకు పరిచయం చెయ్యడం జరిగింది.

అయితే తెలుగులో అన్ని అందాలనూ సంతరించు కున్న కన్యాశుల్కం వ్యవహార ధర్మబోధిని కన్నా ఎనిమిదేళ్లు మాత్రమే చిన్న. అయినా మేలి రచనగా భాసించింది. ఈ కన్యాశుల్కాన్ని గురించి ఇక్కడ క్లుప్తంగా చెప్పుకోవలసిన అంశాలు కొన్ని వున్నాయి. అయితే అవే విషయాలు చాలా వరకు వ్యవహార ధర్మబోధినికి కూడా అన్వయిస్తాయి. ఈ రెండు నాటకాలూ సంఘ సంస్కరణనూ, ప్రజాస్వామిక భావాలనూ ప్రధానంగా ప్రేక్షకుల ముందు నిలిపాయి. అప్పటి దాకా నల్ల ప్రభువుల కొలువుకూటల్లో 'నజరానా', నల్ల వుద్యోగుల జబర్దస్తీలో లంచంగా రూపు మార్చుకుంది. నల్ల ప్రభువుల భోగలాలసత నల్లవుద్యోగుల వ్యభిచారంగా రూపుదిద్దుకుంది. జాతిని నిర్వీర్యం చేస్తున్న శక్తులను ఈ రెండు నాటకాల్లో కందుకూరీ, గురజాడా తీవ్రంగా విమర్శించాడు. నవ్వుల పాలు చేశారు.

వచన నాటకాలలో సాటిలేని మేటి రచనగా కన్యాశుల్కం ఇటీవలనే నూరేళ్ల పండుగను జరుపుకుంది. యే వొక్క సంస్థగానీ, యేదో కొందరు వ్యక్తుల దానధర్మంగా గానీ కన్యాశుల్క నాటకపు శతజయంతి జరగలేదు. తెలుగు మాగాణపు నాలుగు చెరగులా ప్రదర్శనలు, సభలు, చర్చా గోష్ఠుల రూపంలో ఈ శతజయంత్యుత్సవాలు జరిగాయి. మహాకవికి ఆంధ్రప్రజలు కృతజ్ఞతాపూర్వక కైమోడ్పు లందించారు.

ఇంత జరుగుతున్నా కన్యాశుల్కం మీద విమర్శలు ఆగలేదు. నాటకంలో ఉదాత్త నాయకుడు లేడన్నది ప్రధానమైన ఆరోపణ. శూద్రకుడి నాటకం మృచ్ఛకటిక కూడా ధూర్త సంకులమే గదా! ఆ విషయం విమర్శకుల చెవికెక్కడం లేదు. ఇక్కడ కట్టమంచి రామలింగారెడ్డి గారు 'కవిత్వ తత్వవిచారం' లో రాసిన వాక్యాలనే కన్యాశుల్క విమర్శకులకు సమాధానంగా చెప్పవలసి వుంది. కట్టమంచి వారిలాగా అంటారు –

''కావ్యము, శిల్పము నీతిశాస్త్రముగాదు. ధర్మశాస్త్రముగాదు. శిల్పము యొక్క యుత్కర్ష నికర్షముల నేర్పరుప వలయునన్న దాని రచనా సంవిధానముల బట్టి నిరూపింప నగునే కాని, 'భగవద్గీతల యంత

**మిగతాది 28వ పుటలో...**




# మా నాన్నగారు

**వ్యాస సంకలనం - సంపాదకుడు: డా. ద్వానాశాస్త్రి :**
**అరవై రెండు మంది సాహితీవేత్తల జీవనం.**

"మరణించిన ప్రతి వృద్ధుడిలో ఒక గ్రంథాలయం వెళ్ళిపోతుంది.'' చాలా సంవత్సరాల క్రితం ఒక ఐక్యరాజ్యసమితి ఉన్నతాధికారి అన్న ఈ మాట నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. ప్రతి ప్రాచీన సమాజానికీ గ్రంథస్థం చెయ్యని చరిత్రే ఎక్కువ ఉంటుంది. మౌఖిక సాహిత్యాన్నీ, చరిత్రనీ పదిల పరుచుకునే ప్రయత్నం ఇటీవలి కాలం నుంచే ఆరంభమైంది. కుటుంబ చరిత్రలనూ, వలసలనూ, అనుభవాలనూ అనంతర సంతతి గ్రంథస్థం చెయ్యడం మనదేశంలో అరుదుగా జరిగింది. నిజానికిది అశ్రద్ధ కాదు. మన ప్రాపంచిక దృక్పథంవల్ల జరిగింది. ప్రపంచకవులందరికీ ఆది గురువు అనదగ్గ కాళిదాసు ఎవరు? అతని గురించి మనకి ఏం తెలుసు? వాల్మీకి, వ్యాసుడు అనే ఇద్దరు సూర్యుల గురించి ఏమీ తెలియదు. మధ్యయుగాలకి చెందిన ఏ కవి గురించీ మనకి తెలిసింది అత్యల్పం. నన్నయభట్టు, పెద్దన ఒకరేమిటి – పేర్లు, ఒక్కోసారి జన్మస్థలం గురించి మినహా ఏ వివరాలూ తెలియవు. వారెవరూ వారి గురించి కావ్యాంతంలో రాసుకోలేదు. వీరి తరువాతి వారూ వ్యక్తిగత వివరాల జోలికి పోలేదు. దీనిక్కారణం ఈ కాలంలో మనకి అర్థంగాని గొప్ప నమ్రభావం. ''కాలోహ్యయం నిరవధిర్విపులాచపృథ్వీ" అనుకోవడం సామాన్యులకి సాధ్యం కాదు. అదృష్ట వశాత్తూ ఆధునిక కాలంలో మన ముందు తరానికి చెందిన గొప్ప సాహితీమూర్తుల గురించి సమాచారం దొరుకుతోంది. మనకిప్పుడు అందుబాటులో ఉన్న సమాచారం అంతా సాహిత్య సంబంధమైంది. వారి వ్యక్తిగత జీవనం, ఒడిదుడుకులు, బలహీనతలు, సమకాలికులైన మిత్రులకు, అంతగా మిత్రులు కానివారికి కూడా పరిచయమే. అయినా ఈ పాఠకులకు వారు కవులు గానే తెలుసు. మన దేశంలో రచయితల బలహీనతల గురించి, వైఫల్యాల గురించి రాయడాన్ని జీర్ణించుకోలేరు. వ్యక్తి వేరు అతని సాహిత్యం వేరనే ఒక అనంగీకారమైన అభిప్రాయం వల్ల గొప్ప సాహితీ మూర్తుల, కళాకారుల సమగ్ర వ్యక్తిత్వం మనకి తెలియకుండా పోయింది. గొప్ప వ్యక్తికి సామాన్యులకు ఉండే బలహీనతలు ఉండకూడదనే మన చిత్రమైన నమ్మకం వెనక ఇతిహాసిక ప్రభావం ఉంది. సాంబమూర్తిగారు త్యాగరాజ స్వామివారికి బీరకాయ కూర ఇష్టమని రాశారు. మొగల్ వీరుడు బాబర్‌కి పుచ్చకాయలంటే వ్యామోహం. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి పెరగన్నంలో పంచాదార వేసుకోవడం ఇష్టం. విశ్వనాథకి వక్కపొడి ఇష్టం. శివశంకరశాస్త్రి గారికి కాఫీ ప్రాణం. పుట్టపర్తి వారు బీడీ ప్రియులు. బుద్ధుడికి ప్రథమ కోపం. అయితే ఏమిటి? ఏమంటే, ఇటువంటి చిన్న చిన్న విషయాలు ఆ వ్యక్తుల్ని మామూలు మనుషులుగా కుదించడమే గాక. వారిలో దగ్గరి తనం ఏర్పడ్డానికి దోహదం చేస్తాయి. ఆచార్య సర్వేపల్లి గోపాల్ తండ్రి గురించి రాసిన వివరాల్ని మన వాళ్ళు జీర్ణించుకోలేరు. పాఠకుల్లో ఈ ద్వంద్వ ప్రమాణాలుండడం వల్లనే రచయితలు హిపొక్రటిక్‌గా బతకడం అలవాటు చేసుకున్నారు. అంతెందుకు? మన పుస్తకాల వెనక రచయితల గురించిన వివరాలలో కుటుంబ సమాచారం ఉండదు. ఏ పాశ్చాత్య రచయిత పుస్తకం చూసినా ఆ వివరాలుంటాయి.

ద్వానాశాస్త్రి సంకలించిన ఈ పుస్తకంలో అరవై ఇద్దరు సాహితీ వేత్తల గురించి వారి సంతానం రాసిన

పరిచయకర్త : తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి : మేధావి, పర్యావరణ సంరక్షకులు, సెల్ : 9440703440.

జ్ఞాపకాలున్నాయి. ముందు మాటలో ద్వానాశాస్త్రిగా రన్నట్టు ఇటువంటి పుస్తకం తెలుగులో రాలేదు. అట్ట రంగు నాకు నచ్చలేదు గానీ బాపుగారి అర్థవంతమైన ముఖచిత్రం ఎవరూ గమనించినట్టులేదు. ప్రముఖ సాహిత్య వేత్తల వ్యక్తిగత జీవితాన్ని పాఠకులకు పరిచయం చెయ్యాలనే ఆలోచన ఆనందనీయం. పుస్తకం అనుక్రమణిక చూడగానే కొంతమంది ప్రముఖుల పేర్లు కనిపించక పోవడంతో కొంత అసంతృప్తి కలగడం సహజం. కానీ అరవై ఇద్దరి వారసుల్ని కలుసుకోవడం, వారు దొరకడం, రాయడానికి అంగీకరించడం, వెంటబడి రాయించడం, దాని కోసం ప్రయాణించడం సామాన్య విషయంగాదు. ఎంతో కొంత రాక్షస సంకల్పం ఉండి తీరాలి. సంపాదకుడు పడ్డ కష్టాలన్నీ మిత్రుడు గనక నాకు తెలుసు. ఇప్పటికే ఈ పుస్తకానికి మంచి ప్రచారం, ఆదరణా లభించాయి.

ఈ వ్యాసాలన్నీ చదివిన తరువాత నామనసు ఆర్ద్రమై పోయింది. ఈ సాహిత్య పిపాసువు లందరూ సాహిత్యాన్ని జీవితాన్ని గాఢంగా ప్రేమించిన వారు. చాలామందికి లోకజ్ఞిత పాలు తక్కువ. విస్తారంగా చదువుకోడం, అధ్యయనం, అక్షరం మీద అలౌకిక వ్యామోహంతో జీవన యానం సాగించినవారు. మనకిప్పుడు అర్థంగాని జ్ఞానదాహం, ఎన్ని ఒడుదుడుకులనైనా తృణప్రాయగా ఉపేక్షించి సాహిత్యాను భవాన్నే జీవన ప్రస్థానంగా సాగించారు. అటువంటి సాహిత్యకారులిప్పుడు కనిపించడంలేదు. వారిలో కొంతమందితో మాకు ఆత్మీయ సంబంధాలున్నాయి. వారి కష్టనష్టాలు మాకు ప్రత్యక్షంగా తెలుసు. ఆ స్నేహాలు తెలుసు. విభేధాలు, కోపాలు కూడా ఎరుగుదుం. ఎన్ని ఉన్నా పరస్పర గౌరవాలుండేవి. విశ్వనాథ వారికీ, శివశంకర శాస్త్రిగారికీ బోలెడు అభిప్రాయ భేదాలుండేవి. కానీ మా నాన్నగారు కాలేజీ చదువులో ఉన్నప్పుడు ఎంతో ఆప్యాయంగా యోగక్షేమాలు అడిగి ఏ సహాయం కావాలన్నా మొహమాట పడకుండా అడగమనే వారాయన. ఈ సంకలనంలో స్థూలంగా రెండు రకాల వ్యాసాలున్నాయి. ఒకటి, కేవలం సాహితీవేత్తలుగానే పరిచయం చేసినవి. రెండు వ్యక్తులుగా వారి సాహిత్య ప్రస్థానాన్ని పరిచయం చేసినవి. నిజానికి ఈ పుస్తకం ఉద్దేశ్యం రెండోది. అది నెరవేరలేదు. అంటే ప్రసిద్ధుడైన తండ్రిని వ్యక్తిగా పరిచయం చెయ్యడంలో స్వారస్యం చాలా మందికి తెలియలేదు. కొంత అసౌకర్యం అనిపించి ఉండవచ్చు. చాలా మందికి ఇటువంటి వ్యాస రచన అలవాటు లేకపోవడం కూడా ఒక కారణం. దీని వల్ల పుస్తకం విలువ తగ్గలేదు. ఎందుకంటే అన్ని వ్యాసాలు చదివిన తరవాత దివంగతులైన ఆ సాహితీమూర్తుల సాంగత్యం ఏర్పడిందనే భావన కలగడం.

అందుకే ద్వానా కృతకృత్యుడైనాడు. మాలాంటి వాళ్లని కొన్ని దశాబ్దాల వెనక్కి తీసుకు వెళ్ళగలిగాడు. సాహిత్య వారసత్వాన్ని అందిపుచ్చుకున్న వారి కొందరి వ్యాసాలు చదివినపుడు గొప్ప సంతోషం కలిగింది. పిల్లల చదువుల గురించీ, ఇంటి గురించీ పట్టించుకున్నవారు అరుదు. కానీ అనుసరణీయమైన ఒక సంస్కారవంతమై జీవితానికి సజీవమైన ఉదాహరణగా నిలిచినవారు వారంతా. "He was a great writer, true, but he was a greater farther. A great human being" వాకాటి పాండురంగారావుగారి అమ్మాయి కరుణ అన్నమాటలవి. ఆయన నిజాయితీ పిల్లలకి వారసత్వంగా ఇచ్చి వెళ్లేరాయన. ఒక అరపూట శలవుపెట్టి పెళ్ళి ఎలా చేసుకున్నారో వివరంగా నాకోసారి చెప్పేరాయన.

పుట్టపర్తి నారాయణాచార్యుల గారి గురించి వ్యాసం రెండుసార్లు చదివితే గాని తృప్తి కలగలేదు. ఎన్ని అవమానాలు, తిరస్కారాలు ఎదురైనా మనసులో ద్వేషభావం ఎరగని జాషువా, మహాపండితుడు, తిరుమల రామచంద్ర, దీపాల పిచ్చయ్యశాస్త్రి వంటి వారు ఈ పుస్తకం ద్వారా ఈతరం వారికి పరిచయం అవుతారు. పాండిత్యం మీద గాఢమైన అ గౌరవం పెరిగిన రోజులవి. కనీసం కీర్తి కాంక్ష కూడా లేని ఆ సాహితీమూర్తులను కనీసం గౌరవించడం అలవాటు కావాలి. చెన్నపట్నం వెళ్ళిపోయారు పద్మరాజుగారు. సినిమా వ్యామోహం కాదది. మర్నాటి ఉదయానికల్లా క్షేమంగా ఆరోగ్యవంతుడై ఇంటికి రావలసిన అడివి బాపిరాజు ఇంటికి రాకుండానే ఇంకా రాయవలసిన నవలలుండగానే 'గోనగన్నారెడ్డి' సినిమా తియ్యకూడనే వెళ్ళి పోయారు. నేను అనేకసార్లు ఆయన వేసిన శివశంకరశాస్త్రి గారి స్కెచ్‌నీ కింద బాపి బావ సంతకాన్ని చూశాను. మా. గోఖలే కూడా అంతే. ఏదో అక్కడ పని ఉన్నట్టు తొందరగా వెళ్లిపోయాడు. మన దురదృష్టం. మానవతావాది. ఈ కీర్తిశేషులు చాలా మంది

**మిగతాది 50వ పుటలో...**

# కాపు రాజయ్య

## జనపదాల కాపు – రంగుల రాజు

*- కాండ్రేగుల నాగేశ్వరరావు*

ఆధునిక భారతీయ చిత్రకళలో సొంత గొంతు వినిపిస్తూ విప్లవం తెచ్చినవాడు బెంగాలీ చిత్రకారుడైన జైమినీరాయ్. 1956వ సంవత్సరంలో ఎ.ఎస్. రామన్ వ్రాసిన యువ చిత్రకారులు అన్న వ్యాసాన్ని 'లండన్ స్టూడియో మేగజైన్' అన్న పత్రిక తగు ఉదాహరణ చిత్రాలతో ప్రచురిస్తూ రాజయ్యగారి 'బోనాలు' అన్న చిత్రాన్ని వర్ణాలతో ముద్రించింది. అంతకు మునుపు 'భారతదేశపు వర్తమాన చిత్రకళ' అన్న పేరుతో ఒక వ్యాసం ప్రచురించబడినపుడు జైమినీరాయ్ చిత్రాన్ని అదే పత్రిక తెలుపు నలుపులలో ప్రచురించింది. దీనిని గమనించిన జైమినీరాయ్ రాజయ్యకిచ్చిన ప్రాముఖ్యాన్ని చూసి కొంత ఈర్ష్య చెందాడని అంటారు. నిజానికి రాజయ్యను 'ఆంధ్ర జైమినీరాయ్' అని కళాకారులు కీర్తించేవారు. రాజయ్య వేసిన చిత్రాలు పంతొమ్మిది వందల యాభై, అరవై దశకాలలో అత్యంత పాఠకాదరణ గలిగిన ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ (ఇంగ్లీష్), ధర్మయుగ్ (హిందీ) లాంటి పత్రికల ముఖచిత్రాలుగా వచ్చి అశేష భారతావనిని అబ్బుర పరచాయి.

తెలంగాణా జీవన స్రవంతిని, శ్రమైక జీవన సౌందర్యాన్ని తన రేఖలతో, రంగులతో, సజీవం చేసిన మెతుకు సీమ చిత్రకారుడు కాపురాజయ్య.


ఈనాడు యనభై అయిదు సంవత్సరాల వయో భారంతో, శరీరం తన మాట వినకపోయినా, రాజయ్యగారి చేతికి కుంచె ఇచ్చి, రంగుల పెట్టె దగ్గర పెడితే అలవోకగా ఆయన చిత్రాలను గీయటం విస్మయం కలిగించే నిజం.

ఏప్రిల్ 7, 1925 వ సంవత్సరంలో సిద్ధి పేటలో జన్మించిన రాజయ్య పూర్తి పేరు దొంగల కాపు రాజయ్య. దొంగల అన్న పదం లజ్జాకరంగా ఉండటముతో, ఇంటి పేరులో దానిని ఉపహరించి కాపురాజయ్యగా ఆయన ప్రసిద్ధుడైనాడు. తండ్రి రాఘవులు ఒక చిల్లర వ్యాపారి. చాలా పేద కుటుంబం. రాజయ్యకు పద్నాలుగు సంవత్సరాల వయస్సులో తండ్రి మరణించాడు. ఆ గ్రామంలో ఆబ్కారీ కాంట్రాక్టరైన మార్కచంద్రయ్య గౌడు దిక్కులేని ఆ కుటుంబానికి నిలువ నీడనిచ్చి ఆదుకున్నాడు. ఆయన ప్రస్థావన వచ్చినపుడు కృతజ్ఞతా భావంతో రాజయ్య కళ్ళు చెమ్మగిల్లుతాయి.

రాజయ్య కుటుంబంలో అంతకు మునుపెవ్వరికీ చిత్రకళ గురించి తెలియదు. ఆయన కుటుంబం నివసిస్తున్న పారుపల్లి వీధి కళాకారులకు నిలయమైనటువంటిది. ఆ వీధిలో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, పద్మశాలి, నఖాషి కుల వృత్తుల వారు జీవిస్తూ వుండేవారు. ఆ వృత్తులలోని వారి కళానైపుణ్యాన్ని బాలుడైన రాజయ్య శ్రద్ధగా గమనిస్తూ వుండేవారు. అంతేకాక తన ఇంటి పక్కనున్న మార్వాడి ఇంటిపై నున్న నఖాషీ చిత్రాలను గమనించేవాడు. తోలుబొమ్మ, లాటలు, హరికథలు, పటముల ద్వారా చెప్పే పాండవుల కథలు, వీధి భాగవతాలు బాగా ఆకర్షించేవి. నాటక రంగస్థలం వెనుకనుండే పరదాలలోని వాస్తవిక పెయింటింగ్స్‌ను చూసి, అవి ఎలా వేస్తున్నారో చూసేవాడు. దీనితో ఏర్పడ్డ ఆకర్షణతో మొహ్రం, పీర్లకు, ఉత్సవ రథాలకు అలంకరణ చేసేవాడు.

నాలుగవ ఫారం వరకూ రాజయ్య చదువు కొనసాగింది. ఈ సమయంలో రాజయ్య వేస్తున్న చిత్రాలను చూసి డ్రాయింగ్ మాస్టర్లయిన పి. కుబేరుడు, నింబగిరి ఆయనను వెన్నుతట్టి

కాండ్రేగుల నాగేశ్వరరావు : చిత్రకళా విమర్శకులు, రచయిత, సెల్ : 9948083387



విశ్రాంతి

ప్రోత్సహించటమే కాకుండా గవర్నమెంటు డ్రాయింగు పరిక్షకు వారే ఫీజుకట్టి పరీక్షలో కూర్చుండ బెట్టారు. పరీక్ష పాసైన తరువాత రాజయ్యకు తన గమ్యస్థాన మేమిటో తెలిసి చిత్రలేఖనంలో మరింత శ్రద్ధవహించసాగారు. కుబేరుడు గారే 1943వ సంవత్సరంలో రాజయ్య కుటుంబ సభ్యులను ఒప్పించి, 'హై దరాబాద్' సెంట్రల్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్సులో చేర్పించారు.

అప్పటి స్కూలు ప్రిన్సిపాల్ 'ఖాన్ బహదూర్ సయ్యద్ మహ మూద్'గారి దయతో ఆ కాలేజీ వెనుకనున్న షెడ్‌లో రాజయ్య నివసించడానికి అనుమతిచ్చారు. బియ్యం, పప్పు, ఉప్పులు ఇంటి నుంచి తెచ్చుకొని స్వయం పాకం చేసుకుంటూ, ఆర్థిక ఇబ్బందులను తట్టుకుంటూ వచ్చారు.

1943లో హైదరాబాద్ ఆర్ట్ స్కూలులో చదువు తున్నప్పుడు 'సన్‌కపూర్' అనే ఉపాధ్యాయుడు చార్‌కోల్‌బాక్స్ (ఆర్థిక ఇబ్బందులవలన కొనలేకపోయి) లేనందున తరగతిగది నుండి వెళ్లగొట్టాడు. అదే తరగతిలో రెండవ ర్యాంకు సాధించినపుడు అదే ఉపాధ్యాయుడు అన్ని తరగతులలోనికి రాజయ్యను తీసుకొని వెళ్ళి విద్యార్థులకు పరిచయం చేశాడు. పట్టుదలతో కృషిని నమ్ముకుంటూ ఇంటర్ మీడియట్ సర్టిఫికట్ ఇన్ ఆర్ట్‌ను పొందగలిగారు. మెదక్‌లోని సంగారెడ్డిలో డ్రాయింగ్ టీచర్‌గా రెండేళ్ళు పనిచేశారు. ఆ తరువాత మళ్లీ ఆర్ట్స్ కాలేజీలో జేరి 1957వ సంవత్సరంలో డిప్లమో పొందారు. విద్యార్థిగా 'సంవిధానం,' 'చిత్రలేఖనం' ఆయన యొక్క ప్రత్యేక పాఠ్యాంశాలు.

చిత్రకళా విద్యార్థిగా రాజయ్య చాలా చురుకుగా ఉండేవాడు. మొదటి రెండు సంవత్సరాలు కాలేజీ మొత్తానికీ రెండవ వానిగా వచ్చినా, చివరి సంవత్సరంలో ప్రథముడుగా వచ్చారు. ఆయన అధ్యాపకులలో ముఖ్యులయిన వారు జలాలుద్దీన్. ఈయన జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్, బొంబాయి విద్యార్థి, అజంతా గుహ చిత్రాలకు ప్రతికృతులను తయారు చేయటంలో పద్నాలుగు సంవత్సరాల అనుభవం గడించారు. విద్యార్థిగా వున్నపుడు రాజయ్య ఆర్థిక ఇబ్బందులకు తరుచు లోనవుతూ వచ్చేవాడు. 1945వ సంవత్సరంలో ఆయనకు ఉపకార వేతనంగా నెలకు 5 రూపాయలు ఆరు నెలలపాటు లభించింది. విద్యార్థిగా వుంటూ బయట సైన్‌బోర్డు పనులు చేసేవారు. అప్పట్లో గంటకు పావలా చొప్పున ఆయనకు లభించేది అతికష్టం మీద బ్రతకునీడ్చుకుంటూ జీవించారు.

రాజయ్య చిత్రకళలాగానే తన దేశాన్నీ, తన ప్రాంతాన్నీ ప్రేమించారు. సంగారెడ్డిలో మహంకాళి నారాయణగారు స్వాతంత్రోద్యమ కాలంలో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశారు. ఈ దళ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులు సైతం రహస్యంగా పాల్గొంటుండే వారు. ఈ దళంలో రాజయ్య



**పసిబిడ్డ తల్లి**

కూడా పాల్గొన్నారు. ఆర్య సమాజ ఆధ్వర్యంలో పోలీసులపై జరిగిన దాడిలో రాజయ్య పాల్గొన్నారు. నేను సైతం అంటూ తనవంతు దేశ భక్తిని ప్రదర్శించారు.

డిప్లమో చేతి కొచ్చిన తరువాత, ఆయున తన స్వగ్రామమైన సిద్ధిపేటలో డ్రాయింగ్ టీచర్‌గా నియమితులైనారు. అప్పట్లో ఆయన నెలసరి జీతం 60 రూపాయలు. సుమారు ముప్పై సంవత్సరాలు పాటు అక్కడే పనిచేసి రిటైర్ అయినారు. 1964 వ సంవత్సరంలో సిద్ధిపేటలో లలిత కళాసమితిని స్థాపించి, నాటి నుంచి నేటి దాకా వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉంటూ సమితి కొక అందమైన భవనాన్ని నిర్మింప చేశారు. ఎందరో కళా జిజ్ఞాసువులకు చేయూతనిస్తూ, సిద్ధిపేటలోనే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని, ప్రస్తుతం అక్కడే ఉంటున్నారు.

చిత్రకళలో ఆయనదొక ప్రత్యేక స్థానం. డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తూ ఆయన చిత్రాలు వేసుకునేవారు. 1953వ సంవత్సరంలో 'గృహ ప్రశంస' అనే ఆయన చిత్రానికి హైదరాబాద్ ఆర్ట్‌సొసైటీ వారిచే, 'ఉదాత్త ప్రశంశ' (High Commended) లభించింది. అప్పటినుంచీ ఆయన వెనక్కు తిరిగి చూసింది లేదు. 1954వ సంవత్సరంలో ఆయన చిత్రం 'మూలకారిణి'కి మైసూరు అఖిలభారత చిత్రకళా ప్రదర్శనలో తృతీయ బహుమతి లభించింది. ఈ చిత్రాన్ని చూసి ముచ్చట పడిన ఒక అమెరికన్ పౌరుడు దానిని కొనుగోలు చేసుకున్నాడు. రాజయ్యగారి 'కోలాటము' అన్న చిత్రం రష్యన్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. 1954 వ సంవత్సరం నుంచీ ఆయనకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. బొంబాయి, కలకత్తా, పాట్నా, గుంటూరు, ఢిల్లీ, అమృతసర్, గ్వాలియర్, త్రివేంద్రం లాంటి ముఖ్యపట్టణాలలో ఆయన చిత్రాలు ప్రదర్శిత మయ్యాయి.

1956వ సంవత్సరంలో ఇలస్ట్రేటెడ్ వీక్లీలో ముఖ చిత్రంగా రాజయ్య వేసిన 'దుర్గ' త్రివర్ణ చిత్రం ప్రచురితమైంది. అది చూసిన మహారాజు హిందూర్ హోల్కర్ ఆ చిత్రం ధర తెలుపమని ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఎడిటర్ కు తెలియజేశారు. అడిగినంత ఎవరిస్తారు అన్న భావంతో ఆయన దాని ధర 500 రూ॥ అని తెలిపితే వి.పి.పి.లో చిత్రాన్ని పంపమని చెప్పి, రాజా వారు ఆ చిత్రాన్ని సొంతం చేసుకున్నారు.

ఢిల్లీ లలిత కళా అకాడమీ వారు 1955-56 సంవత్సరాలలో, జెకొస్లవేకియా, యుగొస్లవాకియా, హంగేరీ రుమానియా దేశాల్లో భారతదేశపు చిత్రకారుల చిత్రకళా ప్రదర్శన నేర్పాటు చేశారు. అప్పటి చిత్రకారులలో ప్రముఖులైన కొందరి చిత్రాలను అందుకుగాను ఎంపిక చేశాడు. అందులో రాజయ్యగారు వేసిన చిత్రాలున్నాయి. ఆయన చిత్రాలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, గొల్కొండ పత్రిక ఆంధ్రజనత, మోడరన్ రివ్యూ లాంటి పత్రికలలో ప్రచురితమయ్యాయి.

1993వ సంవత్సరంలో జె.ఎన్.టి.యు హైదరాబాదు వారిచే గౌరవ డాక్టరేటు కళాప్రవీణ బిరుదు పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారంతో ఆయనను సన్మానించింది. బిరుదులు, పురస్కారాలు లెఖ్ఖకు మించినవి వున్నాయి. ప్రపంచంలోని అన్ని ముఖ్య దేశాలలోనూ ఆయన పర్యటించారు. నిరాడంబరుడు, స్నేహశీలి, ఐన రాజయ్య

## చిత్రకారుడి అంతరంగం

**"నేను కూడా చిన్నప్పుడు నాగుపాము బొమ్మ, ఏనుగు బొమ్మ, చేప బొమ్మ వేసిన వాడినే. ఆ బొమ్మల్లో నాకు ఏనుగు బొమ్మ చాలా నచ్చేది. మా టీచరు కుబేరుడు గారికి కూడా ఆ బొమ్మ బాగా నచ్చింది. ఆయనే నన్ను బాగా ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సాహం కారణంగానే చిత్రకళా రంగంలో నేను ఒక స్థాయికి చేరుకున్నాను."** దాదాపు రెండు దశాబ్దాల క్రితం దూరదర్శన్‌లో ఇంటర్వ్యూ చేసినపుడు, శ్రీ కాపు రాజయ్య నాతో అన్నమాటలివి.

ఆనాటి మాట కచ్చేరీని ఇప్పుడు, ఇరవై ఏళ్ళ తర్వాత సింహావలోకనం చేసుకుంటే, ఎన్నో విలువైన విషయాలు గుర్తుకొస్తున్నాయి. తొలినాటి చిత్రకళను భారతీయ సాహిత్యమే ఎక్కువ ప్రభావితం చేసింది. దానికి సాక్ష్యాలు కళ్ళముందే వున్నాయి, అజంతా, లేపాక్షి వంటివి. ఒక్కొక్క రాష్ట్రానికి ఒక్కొక్క భాషా, యాస, ఆహార్యం, ఆచారం, వ్యవహారం, ప్రత్యేకంగా వున్నట్టే, చిత్రకళా వైవిధ్యమూ వున్నది. భిన్నత్వంలో ఏకత్వం భారతీయులకు మూల సూత్రమైనట్లు, అన్ని ప్రాంతాల చిత్రకళా సమాహారమే, భారతీయ చిత్రకళ. ఈ కళలోనూ ఒక సంప్రదాయముంటుంది. కళాకారుడికి మాత్రమే అర్థమయ్యే ఛందస్సు వుంటుంది. వీటిని పాటిస్తూ నేర్చుకునే వాడే, ఉత్తమ చిత్రకారుడౌతాడు. ఆ మాటల్లోనే, మంచి చిత్రానికి గొప్ప నిర్వచనం చెప్పారు. "మంచి చిత్రం మనల్ని నిలబెట్టాలి, మనతో మాట్లాడాలి, రసానందాన్ని కలిగించాలి."

చిత్రకళలో ఎంచుకునే వస్తువులో వైవిధ్యం వుండాలి. అలాగే ఉపయోగించే వస్తువుల్లోనూ వైవిధ్యం వుండాలి. ఈ రెండూ వైవిధ్యాలు సమాదరణీయాలే. రంగులో ఒక గొప్ప ఆకర్షణ శక్తి వుంటుంది. తీక్షణంగా ఆ రంగును పరిశీలిస్తుంటే, తెలియని ఏకాగ్రత కలుగుతుంది. రంగుల్ని మిళితం చేస్తున్నప్పుడు, చిత్రకారుడి మనస్సులోని ఆలోచనలు తమంతట తామే ఆవిష్కృతమౌతాయి. ప్రాచీన సంప్రదాయం గొప్పదా? ఆధునిక చిత్రం గొప్పదా? అని తర్కించుకోవడం కంటే, ప్రాచీనతను గౌరవించాలి. ఆధునికతను ఆహ్వానించాలి. మొత్తంమీద ఒక మంచి చిత్రానికి మనం మనుగడనివ్వాలి అనేది శ్రీ రాజయ్య అభిప్రాయం.

చిత్రాలనేకాదు, మాటల్ని కూడా మెరిపించే ఒక గొప్ప చమత్కారం, మాటకారితనం తెలిసిన వ్యక్తి రాజయ్య.

"సాహిత్యంలో కవులు ఛందస్సు విరగగొట్టి ప్రజలకు దగ్గరయ్యారు. చిత్రకళలో చిత్రకారులు, ఛందస్సు విరగగొట్టి ప్రజలకు దూరమయ్యారు" అనగానే మా కబుర్లు ముగిశాయి.

వింశతి వసంతాలకు పూర్వం శ్రీ కాపు రాజయ్య చెప్పిన మాటలు మరో శత వసంతాలకు కూడా నిలబడే విలువైన మాటలు.

**– డా॥ వోలేటి పార్వతీశం**

మనోహర చిత్రాలనే కాదు, మనస్సుకు హత్తుకునే కవిత్వం కూడా చెప్పగలరని 1992లో ప్రచురితమైన ఆయన రచించిన 'కుంచెపదాలు' వచన సంకలనం ద్వారా నిరూపించుకున్నారు. ఆ కవితలకు విశేష స్పందన రావటంతో రెండు సంవత్సరాల లోపునే అది ద్వితీయ ముద్రణకు నోచుకుంది.

'తెలుగు బొమ్మల బ్రహ్మ'గా ఎ.ఎస్. రామన్‌తో కీర్తించబడి, ఆంధ్ర జైమినీరాయ్‌గా పేరుగాంచిన రాజయ్య చిత్రాలలో జైమినీరాయ్ ప్రభావం తక్కువనే చెప్పాలి. రాజయ్యగారి మాటల్లో చెప్పాలంటే ఆయన చిత్రాలకు అజంతా, లేపాక్షి కుడ్య చిత్రాలే ప్రేరణ. ఆయన తన శైలిని కళాశైలిగా పేర్కొంటారు. రాజయ్యకు అన్ని కులాల జీవన శైలితో ప్రత్యేకమైన పరిచయం అనుబంధం ఉంది. అందుకే ఆయన చిత్రాల్లో సమిష్టి జీవన శైలి, పనిపాటలు, పండుగలు, పబ్బాలు తరుచుగా కనిపిస్తాయి. 'అవును మరి నా కళా ప్రస్థానం మా వాడ కట్టనుంచి మొదలైంది కదా! సంప్రదాయ చిత్రానికి మరణం లేదు కదా!' అని సమాధాన మిస్తారు.

రాజయ్య తొలి చిత్రాలు సాంప్రదాయికమైన, కాల పరీక్షకు నిలిచిన ప్రాచ్యవిధానంలో అనగా 'వాష్' పద్ధతిలో చిత్రించబడ్డాయి. తరువాత నకాషీ చిత్రకారుల అద్భుతమైన టెక్నిక్‌కు ముగ్ధుడై టెంపరా రంగుల వాడకం అతడు



వీరభద్రుడు

మొదలుపెట్టాడు. నకాషీ చిత్రకారులంటే రాజయ్యకు ఎనలేని గౌరవం. అర్థవంతమైన రూపం కోసం దీక్షతో అన్వేషిస్తున్న ఈ చిత్రకారుడికి నకాషీ కుడ్య చిత్రాలు, వారి ఇతర ఆలంకారిక చిత్రాలు ప్రాథమికమైన అంతర్ దృష్టిని కలిగించి, ఆ మార్గంలో అతనికి అక్షరాభ్యాసం చేశాయి. ఇరవై ఏళ్ళపాటు 1950 నుంచి 1970 వరకు టెంపరా చిత్రాలు రాజయ్య చిత్రించాడు. కాగితం మీద, అట్టల మీద, ప్లైవుడ్ మీద అప్పుడప్పుడు గుడ్డలమీద కూడా పౌడర్ రంగులను వాడుతూ అతడు చిత్రించాడు. అతడు తన వస్తువులనన్నింటినీ గ్రామీణ జీవితం నుంచే–పండగలూ, కర్మకాండలూ, గ్రామదేవతలూ, వివిధ వృత్తుల, కులాలవారి నిత్య జీవితం మొదలైన అంశాల నుంచే స్వీకరించాడు. అదృష్టవశాత్తు పత్రికలు మొదలైన ప్రచార సాధనాల నుంచీ, కళావర్గాల నుంచీ అతనికి మంచి ఆదరణ లభించింది. సహజంగానే అది తాను అనుసరిస్తున్న మార్గంలో విశ్వాసాన్ని మరింత ఎక్కువ చేసింది. వెంట వెంట అన్ని స్థాయిలలోను (స్థానిక, ప్రాంతీయ, జాతీయ) అతనికి అవార్డులు లభించాయి. లండన్‌లోని సుప్రసిద్ధమైన 'ది స్టూడియో' అనే చిత్రకళా పత్రికలో అతని చిత్రం ఒకటి ప్రచురించబడడంతో అంతర్జాతీయంగా కూడ అతనికి గుర్తింపు లభించింది. క్రమేణా ఆధునిక చిత్రకళలోని మూడు ప్రధానమైన ప్రేరణలు (1. అబ్‌స్ట్రాక్ట్ 2. సాంప్రదాయికం 3. ప్రతీకాత్మకం) అద్భుతంగా సమ్మేళనం చెంది రాజయ్యకు సూక్ష్మాగ్రాహకమైన, వ్యక్తిగతమైన ఒక ప్రత్యేక శైలి రూపొందింది. టెంపరా రంగుల నుంచి అతడు పాశ్చాత్యుల మాధ్యమం అయిన తైల వర్ణాలకు మారాడు. అయితే అతని ప్రధానమైన ఆవేశం, ప్రేరణ మాత్రం దేశీయ జీవితంలోనే వ్రేళ్ళు నిలద్రొక్కుకొని ఉన్నాయి. అతని చిత్రాలలో నిజాయితీ కనిపిస్తుంది. తను నమ్మిన, గౌరవించే అంశాలనే అతడు చిత్రిస్తాడు. తనకు సహజంగా అలవడిన చిత్రకళా భాషలో తనను తాను ప్రకటించుకుంటాడు. తోటి కళాకారులతోపాటు ముందుకు సాగాలని ఏ ధోరణినీ, టెక్నిక్‌నీ అతడు అనుసరించడు. అతని చేతులలో సంప్రదాయం గొప్ప శక్తి పుంజుకుంది. దాని అన్ని ప్రమాణాలనూ అతడు తర్కించి చూశాడు. ఒక విధంగా ఆధునికత కూడా నిద్రాణంగా 'సంప్రదాయం'లో ఇమిడి ఉంది. ఏడుకొండల వెంకన్న (తిరుపతి) అతని యిష్ట దైవం. కాని ఆ వస్తువు పట్ల తనకు గల అవగాహనను ప్రకటించడానికి తేలికైన, సుపరిచితమైన పద్ధతులను అతడు అనుసరించాడు. ఆ పవిత్రమైన వస్తువును కొంత వాస్తవిక దృష్టితోనూ, కొంత ప్రతీకాత్మక దృష్టితోనూ అయినా ప్రధానంగా ఆధునిక దృష్టితోనూ అందరికీ ఆదరణ పాత్రం అయ్యేవిధంగా అతడు చిత్రించాడు. అలాగే 'శివుడు' ఇతివృత్తాన్ని కూడా స్వతస్సిద్ధమైన పవిత్రతకు ఎలాంటి భంగం కలిగించకుండా అతడు చిత్రించాడు. విష్ణువు, శివుడు, కృష్ణుడు వస్తువులుగా అతడు చాలా చిత్రాలు చిత్రించాడు. ప్రధానంగా జానపద శైలి అయినా నీరసంగా గాని, కృతకంగా గాని ఉండని తన స్వంత శైలిలో అతడు వాటిని చిత్రించాడు. ఆధునిక కళ కంటె భిన్నంగా ఆధ్యాత్మికాన్వేషణకు ప్రాధాన్యం ఇస్తున్నందువలన అతని చిత్రాలకు సమకాలికుల ఆదరణ లభించింది.

అంతస్సార రహితాలైన, పైపై మెరుగులు ప్రాబల్యం వహించే ఈనాటి ప్రపంచంలో రాజయ్య ఒంటరిగా అచంచలంగా నిలబడ్డాడు. నేడు అరుదయి పోతున్న కళాకారుల కోవకు చెందినవాడు రాజయ్య. మి

## వికార దృశ్యం

ఈ వికార దృశ్యాన్ని
ఆపించుకోలేరు

దుర్బలంగా నిస్త్రాణంగా
పగబట్టినట్టు ఆ స్మృతులు
మనో భావాల విషయంలో
మౌను పడ్డట్లు

ఆసేతు శీతనగ పర్యంతం
అరవై కోట్ల మంది
ఈ నల్లగ
ముసలి వారు
గాంధీ సూక్తులను
నెహ్రూ స్వప్నాలను
మూషికాల లాగ
కొద్ది కొద్దిగా కొరుక్కు తింటారు

అనవరతం
పాషాణాలైన దుర్భర మౌనాలు
దిగాల నిలయమైన సంపద
పొదుపు చేసుకుంటూ ఉంటారు

పరదాల రాజభరణాల
ప్రాంతీయ వివాదాల
దుష్ప్రాప్య సద్భావ రాజకీయాల
పై శాబ్దిక వాదాలతో
వాళ్లు
ఎండుటాకుల లాగ
తేలుతూ ఉంటారు

**ఎమ్.వి.ఆర్. ప్రసాద్ ఆంగ్ల కవితకు ఆరుద్ర స్వదస్తూరితో అనువాదం**



# నా కళా జీవితం-నాగపూరు

- నటరాజ రామకృష్ణ

ఈ విశాల విశ్వంలో ఎందరో పుట్టారు
మరెందరో పుడుతున్నారు. ఇంకెందరో పుడతారు
పుట్టిన ప్రతివాడు జీవించాలి.
కనుక జీవితకాలం జీవిస్తాడు.
ఒంటరిగా వచ్చాడు. భ్రాంతితో తనవాడు,
ఇతరులు అనే భావాలతో జీవిస్తున్నాడు.
మళ్లీ ఒంటరిగానే వెళ్లిపోతాడు.
ఎక్కడి నుండి వచ్చాడో తెలియదు,
మళ్లా ఎక్కడికి వెళ్లతాడో అంతకంటె తెలియదు.
ఈ బ్రతికిన కొన్నాళ్లయినా
స్వార్థాన్ని కొంత త్యాగం చేసి,
నాది, నా మనుష్యులు, నా జాతి,
నా మతం, నా ప్రాంతం
అన్న చింతన పక్కకు నెట్టి,
సాటి మానవ కోటి సేవలో, దేశసేవలో.
కొంత జీవిత సమయమైనా,
గడపగల్గితే జన్మ సార్థకమైనట్లని విశ్వసిస్తాను....
తల్లి సరస్వతికి కైమోడ్పు చేస్తున్నాను.

ఆ రోజు ఆగస్టు 15, 60 సంవత్సరాల క్రిందట.

మా యింటికి ఎదురుగా సీతాబల్డి కోట ఉంది. అది భోంస్లా రాజుల పురాతన కోట. ఈ రాజులకు ఆంగ్లేయులకు పూర్వం ఒకసారి యుద్ధం జరిగింది. దాన్నే 'సీతాబల్డి' యుద్ధమనేవారు. ఆ యుద్ధంలో ఈ భోంస్లా రాజులు ఓడిపోయారు. మరాఠీ రాజు రఘుజీ నాగపూర్ పొలిమేర అవతలగల వేరొక కోటకు వెళ్లిపోయారు.

ప్రతి ఉదయం సూర్యోదయ సమయంలో సీతాబల్డిలో కోటపైని (విదేశీ జెండా) యూనియన్ జాక్‌ను ఎగురవేసేవారు. పగటి పూటంతా ఆ జెండా కోటపై రెపరెపలాడేది. సాయంత్రం సంధ్యా సమయంలో ఒక బ్రిటిష్ సైనికుడు బుగల్ మోగించేవాడు. జెండాను కిందికి దింపేవాడు.

మన మూడు రంగుల జెండా ఇలా ఎప్పుడు ఆ కోటపై ఎగురుతుందా అని నేను నా మిత్రులం ఆ జెండాను చూపినప్పుడల్లా అనుకొనేవారం. కొన్నాళ్లకు ఆ రోజు రానే వచ్చింది. ఇంకా మసక చీకటి ఉండగానే పిల్లలు, పెద్దలు, వృద్ధులు, అందరూ తెల్లని దుస్తులు ధరించి, ***"విజయ విశ్వ త్రిరంగా ప్యారా! జెండా ఊంచా రహే హమారా"*** అని పాడుతూ బారులు తీరి ఆ రాజ మార్గంలో వెళ్తున్నారు. నేనూ నా మిత్రులు వారితో గొంతులు కలిపి పాడాం.

అదొక అద్భుతమైన ఆనంద సమయం. ఏదో

---

పద్మశ్రీ నటరాజ రామకృష్ణ : నాట్యాచార్యులు, నాట్యచరిత్రకారులు, పేరిణి, ఆంధ్రనాట్యం పునరుద్ధారకులు.

ఊహించలేని ఆనందం మాలో పొంగి పొరిలింది. మా సంకెళ్ళు తెగిపోయి. స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తున్న అనుభూతి మాలో కలిగింది. ఆ 'సీతాబల్డి' కోట మా యింటి కెదురుగానే ఒక గుట్టమీద ఉంది. కాని ఆ కోట దగ్గరకు ఎప్పుడూ వెళ్ళలేకపోయాం. ఆ కోట చుట్టూ కొలది దూరంలో ముళ్లకంచె ఉండేది. సైనికులు తుపాకులు ధరించి ఆ కోటకు కాపలా ఉండేవారు. ఆ కోట దరిదాపులకు ఎవరైనా వెళ్తే వారు హెచ్చరించేవారు.

ఆనాడు ఆ కోట చుట్టూ ముళ్ల కంచె లేదు. చీమల దండులా జనం ఆ గుట్టయెక్కి ఆ కోటలోకి వెళ్తూంటే ఎవరూ హెచ్చరించలేదు. ఆ కోటలో ఏముందో సామాన్యు లెవరికీ తెలీదు. అందువల్ల సైనికులుండే ఆ కోటలో ఏముందో చూడాలని ప్రజలు వెళ్లడం ప్రారంభించారు.

ఆ కోట వెలుపల పెద్ద మైదాన ముంది. దాని మధ్య ఒక ఉద్యానవనముంది. దాని చుట్టూ పిట్టగోడ ఉంది. ఆ ఉద్యానవనంలో ఆనాడు జెండా వందనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. సామాన్య ప్రజలు ఆ పిట్టగోడ దాటి ఉద్యానవనంలోకి వెళ్లడానికి వీల్లేదన్నారు. మంచి దుస్తులు ధరించిన కార్లల్లో వచ్చిన పెద్దలు మాత్రమే ఆ పిట్టగోడ దాటి లోపలికి వెళ్లి, కుర్చీల్లో కూర్చుని జరగబోయే కార్యక్రమం కోసం ఎదురుచూస్తున్నారు. నాకు తెలిసిన వారు కొందరున్నందున నేనూ లోపలకు వెళ్లాను. సి.సి. పోలీసు జవానులు వినోదభరితంగా బ్యాండ్ వాయిస్తున్నారు. పతాక స్తంభానికి చేరువలో రాష్ట్ర గవర్నరు, రాజ ప్రముఖులు ఆసీనులైయున్నారు. దూరంగా పిట్టగోడకు ఆవల సామాన్య జనులు నిలబడి ఉన్నారు. ఇటూ, అటూ చూశాను. నా మనస్సు చివుక్కుమంది.

"మనకు స్వాతంత్ర్యం తీసికొని వచ్చింది మంచి దుస్తులు ధరించి కార్లలో వచ్చిన ధనికవర్గమా? లేక తెల్ల ఖద్దరు ధరించి, పిట్టగోడకు వెలుపల ఉన్న ఆ సామాన్య జనమా? అని ఆలోచించాను. ఆ ఆలోచన నా కెందుకు ఆ సమయంలో వచ్చిందో నాకే తెలియదు. కానీ అలా ఆలోచిస్తూనే ఉన్నాను.

ఇంతలో గవర్నరుగారు, ఇతర ప్రముఖులు లేచి నిలబడ్డారు. గవర్నరుగారు త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. మీద నుండి పువ్వులు జలజల రాలేయి. అందరూ కరతాళ ధ్వనులు చేశారు. పిట్టగోడ వెలుపుల నుంచి చప్పట్ల మోత ఎక్కువగా వినబడింది.

"స్వాతంత్ర్యం వచ్చిన ఈనాడు కూడా ఉన్నవారికి లేని వారికి మధ్య, ఇంత తేడానా?" అని నా మనస్సు మూలిగింది. ఆనాడు విందులు, వినోదాలు జరిగాయి. అవి ప్రముఖులకు మాత్రమే పరిమితమయ్యాయి. అందులో మా ప్రదర్శన కూడా ఉంది. ఆ రోజుల్లో ప్రధానంగా రెండు నాట్య బృందాలుండేవి. ఒకటి ప్రజానాట్యమండలి. రెండోది జాతీయ నాట్యమండలి. నేను రెండింటిలోనూ ఉండేవాణ్ణి. వీరికి వేర్వేరు రాజకీయ సిద్ధాంతాలుండేవి. నేనూ రాజకీయాలను పట్టించుకోలేదు. నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. గనుక దేశం కోసం సేవ చేయదలుచు కొన్నాను. ఆనాటి రాత్రి జాతీయ నాట్యమండలివారి వినోద కార్యక్రమముంది. దానిలో నేనూ ఉన్నాను.

మా కార్యక్రమానికి ముందు ఒక గోవా గాయని పాట కచ్చేరి చేసింది. ఆమె రైలుకు వెళ్లిపోవాలట! అందుకే ఆమె కచ్చేరిని ముందుకు నెట్టారు. ఆమెను ఘనంగా సత్కరించారు. ఆమె ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయింది. తర్వాత కార్యక్రమం ప్రారంభమైంది. మేమొక కొత్త తరహా నృత్య నాటిక ప్రదర్శించాం. అది "గోపికా వస్త్రాపహరణం." రేపల్లె గొల్లభామలు తమ ఊరిలో నేసే చీరలు ముతుక వని ధరించక, మధుర నుండి సన్నని సున్నితమైన చీరలు తెప్పించుకొని ధరించేవారు. రేపల్లె నేతవారికి గిరాకీ తగ్గి పేదవా రైనారు. అందువల్ల శ్రీకృష్ణుడు ఆ గొల్లపడుచులకు బుద్ధి చెప్పదలిచాడు. ఒకనాడు వారు ఒక చెరువులో స్నానం చేస్తుండగా అప్పుడు వారి చీరలు ఎత్తుకొనిపోయి పొన్నచెట్టు ఎక్కి కూర్చున్నాడు. గొల్లభామలు స్నానం ముగించి చూస్తే వారి చీరలు కనబడలేదు. పొన్నచెట్టు మీద కృష్ణుడు కనబడ్డాడు. వారు కృష్ణుణ్ణి చీరలు ఇమ్మని వేడుకొన్నారు. "మీరు రేపెల్లె నేత చీరలు కట్టుకొంటామని వాగ్దానం చేస్తే మీ చీరలు మీకిస్తా" నన్నాడు. "సరే"నని వారు వాగ్దానాలు చేశారు. కృష్ణుడు వారికి చీరలు ఇచ్చాడు. అవి రేపల్లె ముతక నేత చీరెలు. ఇదీ కథ. ఇదొక జాతీయ ఇతివృత్తం. అందరూ భేష్ అంటూ మెచ్చుకొన్నారు. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. ఆ నృత్య నాటికలో పాల్గొన్న

మమ్మల్ని పూలదండలతో సత్కరించారు. మా నాయకునికి కవరు అందించారు.

ఆ రాత్రి ఇంటికి వచ్చి మంచం మీద వాలేను. నిద్ర రాలేదు. ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి. ఆ నృత్య నాటికను ఎందుకు ప్రదర్శించాం? ఎవరు ఆనందించారు? దాని ప్రయోజనం ఏమిటి? మేము సాధించిందేమిటి? మా నృత్య కళను గుడిసెల్లో నివసించే పేదవారి వద్దకు తీసికొని వెళ్లగలమా? తీసికొని వెళ్లాలా? ఈ వినోదాలలో పాల్గొనే అర్హత వారికి లేదా? ఈ ఆలోచనలే నన్ను కలవరపెట్టాయి.

ఆ నాటి రాత్రి విందు భోజనం ముందు కూర్చుంటే నాకు ఏమీ తినాలనిపించలేదు. నా తోటి కళాకారులు ఆనందంగా విందారగించారు.

మా యింటి ప్రక్కన ఒక వృద్ధురాలుండేది. ఆమె ఒకప్పుడు పేరుగాంచిన "తమాషా" నర్తకి. ఆమె వయస్సులో నున్నప్పుడు ఆమె ప్రదర్శనలకు మంచి గిరాకీ ఉండేదట. ఇప్పుడు ఆమె శరీరం వడిలిపోయింది. ముఖం ముడతలు పడింది. కళ్ళు లోపలికి పోయాయి. ఆమె సౌందర్యమంతా హరించుకొని పోయింది. దీనితో పాటు ఆమె ఐశ్వర్యం కూడా కరిగిపోయింది. ఆమె ఇప్పుడొక చిన్న గదిలో గుట్టుగా కాలం వెళ్ళబుచ్చుతూంది. నేను ఆ రాత్రి ఇంటికి వచ్చేసరికి ఆమె ఒక చిన్న బుడ్డి దీపం పెట్టుకొని, గుమ్మంలో కూర్చుని, ఆ సీతాబల్డి కోట వైపు చూస్తూ, తనలో తానే పాడుకొంటూంది. ఆమె నన్ను చూసి "వచ్చావా రాంబాబూ! మీ ప్రదర్శన ముగిసిందా? బాగా జరిగిందా"? అని అడిగింది. "బాగా జరిగింది ఆయీ! నీవు చూసుంటే ఎంతో సంతోషించేదానివి" అన్నాను.

"ఇప్పుడు నన్నెవరు రమ్మంటారు. రానిస్తారు బాబూ! ఆ కాలం గడిచిపోయింది" అంది ఆమె శూన్యంలోకి చూస్తూ. ఆమె కళ్ళు చెమర్చడం నేను గమనించాను. ఆ దృశ్యం నేను మరువలేను, ఎన్నాళ్లయినా మరువలేను. ఎప్పటికీ మరువలేను. ఒకప్పుడు గొప్ప కళాకారిణి, వృద్ధాప్యం పీడిస్తూంది. ఇదేనా కళాకారుల జీవితం! ఇలా ఆలోచిస్తూంటే నాకు మరి నిద్రపట్టలేదు. ఆ గోవా కళాకారిణి ఏవో రెండు టుమ్రీలు! భజన పాటలు పాడి చక్కా వెళ్ళిపోయింది. ఆమె పాటలకు ఆనాటి స్వాతంత్ర్య దినోత్సవానికి ఏమిటి



సంబంధం? మేము ప్రదర్శించిన నృత్య నాటికకు ఒక జాతీయ భావముందని నేను సరిపెట్టుకొన్నాను. ఏవేవో విప్లవ భావాలు వచ్చి నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. మా యింటికి వచ్చి నాట్యం ప్రదర్శించిన కళాకారుల్ని మా పెద్దలు మెచ్చుకొనేవారు. మనం మెచ్చుకొనే కళను మనం ఆరాధించడంలో తప్పేముంది? అని దీర్ఘంగా తర్కించుకొన్నాను. నాట్యం నేర్చుకోవాలని చిన్నప్పుడే నిర్ణయించుకొన్నాను. "మీకు ఇల్లు కావాలా?

నాట్యం కావాలా?" అని పెద్దలు నన్ను నిలదీశారు. నేను మెచ్చిన కళనే ఎన్నుకొన్నాను. నాట్యం నేర్చుకొనడానికి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాను. కాని మరి మా యింటికి వెళ్లలేదు నేటికీ. ఆ రాత్రి నా ఆలోచనలతో సరిగ్గా నిద్రపట్టలేదు. పొద్దున్నే లేచి ఆయీ గది వైపు చూశాను. ఆయీ గుమ్మంలోనే కూర్చుని ఉంది. నేను ఆమె వద్దకు వెళ్లి "ఆయీ! రాత్రి అడగడం మర్చిపోయాను. రాత్రి భోంచేశావా?" అని అడిగాను. "లేదు బాబూ! తినాలనిపించలేదు. నీవు విందు భోజనం చేశావా?"

"లేదు ఆయీ! నాకూ తినాలనిపించలేదు. నిన్ను ఒంటరిగా వదిలి నేను విందు ఎలా ఆరగించగలను" అన్నాను. "మా బాబే" అంటూ ఆమె ఒక చిరునవ్వు చిందించి వెంటనే లేచి సిగ్డీ (కుంపటి) వెలిగించి చపాతీ పిండి కలిపింది. కత్తిపీట ముందు వేసుకొని ఉల్లిపాయలు, బంగాళా దుంపలు తరగడం మొదలుపెట్టింది. అంతవరకూ ఆమె "బసోమోరినైననమే నందలాలు" అని పాడుకొంటూ పని చేసుకొంటూంది. ఆమె నేత్రాల వెంట అశ్రువులు రాలాయి. అవి ఉల్లిపాయల ఘాటుకు వచ్చినవి కావు, ఆమె హృదయ వేదన వల్ల వచ్చినవి.

టుమ్రీలకు, గీతాలకు ఒకప్పుడు అభినయించిన ఆమె చేతులు ఇప్పుడు గిన్నెలు తోముతున్నాయి. ఆ వేళ్లు పిండి పిసుకుతున్నాయి. అయినా ఆమెలోని ఆనందం అంతరించి పోలేదు. ఆమె శరీరంలోని తేజస్సు అణగారి పోలేదు.

'ఆయీ'కి వంట బాగా వచ్చు కానీ ఆ రోజున పెనం మీంచి చపాతీలు తీస్తూ రెండు మార్లు చెయ్యి కాల్చుకొంది. ఆమె ఆలోచనలు ఎక్కడో వున్నాయని నాకు అర్థమయింది. చపాతీలు, కూర తయారైనాయి. ఆకులలో నాకు రెండు పెట్టింది. తానో రెండు పెట్టుకుంది. క్రితం రాత్రి భోజనం చెయ్యనందున అవురావురుమంటూ వాటిని తిన్నాను.

"బాగున్నాయా బాబూ"? అని ఆయీ అడిగింది. "చాలా బాగున్నాయి!" అన్నాను. "ఉండు బాబూ! ఛాయ్ పెట్టియిస్తా" నంది.

నేను హాస్టల్లో భోంచేస్తున్నా, అప్పుడప్పుడు ఆమె వద్దకు వచ్చి భోంచేయడం నాకు అలవాటు. ఆమెకు ఏదో నాకు తోచిన సహాయం చేయాలని నా తాపత్రయం. ఊరికే ఆమె, సహాయం స్వీకరించదు.

కళాకారులు కొవ్వొత్తులు. అందరికీ ఆనందాన్ని పంచి వారు కరిగిపోతారు. వృద్ధాప్యంలో వీరి కన్నీరు ఎవరు తుడుస్తారు? విలాసాన్ని కోరే ధనిక రసికులు వీరిని ఆదుకొంటారా? ఆదుకోరు. హృదయమున్న యువ కళాకారులు కొందరు వీరిని ఆదుకొనేవారు. ఆనాటి నుండి నా కళారాధనలో నేనెక్కడికి వెళ్లినా, అక్కడి వృద్ధ కళాకారుల గురించి తెలుసుకొని, వారిని కలుసుకొని, నాకు తోచిన రీతిని వారికి సహాయం చేస్తూ వచ్చాను.

నా చిన్నతనంలోనే నృత్యకళకోసం ఆస్తిని, ఇంటిని, చివరకు కుటుంబాన్ని కూడా వదిలి వచ్చేసినా, మా పసితనంలో మా "దాయి" మమ్మల్ని పడుకోబెట్టి, చక్కగా పాడుతూ, నిద్ర పుచ్చుతుండినప్పుడు మాకు చెప్పిన అమృత వాక్కును నేను విడిచి పుచ్చలేదు. "బాబూ! మనిషిలో మాధవుణ్ణి చూడు" అని ఆమె చెప్పింది. అదే నా జీవిత బాట అయింది.

"నాట్యకళ రాజాస్థాన కళ. ఇది సామాన్య ప్రజలకు అర్థంకాదు" అని నాతో ఒక శాస్త్రీయ కళాకారుడన్నాడు.

"సామాన్య ప్రజలకు మనం ఎప్పుడైనా అవకాశమిస్తే కదా!" అన్నాను.

"లక్కీ బోర్డులో నీ కళను ప్రదర్శించు, నీకే తెలుస్తుంది" అన్నారాయన. నా కప్పుడు అర్థం కాలేదు.

అనుకోకుండా నా కా అవకాశం వచ్చింది. "కాంటీ" అనే ఊళ్లో నాకు తెలిసి నతను లక్కీ బోర్డు పెట్టాడు. దాని ప్రారంభోత్సవ సమయంలో నా ప్రదర్శన ఏర్పాటు చేశాడు. లక్కీబోర్డు అంటే నాకు తెలియదు. అక్కడి ఎలాంటివాళ్లు వస్తారో తెలియదు. అదేదో సర్కస్ వంటి దనుకొని ఆ మిత్రునికి మాట ఇచ్చాను. నా వాద్యబృందం వారితో ఈ కార్యక్రమం గురించి చెప్పాను. వారు వద్దన్నారు. ఒక మిత్రునికి వాగ్దానం చేశాను గనుక వెళ్లక తప్పదన్నాను. అందరం 'కాంటీ' వెళ్లాం.

లక్కీబోర్డు ప్రారంభోత్సవాన్ని ఒక పోలీసు అధికారి చేశారు. నన్నూ, నా వాద్యబృందాన్ని ఆయన చూసి

ఆశ్చర్యపోయి, "మీరెందుకు వచ్చా"రని అడిగాడు. అక్కడి ప్రేక్షకుల్ని చూసిన తర్వాత ఆయనకు ఏం సమాధానం చెప్పాలో నాకు తోచలేదు. ఆయనే ఒక చిరునవ్వు విసిరి, "మీ నాట్య కార్యక్రమం ప్రారంభించండి కాస్సేపు చూసి వెళ్తాను" అన్నారు. నేను రెండు శాస్త్రీయ నాట్యాంశాలను ప్రదర్శించాను. ఆయన సంతోషించి వెళ్ళిపోయారు. వెళ్తూ వెళ్తూ ఒక పోలీసు జవానుతో మమ్మల్ని జాగ్రత్తగా చూడమని చెప్పి మరీ వెళ్ళారు. మూడో శాస్త్రీయ నాట్యాంశాన్ని ప్రదర్శించగానే ప్రేక్షకులు ఒక్కొక్కరే లేచి వెళ్ళడం ప్రారంభించారు. అది గమనించి నేను ఒక గజల్‌ను గొంతెత్తిపాడి, అభినయించడం మొదలు పెట్టాను. అందరూ నిశ్శబ్దంగా కూర్చుని చూడ్డం మొదలుపెట్టారు. వెళ్ళినవారు వెనక్కు వచ్చారు. నా ప్రదర్శన ముగిసింది. ప్రేక్షకులలో నుండి ఒకాయన వేదిక మీదకు వచ్చి "రాజవాడ నృత్యం మాకు చూపించావు. నిండు నూరేళ్ళు జీవించు" అంటూ ఒక నోటు నా చేతిలో పెట్టి వెళ్ళాడు.




నాగపూరు చేరుకొనడానికి ఆ రాత్రి రైలు స్టేషనుకు వెళ్ళాం. నా వాద్యబృందమంతా భోజనానికి వెళ్ళారు. నేను ఒంటరిగా ఆలోచిస్తూ కూర్చున్నాను. పేదవారికి, వెనుకబడిన వారికి కూడా హృదయముంది. వారూ శాస్త్రీయ నాట్యాలను అర్థం చేసుకొనగలరు. ఆనందించగలరు. కానీ, వారికా అవకాశం మనమే ఇవ్వడం లేదు. ఇప్పుడు మనకు స్వాతంత్ర్యం వచ్చింది. అందరూ సమానులే. వారిని కూడా మన స్థాయికి మనం తీసుకొని రావాలి. అదే మన జీవిత పరమార్థం కావాలి. ఇలా ఆలోచించు కొంటూండగా మా వాద్యబృందం వారు వచ్చి "బండి వస్తూంది లేవండి" అన్నారు. అందరం బండి ఎక్కాం. తెల్లవారే సరికి నాగపూరు చేరుకొన్నాం.

ఆయీ, వీధి కుళాయి వద్ద ఎవరికీ కనబడకుండా ముసుగు వేసుకొని అంట్ల గిన్నెలు తోము కొంటూంది.

ఆ రోజుల్లో ఉదయశంకర్, రామగోపాల్, నటరాజ వశి, మేనకా దేవి మొదలైనవారు తమ తమ బృందాలతో రంగు రంగు దీపాలతో పెద్ద పెద్ద రంగస్థలాల మీద ప్రదర్శనలు ఇస్తూండేవారు.

ప్రవేశరుసుము కూడా ఎక్కువగానే ఉండేది. వారి ప్రదర్శనలు సామాన్యులకు అందు బాటులో ఉండేవి కావు. సామాన్య ప్రజలు తమాషా, దండోరా మొదలైన జానపద నృత్య ప్రదర్శనలతో తృప్తి పడవలసి వచ్చేది. ఈ పెద్ద వారి ప్రదర్శనలకు పత్రికా సమావేశాలు, ప్రచారాలు ఎక్కువగా ఉండేవి. వారి రెండు గంటల కార్యక్రమాలలో ఏ నాట్యాంశం 10 నిమిషాలకు మించి ఉండేది కాదు. ఆడేవారు, పాడేవారు కారు. నేపథ్య సంగీతం మీద ఆధారపడేవారు. వ్యాఖ్యాతలు గొప్పగా వ్యాఖ్యానాలు చెప్పేవారు. అసలు నృత్యాలకంటే అవే ఎక్కువగా ఉండేవి. ఈ రంగస్థల ప్రదర్శనల ఆనందం వేరు. ఆ అనుభూతి వేరు. వారి ప్రదర్శనలు బాగా ఉన్నా లేకపోయినా వాటిని పొగిడేవారు. పొగడకపోతే వారిని అనాగరికులు అనుకొంటారని వారికి భయం.

ఇక పేద కళాకారులు బహిరంగ ప్రదేశాలలో టున్ టునియలు డొల్చి వాయిస్తూ రాత్రంతా పాడుతూ ఆడేవారు. గ్యాస్‌లైట్ల ముందు, కొంత అలంకారంతో, అట్టహాసం, ఆర్భాటం లేకుండా ప్రదర్శనలు ఇచ్చేవారు. రాత్రంతా ప్రేక్షక జనం కూర్చుని చూసి ఆనందించేవారు. ఇవే ప్రజాకళలు. వీటినే జానపద కళలనేవారు. ఆ కాలంలో అప్పుడప్పుడు వెళ్ళి ఈ కళలను కూడా చూసి వచ్చేవాణ్ణి. ఈ ప్రజా కళలకు శాస్త్రీయ కళలకు మధ్యగల తేడా ఏమిటి? ఈ రెండింటి



వడ్డించింది. 'బాబూ...!' అంటూ ఆగిపోయింది. ఆమె ఏదో చెప్పాలనుకొని, సందేహించింది. 'ఏమిటి ఆయీ! ఏం కావాలో అడుగు. నీకు సందేహం ఎందుకు?' అన్నాను. 'నాదో చిన్న కోరిక రాంబాబూ! ఒక్కసారి ఆ రాంటెక్ కొండ మీదికి వెళ్ళాలని ఉంది' అంది సందేహిస్తూ.

"అదేం పెద్ద కోరిక సరే వెళ్దాం." "వచ్చే పౌర్ణమి నాడు వెళ్దామా?" "అలాగే ఆయీ" "మరో చిన్న విషయం" "ఊఁ, అదిగూడ చెప్పు సందేహించకు."

"ఒక్కసారి, ఆఖరుసారి గజ్జెలు కట్టుకొని, ఆ కొండమీది రామాలయంలో రాముని సన్నిధిలో ఆడాలని వుంది" అని ఆయీ అంది. "సరే ఆ ఏర్పాట్లు చేస్తాను. నీ కోరిక తీరుస్తాను" అన్నాను.

నా వాద్య బృందంవారితో చెప్పాను. పౌర్ణమినాడు సాయంత్రం రామాలయంలో ఆయీ కార్యక్రమం ఉందని.

పరమార్థం వేరా? అని ఆ రోజుల్లో నా జీవిత నిర్మాణ దశలో ఆలోచిస్తూండేవాణ్ణి. ఈ ఆలోచన ఈ పరిశీలన నా భావి జీవితానికి నా పరిశోధనకు ఎంతో ఉపకరించాయి.

మా చిన్నప్పుడు మా దాయీ మమ్మల్ని నిద్రపుచ్చడానికి పాడిన లాలి పాటలు, జోలపాటలకు సంగీత కచ్చేరీలలోని పాటలకు మధ్య గల తేడా గురించి ఆలోచిస్తూండేవాణ్ణి. పెద్దల కళలు వినోదాత్మకమైనవి. చిన్నవారి కళలు ప్రబోధాత్మకమైనవి. రెండూ ఆత్మానందం కోసమే. కానీ ప్రయోజనాలు వేరు, ప్రయోగాలు వేరు.

ఇలా నా జీవిత పోరాటంలో అనేక కష్టాలు అనుభవించాను. అనేక అనుభవాలు చవిచూశాను. ఇలా నా జీవితం గడుస్తూండగా ఆగస్టు 15 ఐదవసారి వచ్చింది. నాటి మధ్యాహ్నం నా గదిలో కూర్చొని చదువు కొంటున్నాను. ఇంతలో ఆయీ వచ్చింది. ఆమె చేతిలో మూడు గిన్నెల టిఫిన్ క్యారియర్ ఉంది. ఆమె ఒక చిన్న పళ్ళెం తీసుకొని వచ్చి నా దగ్గరగా కూర్చొని 'రాంబాబూ! నీకోసం ప్రత్యేకంగా తెచ్చాను' అంటూ టిఫిన్ క్యారియర్ తెరిచింది. ఒక గిన్నెలో పూరన్ పోలీలు, మరొక గిన్నెలో పూరీలు, వేరొక గిన్నెలో మామిడి పళ్ల రసం ఉన్నాయి. ఒక్కొక్కటే తీసి ఆమె

'అవి ఆమె ముచ్చట్లు కావు. ఆమె తపన. మీరంతా సిద్ధంగా ఉండండి' అని వారిని హెచ్చరించాను. మా బృందం వారు కొందరు ముసలికాలం ముచ్చట్లని ముసిముసి నవ్వులు నవ్వుకొన్నారు.

పౌర్ణమినాటి సాయంత్రం అందరం ఆ దేవాలయానికి వెళ్లాం. భోంస్లా రాజులు కట్టించిన దేవాలయ మది. మేమంతా కాలి నడకను కొండ ఎక్కాం. ఆయీ కొండ ఎక్కలేదు గనుక ఒక మేనాను ఏర్పాటు చేశాను.

నాడు నిండు పౌర్ణమి. పండు వెన్నెల కాస్తూంది. అదొక దివ్యానుభూతి. ఒక వృద్ధ కళాకారిణి చివరి కోర్కెను తీర్చబోతున్నా మన్న తృప్తితో సంతోషంతో కొండ ఎక్కడం కష్టమనిపించలేదు. కాళ్ళూ, చేతులూ కడుక్కొని అందరం ఆలయంలోనికి వెళ్ళాం. అప్పుడే ఒక వృద్ధ పూజారి సీతారాములకు హారతిచ్చి పూజ ముగించారు. అందరం తీర్థ, ప్రసాదాలు పుచ్చుకొన్నాం.

తబలా, సితార, బుల్‌బుల్ తీగలను వాద్యకులు శ్రుతి చేశారు. ఆయీ తన పాత గజ్జెలను ఒక సంచిలో నుండి

తీసి కళ్ళకు అద్దుకొని కట్టుకొంది. ఆమె లేచి దేవుని యెదుట సమస్థానంలో రెండు నిమిషాలు నిలబడింది. ఆమె పెదవులు కదులుతున్నాయి. ఆమె ఏమని ఆ శ్రీరాముడిని ప్రార్థించిందో మాకు తెలియదు. కానీ ఆమె ముఖం తేజోవంతమైంది. ఆమె కన్నులు నూతన కాంతితో మిలమిల మెరిసిపోయాయి. ఆమె ఇప్పుడే ఇంత అందంగా ఉంటే యౌవనంలో ఇంకా ఎంత అందంగా ఉండేదోనని నా మనస్సులో అనుకొన్నాను.

"టుముకు చలత రామచంద్ర" అంటూ ఆమె పాట ప్రారంభించింది. వాద్యాలు మోగాయి. నేను ఆమెకు వంత పాడాను. ఆమె అభినయించింది. ''నామారోపిచికారీ కన్నయ్యా'' అంటూ ఆడింది.

అదేమి ఆట! అదేమి పాట! ఆయీకి ఆ శక్తి ఎక్కడి నుండి వచ్చింది? ఆమె కంఠం బాగా విడింది. ఆమె పాట వీనుల విందుగా ఉంది. ఆమె ఆట కన్నుల పండువగా ఉంది. మేమంతా మంత్ర ముగ్ధుల మయ్యాం. అలా ఎంత సమయం గడిచిందో మాకే తెలియదు. "అగరు గులాలు ఉదావత్ తనుపే, అంటూ మరొక చరణం అందుకుంది. అంతవరకు నిశ్చేష్టుడై నిల్చున్న పూజారి అగరు, గులాలు, చందనం, పువ్వులు అన్నీ తెచ్చి ఆమె ముందుంచాడు. ఆమె వాటిని జల్లుతూ నాట్యం చేసింది. చివరకు సీతారాములకు హారతిచ్చి, అలసిపోయి, ఒక స్తంభం మీద ఒరిగిపోయి, నేల మీద చతికిలబడింది.

కాస్సేపు సేద దీరిన తర్వాత "రాంబాబూ! నా కోర్కె తీర్చావు. నేటితో నా జన్మ తరించింది" అంటూ నా చేతులు పట్టుకుని, కన్నీళ్ళు కార్చింది. అవి ఆనందాశ్రువులు. తరువాత అందరం కొండ దిగాం. ఆయీని ఆమె గదిలో విడిచి మేం వెళ్లిపోయాం.

ఆ మర్నాడు నాకు వేరే పని ఉండడం వల్ల సాయంత్రం వరకు నేను ఆయీని కలవలేక పోయాను. ఆ సాయంత్రం ఆమె గదికి వెళ్ళాను. లోపల ఒక బుడ్డి దీపం వెలుగుతూంది. 'శ్యాం సుందర వనమాలీ ఆవో' అన్న గీతం మెల్లగా ఆ గదిలో నుండి వినిపిస్తూంది. నేను లోనికి వెళ్లాను.

"ఆవో శ్యామసుందర వనమాలీ" అంటూ ఉండగా ప్రక్కన కూర్చున్నాను. ఆమె నా చేతుల్ని తన చేతుల్లోకి, చిన్న మెత్తు బంగారం ముక్క నా చేతిలో పెట్టింది. "ఏమిటది?" అని ఆమెను అడిగాను. సమాధానం లేదు. ఆమె చేతులు వాలిపోయాయి. ముఖం ప్రక్కకు ఒరిగింది. ఆమె ఆత్మ అనంత వాయువుల్లో కలిసిపోయింది. ఒకప్పుడు తన గాన మాధుర్యంతో, తన నూపురధ్వనులతో పల్లె జనుల హృదయాలను కొల్లగొన్న ఆయీ ఇంక లేదు.

ఆయీకి నా అన్నవాళ్ళు ఎవరూ లేరు. మే మే మిత్రులం. ఆమెను దహనం చేశాం. దహనం చేసే ముందు ఆమె నా కిచ్చిన చిన్న మెత్తు బంగారం ముక్కను ఆమె నోటిలో వుంచాను. ఆ మర్నాడు ఆమె అస్తికలను ధన్‌తోలి, సీతాబల్దిలను వేరు చేసే నదీ సంగమంలో కలిపాం.

ప్రతి పౌర్ణమినాడు ఆమెను దహనం చేసిన స్థలానికి వంటరిగా వెళ్ళి, ఆమె ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు ఆ రాముణ్ణి ప్రార్థించి వచ్చేవాణ్ణి.

ఆ తర్వాత కొన్నాళ్ళకు బండారా సంస్థానాధీశులు రాజా గణపతిరావు పాండ్యావారు నన్ను వారి ఆస్థాన నాట్య కళాకారునిగా నియమించారు. అక్కడ ఎందరో కళాకారుల్ని కలుసుకొన్నాను.

అక్కడ నా జీవితం ఎంతో ఆనందంగా గడిచింది. ఇంతలో సంస్థానాలు రద్దయ్యాయి. ఆంధ్రదేశం వచ్చేయాలని నిశ్చయించుకొన్నాను.

మరుసటి పౌర్ణమినాడు ఆ రాముని ఆలయానికి వెళ్ళాను. ఆ రాముని సన్నిధిలో ఆయీ పాడి, ఆడి, అభినయించిన ఆ తులసీదాసు కీర్తన, టుమ్రీనే ఆడి పాడి అభినయించాను. ఆ వృద్ధ పూజారి అగరు, చందనం, గులాలు, పుష్పాలు తెచ్చి ఇచ్చారు. వాటిని ఆ రాముని పైని జల్లుతూ నాట్యం చేశాను.

తర్వాత ఆంధ్రకు వచ్చేశాను. ఇప్పటికి 40 ఆగస్టు పదిహేనులు గడిచిపోయాయి. కానీ మళ్ళీ ఆ రామ్‌టెక్‌కు వెళ్ళలేకపోయాను. అయినా ప్రతి పౌర్ణమినాడు ఒక్క క్షణం పాటు ఆయీ నా కళ్ల ముందు కదలాడుతుంది.

నా స్మృతి పథంలో ఆమె శాశ్వతంగా ఉండిపోయింది. "ఆయీ" అంటే మరాఠీలో "అమ్మ."

మి

## తెలుగు నాటకరంగ చరిత్ర : 12వ పుట తరువాయి

పారిశుభ్ర్యమిందులో లేదు. రామానుజ భాష్యమువలె ముక్తిదాయకము కాదు' అని వా పోవుట నిర్నిమిత్త ప్రలాపము." కన్యాశుల్క నాటకం నీతిమంతం కాదనే వారికి ఇదే సరైన సమాధానం.

ఇంక ఇప్పటి దాకా చెప్పుకొన్న విషయాలను సూత్ర ప్రాయంగా చెప్పుకోవలసి ఉంది.

1. తెలుగువారి నాట్య సంప్రదాయం యక్షగాన రూపక సంప్రదాయమే. అంతర్జాతీయంగా, నాటకరంగంలో, ప్రదర్శన దృష్టితో, రచన దృష్టితో, తాత్విక దృష్టితో వస్తూన్న అత్యాధునిక ధోరణులను యక్షగాన రూపకం ఆహరించుకోగలదు.
2. మహారాష్ట్ర కళాకారులద్వారా రూపుమారి పౌరాణిక నాటకంగా ఆంధ్రదేశానికి చేరిన సంకర కళారూపం నూతనోత్తేజాలను కలిగించలేకపోయింది. ప్రయోగాలకు అవకాశమివ్వని కృతక కళాప్రక్రియ కనుకనే అర్థశతాబ్దం మాత్రమే జీవించగలిగింది.
3. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావుగార్ల కృషితో పాశ్చాత్య ప్రభావం వలన ప్రభవించిన వచన నాటకం తెలుగు నేలలో మరుగుజ్జుగానే మిగిలిపోవలసి వచ్చింది. ఇందుకు ప్రధాన కారణం రచయితలలో కావలసిన భావ చైతన్యం లేకపోవడమూ, అభిరుచి రాహిత్యమూ.
4. తెలుగులో నేటికీ చెప్పుకోదగ్గ నాటక విమర్శ రానేలేదు. వివిధ విశ్వవిద్యాలయాలలో జరుగుతున్న పరిశోధన సైతం, నాటక ప్రక్రియ విషయంలో, బాగా వెనకబడి వుంది.

ఇంత బాధాకరమైన పరిస్థితికి కారణమేమిటి అన్నది చరిత్రను విశ్లేషించి చూసి తెలుసుకోవలసి వుంది. ఈ విషయంలో గురజాడ అప్పారావుగారి అభిప్రాయమిది, కన్యాశుల్కం పీఠిక నుంచి ఉదాహరిస్తున్నాను.

"Such a low level of literary workmanship is a matter for wonder after fifty years of University education and domination of within culture and it can be attributed only to the defective teaching of English literature in our Colleges."

అప్పారావుగారి వాక్యాలలో సత్యం వుందని నేను భావిస్తున్నాను. ప్రపంచంలో యే భాషా కూడా మరొక అభివృద్ధి చెందుతూన్న భాషతో సంపర్కం లేకుండా సుసంపన్నం కాలేదు. గతంలో కొంతలో కొంత సంస్కృతం తెలుగు అభివృద్ధికి సహాయకారిగా వుండేది. ఆధునిక కాలంలో అటు సంస్కృతంతో పాటు ఆంగ్ల భాషాధ్యయనం కూడా తోడైతేనే తప్ప అభివృద్ధికి మార్గం యేర్పడదు. ఈ సందర్భంలో అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరుల అభిప్రాయాన్ని కూడా గమనించవలసి వుంది.

"తెలుగు యెప్పుడుగాని ఉత్తమ విద్యా ద్వారంగా వుండలేదు. నన్నయ కాలంనుండి మదరాసు విశ్వ విద్యాలయం వచ్చేవరకు విజ్ఞాన ప్రదమైన ఉత్తమ విద్య అంతా సంస్కృతం ద్వారానే విద్యా పీఠాల్లో అభ్యస్తమవుతూ వుండేది. మద్రాసు విశ్వవిద్యాలయం వచ్చిన తరువాత మనలో అనేకులు ఇంగ్లీషు ద్వారా ఉత్తమ విద్య అభ్యసిస్తున్నారు. కనుక ప్రాచీనకాలంలోగాని, యిప్పుడుగాని తెలుగు ఉత్తమ విద్యా ద్వారంగా వుండే ఉదాత్త ప్రతిపత్తి పొందలేదు. ఉత్తమ విద్య అంటే బుద్ధి పరిణతి హేతువై విచారణాపూర్వకమైన విజ్ఞానం."

(పల్నాటి వీర చరిత్ర పీఠిక)

ఈ వాక్యాలలో ఉమాకాన్తంగారు కఠోర వాస్తవాన్ని ఆవిష్కరించారు. ఈ నాటికీ తెలుగు పరిస్థితి అలాగే కొనసాగి వస్తున్నది. నాటక రంగానికి సంబంధించినంత వరకూ చూసుకుంటే కాళిదాసాది మహాకవుల కృతులు సజీవ భాషలోకి నేటికీ అనూదితం కాకుండానే వుండి పోయాయి. అలాగే అటు షేక్స్పియర్ రచనలూ తెలుగులోకి సరైన రీతిలో అనువాదం కాలేదు. ఇంగ్లీషు, సంస్కృత భాషల నుంచి రూపక వ్యాఖ్యానాలు కూడా తెలుగులో వెలువడలేదు. ఆంగ్ల భాషలో ప్రావీణ్యం వున్నవారు తెలుగులో రాయలేదు. ఈ కారణాల వల్ల ఇతర భాషా సంపర్కం కేవలం పైమెరుగుగానే తెలుగు భాష పొందగలిగింది. పర్యవసానంగా ఆధునిక తెలుగు సారస్వతం యెదగవలసిన స్థాయికి యెదగలేకపోయింది.

విజ్ఞులు, విద్యా వేత్తలు, రచయితలు ఈ విషయంలో చర్చించి తగు విధానాలను రూపొందించగలరు.

# భారతీయ సంస్కృతి - సత్యాసత్యాలు

**- బి.ఎస్.ఎల్. హనుమంతరావు**

జాతీయభావం ఆధునిక యుగలక్షణాల్లో ప్రధానమైనది. ఒక ప్రాంతంలో నివసించే ప్రజలలో ఒక ప్రత్యేకత, వైశిష్ట్యం ఉంటుందనే విశ్వాసమే జాతీయ భావానికి మూలం. నేటికీ ఈ భావం ప్రపంచ రాజకీయాల్లో ప్రబలంగా ఉంది. యుగయుగాలుగా ఒక జాతి నిర్మించుకొన్న సంస్కృతిలో ఆ జాతికి స్వకీయమై, విలక్షణమైన ఉపజ్ఞ ప్రతిఫలిస్తూ ఉంటుందనే ప్రబోధాలు సర్వదా వినిపిస్తూ ఉంటాయి. ఈ వాదనకూ "ప్రాక్పశ్చి మాలకు పొత్తు అసంభవం" అన్న ఆంగ్ల సామ్రాజ్యవాద మహాకవియైన రుడ్యార్డ్ కిప్లింగ్ సిద్ధాంతానికీ వ్యత్యాసం లేదు. అదే ధోరణిలో 'శ్వేతజాతుల గురుతర బాధ్యత' అనే సాకుతో పాశ్చాత్యులు తూర్పు దేశాల్లో తమ తమ దురాక్రమణలను సమర్థించుకొన్నారు. పై రెండు సిద్ధాంతాలను కలిపి ఆలోచించినప్పుడు ఆయా జాతుల్లో ప్రబలిన జాత్యహంకారం స్పష్టంగా బోధపడుతుంది. ఈ అహంకారానికి పరాకాష్ఠగానే హిట్లరిజం ఉంటుంది. "ఆర్యజాతి ఉత్తమోత్తమజాతి; ఉత్తములైనవారే పాలకులుగా అర్హులైనవారు; జర్మనులు ఆర్యులు, కాబట్టి జర్మనులే ప్రపంచాధిపత్యం వహించి తీరుతారు" అనే ప్రబోధంతో జర్మనుల అహంకారాన్ని రెచ్చగొట్టి రెండో ప్రపంచ మారణహోమాన్ని సృష్టించి జర్మను జాతిని సర్వనాశనం చేశాడు హిట్లర్. అందుచేత విలక్షణ జాతీయ ఉపజ్ఞ అనే భావం సామ్రాజ్యవాదం అనే మానసిక రుగ్మతనుండి ఉత్పన్నమైనదనడం సత్యదూరం కాదు. విదేశ వాణిజ్యంలో, వలస రాజ్యపాలనలో ఐరోపా రాజ్యాలు పోటీపడే రోజుల్లోనే జాతీయభావం పుట్టి బలపడి విస్తరించింది. చరిత్రలో జరిగిన పెక్కు యుద్ధాలకు పైన పేర్కొన్న మానసిక రుగ్మతే కారణం. యుద్ధాలకంటె ప్రమాదకరమైన, మానవుని మానవత్వాన్ని హరించే అసూయ, ద్వేషం, భయం అనే భయంకర సాంఘిక జాడ్యాల నిర్మూలనకు ఆటంకంగా ఉన్నది సయితం ఈ అహంకారమే!

రాధాకృష్ణ పండితుడు రష్యాదేశాన్ని సందర్శించిన సందర్భంలో అచటి భారతీయ విద్యార్థులనుద్దేశించి "ప్రపంచ మానవులనందర్నీ ప్రేమించడం నేర్చుకోండి; ప్రపంచ దృష్టిని అలవరచుకోండి" అని ప్రబోధించాడు. ఎన్నో శతాబ్దాలుగా మానవుడు కలలుకంటున్న మహాదాశయం 'ఏక ప్రపంచం', కాని జాతీయ వైలక్షణ్యం వంటి భావాలు ఏక ప్రపంచ స్థాపనకు తీవ్ర ఆటంకాలు. అట్టి భావాలకు స్వస్తి చెప్పి మానవులందర్నీ సమైక్యం చేయగల తాత్త్వికదృష్టి అలవరచుకోవలసిన అవసరం నేడెంతగానో ఉంది. సుమారు రెండువేల సంవత్సరాలనాడే క్రీస్తు మహాశయుడు తమజాతి ఉత్తమోత్తమమైనదన్న విశ్వాసాన్ని తిరస్కరించి "సృష్టికర్త దృష్టిలో మానవులందరూ సమానం" అని బోధించాడు.

ప్రాక్పశ్చిమాలనేవి కేవలం భౌగోళికమైన సాపేక్షిక భావాలేనని శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు రుజువు చేశాయి. జాతి పవిత్రత, విలక్షణం అనేవి అభూత కల్పనలేనని జీవశాస్త్రం, మానసిక శాస్త్రం నిరూపించాయి. ఈ అంశాలను సమన్వయం చేసినప్పుడు జాతీయ ఉపజ్ఞ అనే భావం అశాస్త్రీయం, అసత్యం మాత్రమేగాక ప్రమాదకరమైనదని గుర్తించపక తప్పదు. కాబట్టి జాతికి, జాతికి ప్రత్యేక సంస్కృతి ఉండడానికి అవకాశం లేదు. మానవులందరిదీ ఒకే జాతి, మానవజాతి, వారిది ఒకే సంస్కృతి, మానవ సంస్కృతి. ఆ సంస్కృతి పునాదులను అర్థం చేసుకోడానికి మానవునకు మానవుడుగా సంక్రమించిన వారసత్వాన్ని గురించిన పరిశీలన అవసరం.

డా. బి.ఎస్.ఎల్. హనుమంతరావు : ప్రఖ్యాత చరిత్రకారులు, విశిష్ట విశ్లేషకులు, చింతనాపరులు.

## సంస్కృతి, నిర్వచనం:

సంస్కృతిని పలువురు పలురకాలుగా నిర్వచించారు. సంస్కృతి అన్న మాటకు స్థూలంగా సంస్కార ఫలితమని అర్థము. అయినప్పుడు సంస్కృతి మానవ కృషి ఫలితమే అవుతున్నది. మానవుని స్థితిలో పురోగతిలో ఉదాత్తము, విశిష్టములైన అంశాలే సంస్కృతి. ఈ అంశాలనే మానవుని జీవితానికి సంబంధించి సాధారణ అవసరాల కంటె భిన్నమై మానవున కొక విశిష్టమైన స్థానాన్ని చేకూర్చినాయి. సాధారణ అవసరాలు భౌతికాలు; మానవునకు ఇతర జీవకోటికి సమానాలు. కాని మానవుడు తన మేధా సంపత్తి చేత మాత్రమే ఇతర జీవకోటి కంటె ప్రత్యేకతను సాధిస్తున్నాడనేది స్పష్టం. ఈ మేధాశక్తి మానవుని శరీరంలోని అంతర్భాగమే. అదే అతనిలోని చైతన్య స్వరూపము. అందము–వికారము, మంచి–చెడు, సత్యము–అసత్యము వీని మధ్యగల తారతమ్యాన్ని గ్రహించే సామర్థ్యం మేధస్సు వల్లనే మానవునకు లభిస్తున్నది. ఈ మేధాశక్తి మానవులందరికీ సమానమే. కాబట్టి మానవజాతి అంతటికీ సమాన ధర్మమైన మేధాశక్తియే సమస్త సంస్కృతికి మూలాధారమనేది నిశ్చితాంశం. సంస్కృతికి జన్మస్థలం మానవుని మేధయే!

అయితే, సంస్కృతికి మానవుని మేధ ఒక్కటే కారణం కాదు. సంస్కృతి పరిణామక్రమంలో భౌతిక చారిత్రక పరిస్థితులు సైతం ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నాయి. మానవుని భావాలు, దృక్పథము, ప్రవర్తన, సాంఘిక రాజకీయ సంస్థలు మొదలైనవన్నీ కలిసి ఆతని సంస్కృతికి సమగ్ర రూపాన్ని ప్రసాదిస్తాయి. ఒక విధంగా తాను నివసించే భౌతిక అవసరాల నేపథ్యంలో మానవుని మానసిక శారీరక శ్రమల సమన్వయ స్వరూపమే సంస్కృతి. అంటే భౌతిక పరిసరాల సవాలుకు మానవ మేధాశక్తి సృజన సామర్థ్యం చెప్పగల సమాధానాల ఫలితమే సంస్కృతి. భౌతిక పరిసరాలు స్థిరమైనవి, చాలవరకు శాశ్వతమైనవి. కాబట్టి ప్రాయికంగా మానవగుణాల ఫలితంగా ఏర్పడినప్పటికీ భౌతిక పరిసరాల్లో కనిపించే భిన్నత్వం వల్ల వివిధ మండలాలలో నివసించే మానవ సమాజాల సంస్కృతులలో వైవిధ్యం కనిపించడం కద్దు. ఒక సుప్రసిద్ధ పురాతత్త్వవేత్త అభిప్రాయంలో "ఒక్కొక్క సమాజం తన చరిత్రలో కొన్ని సంప్రదాయాలను, ప్రవర్తనా నియమావళిని, శాస్త్ర విషయాలను రూపొందించు కుంటుంది. ఈ నియమాలను, శాస్త్రాలనూ పరిసరాలతో అనుసరించడం మీదనే ఆ జాతి భవితవ్యం ఆధారపడి ఉంటుంది.



రెండు జాతుల జీవిత విధానాలలో కనిపించే భేదాలు

ఆ జాతుల చరిత్రలోని వ్యత్యాసాల వల్ల ఏర్పడినవే గాని, శారీరకంగా అంతర్యాలైన విభేదాలవల్ల కలిగినవి కావు. కావున భారతీయ సంస్కృతిలో విశిష్టమైనవిగా పరిగణించే లక్షణాలన్నింటికీ భారత ఉపఖండ భౌగోళిక పరిస్థితులే చాలా వరకు కారణాలుగా నిరూపించవచ్చు. క్రియాత్మకం గాని భావనాదృష్టి, కర్మ సిద్ధాంతం, నిష్కామకర్మ భావం, వర్ణ వ్యవస్థ, జాత్యహంకారాన్ని పెంచే ఏకాకిత్వము భారత సంస్కృతికి విశిష్ట లక్షణాలు! ఇవన్నీ భౌగోళిక పరిస్థితుల ప్రభావం వల్ల భారతదేశ చారిత్రక సంఘటనల ఫలితంగాను, ఏర్పడినవేనని సోదాహరణంగా వివరించ వచ్చు. గోర్డాన్ ఛైయిల్డ్ అభిప్రాయంలో "పరిస్థితులకు అనుగుణంగా మలచుకొనే ప్రయత్నంలో సమాజాలు రాజ్యాలను నిర్మించుకొన్నాయి. గణితశాస్త్రాలను రూపొందించినాయి; ఈ కార్యక్రమాలన్నీ మానవులందరకు సమానం, సహజమైన గుణాల ఫలితంగా జరిగినవే, కాని అవాఙ్మానస గోచరం, మానవాతీతమైన దివ్యశక్తి సృష్టించిన విభేదాలవల్ల ఏర్పడినవి మాత్రం కావు."

## భారతీయ ఆధ్యాత్మికత:

పరిసరాల సవాలును ప్రాయికమైన మానవ లక్షణాలతో నెదుర్కొనే కృషిలో సంస్కృతి, పరిణామం చెందుతుందనే సత్యాన్ని మనసులో ఉంచుకొని దాని విశిష్ట లక్షణాలనే వాటిని పరిశీలిద్దాం.

ఆధ్యాత్మికత, భారతీయ సంస్కృతికి పునాది అనీ, కేవలం ప్రాపంచికమైన పునాదులు గల పాశ్చాత్య నాగరకత కంటె భిన్నమైనదనీ తరచు వింటూంటాం. పాశ్చాత్య చరిత్రకారులు, ఈ విషయాన్నే ప్రశంసిస్తూ ఉండడం గమనించదగినది. తమ సంస్కృతిలోని ఆధ్యాత్మిక లక్షణాన్ని భారతీయులెప్పుడు గుర్తించారో చెప్పలేం. వాస్తవానికి ఈ విషయానికి గుర్తించినవారు పాశ్చాత్యులే. వీరు, భారతీయుల దృష్టిలో తుచ్ఛమైన ఐహిక నాగరకతా సంస్కృతులను నిర్మించుకొన్నవారే! కాగా మరుగున పడిన పాత విషయాన్ని త్రవ్వి భారతీయుల దృష్టికి తీసుకురావడంలో వారి ఉద్దేశ్యం ఏమిటి అనే ప్రశ్న రాకమానదు. భారతీయులు ఆధ్యాత్మిక దృష్టి గలవారనీ, తమ రాజకీయాధిపత్యానికి ప్రమాదం ఉండదనీ ఆంగ్లేయులు భావించి ఉండవచ్చు. మరొక విశేషం. నాడు పాశ్చాత్య దేశాల్లో పారిశ్రామిక విప్లవ ప్రభావం వల్ల మధ్యయుగ మతప్రోక్తమైన భావాలు, విలువలు, నశించి వినూత్నం, శాస్త్రీయమైన విలువలు రూపొందుతున్నాయి. విప్లవాత్మకం, ప్రగతిశీలమైన ఈ మార్పులను సనాతనులు గ్రహించలేక పోయారు. పారిశ్రామిక విప్లవవల్ల తాత్కాలికంగా వచ్చిన సాంఘిక దురాచారాలను ఖండిస్తూ మతంలో విశ్వాసాన్ని పునరుద్ధరించే ఆశయంతో మెథడిస్టు మొదలైన ఉద్యమాలు విజృంభించాయి. ఆ పరిస్థితుల్లో తాము కోల్పోతున్న మత సాంప్రదాయాలు, విలువలు భారతీయ సంస్కృతిలో వేళ్ళు తన్నుకొని ఉండడాన్ని పరిశీలించినవారు పాశ్చాత్య సనాతన విద్వాంసులే! అందుచేత ఆ విలువలనే వారు ఉదాత్తం, ఆదర్శప్రాయం, ఉత్తమం అంటూ కీర్తింపసాగారు. అందువల్ల పరాజితులైన భారతీయులకు తమ విజేతలను వెక్కిరంచడానికి అవకాశం లభించింది.

చిత్తశుద్ధితో భారతీయ ఆధ్యాత్మికతకు జోహారు లర్పించిన అనిబిసెంటు వంటివారు సైతం కాకతాళీయ మైన సంఘటనలతో ఆంగ్ల సామ్రాజ్యవాదుల పైనున్న ద్వేషంతో భారతీయతవైపు ఆకర్షితులైనారు. ఏమైనప్పటికీ భారతీయతలో నశించిపోతున్న ఆధ్యాత్మిక భావాన్ని పునరుద్ధరించి పుష్పాంజలి ఘటించిన పాశ్చాత్యులే మనలో జాతీయభావాన్ని పురికొల్పినారనడం చాలావరకు నిజం.

జాతీయవాద విధానాల్లో భారతీయ ఆధ్యాత్మిక మనస్తత్వం విచ్చలవిడిగా కీర్తించబడింది. ఈ ప్రచార ఫలితంగా ఆధ్యాత్మికతే మనకు గర్వకారణంగా భావిస్తున్నాం. ఈ మనస్తత్వం మనకెంత వరకు ప్రయోజనకారి అనే విషయం అటుంచి ఆ వాదనలో ఎంతవరకు సత్యముందో పరిశీలిద్దాం.

వైదిక మతానికి నేటి హిందూమతానికి పోలికేలేదు. అయినా వేదాలే హిందూ మతానికి ప్రామాణిక గ్రంథాలని హిందువుల విశ్వాసం. నేడుకూడా హిందూమతం అనడంకంటె వేదమతం అనడమే యుక్తమని కొందరు భావిస్తారు. వైదికమతాన్ని పరిశీలిస్తే హిందూ ఆధ్యాత్మికత కేవలం నేతిబీరకాయగ స్పష్టమౌతుంది. వైదిక దేవతల్లో సర్వశ్రేష్ఠుడు ఇంద్రుడు. ఇతని స్వభావం యెలాంటిది? తన భక్తులైన మానవులకంటె ఎక్కువ శారీరక సుఖాలను కాంక్షించినవాడు. వాస్తవానికి మానవులకందని ఆశయాల

**మిగతాది 34వ పుటలో...**

# కవి



ముఖ్దూం

ఇంద్ర ధనుస్సు నుండి
ఒక్కింత వన్నె స్వీకరింతు
చిరుతారల నుండి కొంత
జీవకాంతి దొంగిలింతు

చంచలాలతికనుండి
రస స్పందన మడిగికొందు
మధుమాసము నుండి కొంత
మత్తు కొల్లగొట్టుకొందు

గ్రుడ్డి జవ్వనమ్ము నడిగి
కొందు కొంత బిబ్బోకము
ఉన్మాదము పెంచు అంద
మొసగె నాకు హేవాకము

చెదిరిన కిరణమ్ముల కన్
తుదల నేరుకొని తెత్తును
బెదరిన స్వరములను గూర్చి
హృదయ గీతి నిర్మింతును

స్వర్గ స్మృతిలో కూర్చుని
చక్కని మూర్తిని మలతును
మొండి రాతిలో సైతము
గుండె చప్పుడును కూర్తును

మూలం : **ముఖ్దూం మొహియుద్దీన్**
తెలుగు : **సి. నారాయణరెడ్డి**

# పుట్టని పాప ప్రార్థన

నేనింకా పుట్టలేదు నా ప్రార్థన వినండి
గాలి ధూళి మహామారి
బాలారిష్టాలు లేని,
గద్ద గుడ్లగూబ రాని
గబ్బిలాలు జడిపించని బతుకివ్వండి.

నేనింకా పుట్టలేదు, ఓదార్చండి
గోడలలో గోడలతో కుమ్మికుమ్మి
నల్లమందు నిషాలలో ముంచి ముంచి
అబద్ధాల కుతంత్రాలు కురిసి కురిసి
జైళ్ళలో చిత్రవధ
రైళ్ళలో దోపిడి
మీ ఆయుధాలకు నన్నొక బలిపశువును
చేస్తారని భయం, దాన్ని పోకార్చండి.

నేనింకా పుట్టలేదు, నాకోసం
వానలు కురిపించండి
పంటలు పండించండి
ఆడుకొనే చెట్లూ
పాడుకొనే ఆకాశం పక్షులతో స్నేహం
నా దారికి వెలుగిచ్చే తెల్లని దీపం
నా మనస్సు వెనకాతల వెలిగించండి.

నేనింకా పుట్టలేదు, క్షమించండి
నాద్వారా ప్రజలు చేసే పాపాలూ
నా పేరిట జరగబోయే మోసాలూ
నేనాడని మాటలు, ఊహించని తలపులు
నేనెరుగని ద్రోహుల కుట్రలు
నా చేతులతో చేయించే హత్యలు
నా నాలుకతో పలికించే దొంగసాక్ష్యం
ఇతరుల బతుకుల ఫలితంగా నా మరణం
నా బతుక్కి ఫలితంగా ఇతరుల మరణం
నా భావిబాధ్యతల నన్నే మన్నించండి.



నేనింకా పుట్టలేదు! మీరే చెప్పండి
ఏ పాత్ర ధరించాలో
ఏ మాటలు పలకాలో
ముసలివాళ్లు నాకు నీతి బోధిస్తే
ప్రభుత్వాలు నా నడవడి శాసిస్తే
పర్వతాలు తమకోపం ప్రకటిస్తే
నన్ను చూచి హేళనగా ప్రేమికులు
రా రమ్మని పిలిచే పెనుకెరటాలు
నా శవాన్ని నాశనాని కెరచేసే ఎడారి.

నా బిచ్చం పుచ్చుకోని భిక్షుకుడు
నేనేం చెయ్యాలంటారో

మీరే చెప్పండి.

నేనింకా పుట్టలేదు,
నా ప్రార్థన మదినుంచండి
పశుప్రాయుడైనవాడు
భగవంతుణ్ననేవాడు
నా కుభయుల సంపర్కం వదిలించండి
నేనింకా పుట్టలేదు! నాకివ్వండి
నాలోగల మానవత్వ మెవరైతే అపహరించబోతారో
ఎవరైతే
నన్నొక యంత్రంగా మార్చాలని యత్నిస్తారో
బజారులో నన్నొక సరుకుగా
మొగాని కొక ఖరీదు తగిలించి
నా అస్తిత్వం ఎవరైతే చీల్చాలని చూస్తారో
అటూ ఇటూ
ఇటూ అటూ బంతిలాగ తంతారో
ఎవరైతే
నన్నొక నిర్జీవపు శిలను చేసి
ప్రతిఘటించగల శక్తిని నాకివ్వండి
ఈ షరతులమీద నన్ను రానివ్వండి
లేదా నన్నే క్షణమే చావనివ్వండి

(లూయీ మేక్‌నీస్ గీతానికి
ముక్కస్య ముక్కానువాదం)

**- శ్రీశ్రీ**

భారతీయ సంస్కృతి.... 31వ పుట నుంచి...

ఆకాంక్షల ఆదర్శ స్వరూపాలే దేవతలు. గోమాంస భక్షణ సురాపానం, దస్య విధ్వంసం ఇంద్రుని కార్యకలాపాలలో ప్రధానమైనవి. ఈ విధ్వంసన ప్రయోజనం సైతం దాసదస్యుల పురాలు, గోవులు, క్షేత్రాలు మొదలైన ఇహలోక సంపదలను దోచి, ఆర్య సామ్రాజ్యాన్ని విస్తరింపచేయడమే. సామ్రాజ్య దాహమున్న పాశ్చాత్యులకు ఆదర్శ ప్రాయుడుగా ఉండదగిన దేవుడు ఇంద్రుడు. కావున వైదిక దైవమైన ఇంద్రునిలో ఆధ్యాత్మిక స్వభావం అణుమాత్రం కనిపించదు. ఇక వైదికమతానికి ప్రాణప్రదమైనది యజ్ఞం. పంట పొలాలు, పశువులు, పుత్రసంతానం మొదలైన ఐహిక వాంఛలను తీర్చగలందులకై, దేవతలకు లంచం చెల్లించే కార్యక్రమమే ఆదిమ యజ్ఞం. వైదిక ఋషులెన్నడు మోక్షాన్ని కోరినట్లు కన్పించదు. వైదిక ఋషులదీ, వారి దేవతలదీ కేవలం వ్యాపార దృష్టి. వైదికమతంలోని ఈ ఐహిక లాలసత్వంమీద తిరుగుబాటుగానే ఉపనిషత్తుల భావ వాదం అవతరించింది. వేదాలది కర్మమార్గం, ఉపనిషత్తులది జ్ఞానమార్గం. అది ఆర్య-ఆర్యేతర మత సంకలనంవల్ల జనించిందే. ఇస్లాంలోని సూఫీవాదంతో ఉపనిషత్తుల వాదాన్ని పోల్చవచ్చు.

వైదిక ఉపనిషద్విధానాలకు సరితూగగలవి ప్రపంచంలో మరెక్కడ లేవని హిందువులు గర్వించడం కద్దు! ఇది కేవలం ఆధార రహితమైన అహంభావం! వైదిక దేవతలకు హోమర్ రచనలలోని గ్రీకు దేవతలకు పోలికలున్నాయి. ఉపనిషత్తుల జ్ఞానవాదానికి, గ్రీకు దార్శనికుడైన ప్లేటో వాదానికి సామ్యం కనిపిస్తుంది. మరొక విశేషమేమిటంటే ఉపనిషత్ ఋషులు ఐహిక సుఖాన్ని త్యజించి ఆధాత్మిక విజయాలపైనే దృష్టిని కేంద్రీకరించా రనుకోవడం వెర్రితనం. నాటి రాజులు ఋషుల సేవకై తమ జీవితాలను అంకితం చేశారు. ఋష్యాశ్రమ అవసరాలను తీర్చడానికి పోటీలు పడేవారు. నాటి మత రాజకీయ సాంఘిక పరిస్థితి అటువంటిది. ఆ మహర్షుల సందేశమే "శరీర మాద్యంఖలు ధర్మసాధనం." అపారమైన లోకానుభవము, దూరదృష్టి ఉన్న సందేశం. ధర్మసాధనకు శరీరమే మూలం; కాబట్టి శరీరాన్ని నిర్లక్ష్యం చేస్తే ధర్మసాధనకు నష్టం వాటిల్లుతుంది, అని హెచ్చరిక.

ఇక హిందువు లాశించిన ధర్మ స్వరూపమేమిటి? హిందువుల జీవితాశయాలు నాలుగు. అవే పురుషార్థాలు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. చతుర్విధ పురుషార్థాలు చాలవరకు ఐహికాలే! వీనిలో 'ధర్మ' పదం చాల చిత్రమైంది. హిందూమత ప్రవక్తలు, వ్యాఖ్యాతలు భిన్నార్థాలు వచ్చేటట్లు ఈ పదాన్ని వాడారు. పురుషార్థాలకు సంబంధించినంత వరకు వ్యక్తి, తన కుటుంబానికి, కులానికి, రాజ్యానికి అన్నిటికంటె, తన సుఖజీవితానికి తాను నిర్వహించ వలసినదే ధర్మంగా వ్యవహరించ బడిందని నిర్ణయించ వచ్చు. శరీర పోషణ పట్ల అశ్రద్ధ వహిస్తే పైవిధుల నిర్వహణ అసాధ్యమవుతుంది కదా! అందుచే ఉదరపోషణను ధర్మంగా పరిగణించాలని హెచ్చరిస్తుంది హిందూధర్మం. ఇక అర్థకామాలలో ఆధ్యాత్మికత లేదనే చెప్పవచ్చు. కాని ధర్మబద్ధుడై మాత్రమే అర్థకామాలను సాధించాలన్న సూచన సుస్పష్టం! అనగా సామాజిక నియమావళికి కట్టుబడి మాత్రమే పైరెండు పురుషార్థాలు సాధించవలసి వుంది. ధర్మాన్ని, పురుషార్థాలలో ప్రథమంగా పేర్కొనడంలోని ఉద్దేశ్యం అదేనని నా అభిప్రాయం. ఇక నాలుగో పురుషార్థం మోక్షం. ఇది ఆధ్యాత్మిక సంబంధమైనదే. కానీ ఇందులో ప్రత్యేకంగా భారతీయత కలదనడం అసమంజసం. మోక్షానికి సాధారణంగా చెప్పుకొనే అర్థం 'జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావడం.' ఈ కోరిక ప్రపంచంలోని అన్నిమతాలకు సర్వసామాన్యం. "సమస్త ప్రపంచాన్ని జయించినా ఆత్మను కోల్పోతే అది విజయం కాదు" అని క్రీస్తు బోధనలో వుంది. మోక్షం ఆత్మ సాక్షాత్కారం అనే భావాలు అన్ని మతాల్లోనూ వున్నై, హిందూమతమే వానిపై గుత్తాధిపత్యం సంపాదించ లేదు.

భారతీయ సంస్కృతీ సందేశాన్ని పాశ్చాత్యదేశాలకు అందించిన రాధాకృష్ణ పండితుని అభిప్రాయంలో "ప్రపంచ ఆర్థిక రాజకీయ శాస్త్రాలకు భారతీయులు సేవ చేయలేకపోవచ్చు, కాని మతము తత్త్వశాస్త్రం అనే రెండు రంగాల్లో భారతీయుల సాధన అపారం. ప్రపంచ చరిత్రలో ప్రాక్పశ్చిమాల మధ్య యధార్థమైన భేదమేమీ లేదనే సర్వదా నా అభిప్రాయం. ఇటీవలనే పాశ్చాత్యుల శాస్త్రవిజ్ఞాన, హేతువాద, మానవతావాదాలకు ప్రాచ్య ఆధ్యాత్మిక వాదానికి మధ్య అఘాతమేర్పడింది. ఆధునిక పాశ్చాత్య నాగరకతకు హేతుతత్వం, విజ్ఞానం, మానవ హక్కులనేవి కీలకమైనాయి."

ఈ విధంగా ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతులకు మధ్య విభేదం మధ్యయుగంలో లేదనీ ఇటీవలే ఏర్పడిందనీ రాధాకృష్ణ పండితుడే అంగీకరిస్తున్నాడు. "మధ్యయుగంలో పాశ్చాత్యులు సైతం అవాఙ్మానస గోచరమైన సత్యాన్ని గుర్తించారు" అంటాడు. కాబట్టి ప్రాచ్య, పాశ్చాత్యదేశాల మధ్య తారతమ్యానికి కారణం స్పష్టమవుతున్నది. ఆధ్యాత్మికత మధ్యయుగంలో ప్రాచ్య, పాశ్చాత్య దేశాలకు సమాన లక్షణం. దానిని తిరస్కరించి పాశ్చాత్యులు హేతుతత్వాన్ని, శాస్త్రవిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. అభివృద్ధిని సాధించారు. ఇట్టి పరిస్థితుల్లో ఆధునిక యుగలక్షణాలను తెగడి, మధ్యయుగ లక్షణమైన ఆధ్యాత్మికతయే ఉత్తమమైనదని పట్టుకు ప్రాకులాడడం ఎంతవరకు సమంజసం? నేటి భారతీయ మనస్తత్వం సమాజాభివృద్ధి, వికాసాలకు వ్యతిరేకం. ఈ మనస్తత్వాన్ని రాధాకృష్ణ పండితుడే హెచ్చరించాడు. "భారతీయ సమాజాన్ని పట్టి పీడించే మూలదోషాలన్నింటికి కారణాలు రెండు. 1. బాధ్యతారహితమైన అర్థసంపద 2. మతమౌఢ్యం. ఆర్థిక అన్యాయాలు మనదేశం వరకే పరిమితాలు కావు. ప్రపంచం అన్ని ప్రాంతాల్లోనూ ఉన్నాయి. కాని మనదేశంలో మతమౌఢ్యం మాత్రం ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. మూఢనమ్మకాల ముసుగులో 'సత్యం' పూర్తిగా కప్పుబడి పోయింది. కొన్నిభావాలు పాతబడిపోవడం చరిత్రలో సర్వసాధారణం. అట్టి భావాలను కృత్రిమంగా విపరీతార్థాలు కల్పించి పరిరక్షించుకుంటున్నాం. ఇది న్యాయం కాదు. "మోసం నుండి, భూతకాల తమస్సుల నుండి మన జాతికి మోక్షం ప్రసాదించడమే మన తక్షణ కర్తవ్యం." ఇటువంటి హెచ్చరికయే ఆచార్య పుంతంబేకర్ కూడా చేశాడు. నేటికీ హిందువుల్లో సనాతనులు సాంఘిక నియమావళికి మనుధర్మశాస్త్రమే ప్రామాణికంగా అంతిమ తీర్మానంగా ఉటంకిస్తూంటారు. పుంతంబేకర్ మాటల్లో మను ధర్మశాస్త్రం "భూస్వామ్య యుగానికి మాత్రమే తగినది, విజేతలు పరాజితులకోసం తయారుచేసిన న్యాయశాస్త్రం, కొన్ని వర్గాల ప్రత్యేక హక్కులు, అసమానసూత్రం అనేవి మనుధర్మశాస్త్రం సూచించిన న్యాయానికి సాంఘిక వ్యవస్థకు పునాదులు. మనువు సూచించిన ఏ సంస్థకూడా ఆధునిక యుగ స్వభావానికి తత్వానికి సరిపడేవి కాదు." కాబట్టి భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికం అంటూ విర్రవీగడం మన నాగరకత ఇంకా మధ్యయుగ భూస్వామ్య దశనుండి బయటపడలేదని అంగీకరించడమే! రాధాకృష్ణ పండితుడు చెప్పినట్లు భూతకాల తమస్సుల దౌష్ట్యానికి జోహారులు అర్పించడమే!

"మనదేశంలో విపరీతంగా విన్పిస్తున్న ఆధ్యాత్మిక వాదానికి ప్రయోజనం ఐహిక సుఖాల కోసం మనం పడే ఆరాటాన్ని తాపత్రయాన్ని కప్పిపుచ్చడమే!" అంటూ ఇటీవల సి.డి. ఖోస్లా పండితుడు వ్రాశాడు. "ఉన్నత నాగరకతా శిఖరాల నుండి మనం ఏనాడో పతనమైనాం. ఇంకా ఆ శిఖరాలనే అధిరోహించి ఉన్నామని ఇతరులను మోసగించడానికి చేసే ప్రయత్నమే నేటి ఆధ్యాత్మికతను గురించి ఉపన్యాసాలు. వాస్తవానికి మన వ్యాపార వర్గంలో గాని, రాజకీయ నాయకుల ప్రవర్తనలోగాని, ఆధ్యాత్మికత అణుమాత్రం కూడా గోచరించదు కదా! అయినప్పుడు నేటి మన ఆధ్యాత్మిక వాదం కేవలం పెద్ద మోసం."

## భిన్నత్వంలో ఏకత్వం:

భారతీయ సంస్కృతి ఒక మహాసంగమ క్షేత్రమనీ ఏ నూతన సాంస్కృతిక ప్రభావాన్నైనా జీర్ణించుకొని పెంపొందే శక్తి భారతీయతలోని ప్రత్యేకత అని పండితులు వాదిస్తుంటారు. కాని కొందరు భారతీయ సంస్కృతి మరియే యితర సంస్కృతికీ రుణపడలేదని వాదించడం కూడ కద్దు. వీరికి నమస్కారాలు! భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతికి లక్షణమనేది నిజమే. 'ఆర్య, అర్యేతర సంస్కృతులు, పారశీక, అరబ్బీ నాగరకతా ప్రభావాలను కలసి రూపొందిందే నేటి భారతీయ సంస్కృతి. అయినా విదేశ నాగరకతా ప్రభావాలను స్వీకరించడం భారతీయ సంస్కృతికి మాత్రమే పరిమితమైన లక్షణం కాదు. క్రైస్తవ, ఇస్లాం, సంస్కృతులు సైతం వివిధ ప్రభావాల ఫలితంగా ఏర్పడినవే. హీబ్రూ నైతిక ప్రబోధాలు, ప్రాచీన గ్రీకు మతాచారాలు, బౌద్ధ సంఘ నిర్మాణ సంప్రదాయాలు కలసి రూపొందింది క్రైస్తవం. అదేవిధంగా హీబ్రూ, క్రైస్తవ, జొరాస్ట్రియన్, బౌద్ధమత ప్రభావాల సమ్మేళనమే ఇస్లాం. నేటి ఆంగ్లేయ సంస్కృతి ఆంగ్లికన్, శాగ్జన్, డ్రూయిడ్, రోమన్, నార్మన్ జాతుల సంస్కృతీ సమ్మేళనమే! అమెరికాలో కన్పించేది సర్వజాతి సమ్మిళితమైన సామాజిక విధానమే గదా! కాబట్టి ఏ

సంస్కృతిలోనైనా నేడు కన్పించేది సాంకర్యమే. అదే మన విశిష్టతనుకోవడం పొరపాటు.

### సహన శీలం:

భారతీయుల సహన శీలాన్ని శాంతి ప్రియత్వాన్ని గురించి విశేషమైన పొగడ్తలు వింటూ ఉంటాం. వాస్తవానికి ఈ ప్రచారం కూడా పాశ్చాత్య విద్వాంసులు ప్రారంభించిందే అయితే, మత సహనంమీదనే భారతీయ సంస్కృతి యొక్క పునాదులు ఉన్నాయా? హిందూమతానికి ఋగ్వేదం మూలం కదా! వైదిక నాగరకతా నిర్మాతలు సహన శీలురు, శాంతి కాముకులు అని చెప్పడం చరిత్రకు విరుద్ధం. వారి యుద్ధ ప్రియత్వం అసమానం. జగద్విత౦. వారి ప్రధాన దైవం ఇంద్రుడు. యుద్ధానికి అధిదేవుడు. మధ్యయుగం నాటి చెంగిజ్‌ఖాన్, తైమూరులతో పోల్చ దగినవాడు. అతని అభిమాన బిరుదము 'పురందర'. ఇంద్రుని ఆరాధింపని దాసదస్యులను సర్వనాశన చేయవలసినదిగా ఆర్య మహర్షులు ఆయన్ని ప్రార్థించేవారు. ఆర్యేతర దేవతలను ఆరాధించేవారినే అవ్రతులనీ, అపవ్రతులనీ నీచంగా చూసేవారు. ఈ వర్ణనవల్ల తమదే ఉత్తమ మతమనే అహంకారం ఆర్యులలో ఉన్నట్లు స్పష్టమే గదా! ఈ అపవ్రతులు ఇంద్రుని వజ్రాయుధానికి బలికాదగిన వారట! ఆర్యేతర పూజా మందిరాలను నేలమట్టం చేసి వారి దేవతా విగ్రహాలను భగ్నం చేసిన మహనీయుడే పురందరుడు! ఆ విధంగా కూలిపోయిన పూజాగృహాల ఇటుకలతో ఆర్యులు యజ్ఞవేదికలు నిర్మించుకొన్నారు. బ్రాహ్మణాలలో అర్మ, అర్మక్ అనే పదాలు తరచు కన్పిస్తూ ఉంటాయి. వీనికి 'వినష్ట గ్రామం' అని అర్థం. వీరిని నష్టపరచడం వలననే పురందర బిరుదం వచ్చింది. కాబట్టి ఋజుదృష్టితో ఆలోచిస్తే విగ్రహధ్వంసన కార్యక్రమంలో తమ తరువాత హిందూ దేశంపై దండెత్తిన తురుష్కుల కేమాత్రం తీసిపోని వారు ఆర్యులు.

తరువాతి యుగంలో హిందూ బౌద్ధమతాల మధ్య సంబంధాలు కేవలం శాంతియుతమేననడం సైతం అనుమానించదగిన విషయమే! మచ్చుకు ఒకటి, రెండు సంగతులను పరిశీలిద్దాం. బుద్ధుడు అనే మాటకు బుద్ధిహీనుడు అనే అర్థంలో వాడుతున్నాము కదా! ఇది బుద్ధుని మీద, బౌద్ధధర్మం పట్ల సహనానికి నిదర్శనమేనా! హిందూ పండితులు హిందూ మత శాఖగానే బౌద్ధం అవతరించిందని వాదిస్తారు. అదే నిజమై హిందువులు యదార్థంగా సహనశీలురే అయితే శైవశాక్తేయాలు ద్వైతాద్వైతాలవలె బౌద్ధం సహితం దేశంలో సజీవంగా ఉండవలసింది. మరి బౌద్ధం భారతభూమి నుండి అంతర్ధానం కావడానికి కారణం? ప్రాణాపాయం వచ్చినా జైన బౌద్ధమందిరాల్లో తలదాచుకో కూడదని హిందువులకు హెచ్చరిక. "అన్యమతాలను గౌరవించడం స్వమతాన్ని ఉదాత్తం చేసికొనడమే" అని అశోకచక్రవర్తి మత సహనావశ్యకతను ప్రబోధించినాడు. సహనశీలురైన ప్రజలకు ఈ ఉద్బోధావశ్యకత యేమి?

తులనాత్మక దృష్టితో పరిశీలిస్తే హిందువుల్లో ఉన్నంత మాత్రం సహనశీలం ఇతర మతాల్లోకూడ ముఖ్యంగా హిందువులు హింసాత్మకమని భావించే ఇస్లాంలో కూడ లేకపోలేదు. బాగ్దాద్‌లో ఖలీఫాలు భారతీయ విద్వాంసులను ఆహ్వానించి గౌరవించారు. అలెగ్జాండ్రియా, డమాస్కస్, బాగ్దాదులోని మొహమ్మదీయ సంస్థానాలలోనే ప్రాచీన పాశ్చాత్య సారస్వతానికి రక్షణ లభించింది. మొహమ్మదీయుల ఆదరణే లభించక పోయినట్లయితే గ్రీకు విజ్ఞానం యావత్తు క్రైస్తవ పూజారుల హింసాకాండకు బలియై పరశురామప్రీతి అయివుండేది. హిందూ దేవాలయాలను కూలద్రోసి హిందూ మతవిరోధిగా చరిత్రలో చిత్రింపబడిన గజినీ మహ్మద్ అసలు కథ మరోవిధంగా తెలుస్తుంది. హైందవ సంస్కృతి పట్ల మహ్మద్‌కు చాల అభిమానం. హిందూ విద్వాంసులను తన ఆస్థానానికి ఆహ్వానించి గౌరవించాడు. తన నాణేలమీద తన పేరును సంస్కృత భాషలో నాగరిలిపిలో ముద్రించుకున్నాడు. తన ఆస్థాన విద్వాంసుడైన ఆల్బెరూనీని ప్రోత్సాహించి భారతదేశాన్ని గురించి గ్రంథం వ్రాయించినాడు. అల్బెరూని సంస్కృతం అభ్యసించి ప్రాచీన భారతీయ సంస్కృతికి జోహారు లర్పించడమే గాక తన కాలంలో భారతీయులున్న దుస్థితికి సానుభూతి చూపాడు! ఇక హిందూ ఆలయాలను ధ్వంసం చేయడమన్నది నాటిరాజకీయ సైనిక ఎత్తుగడలలోని భాగం. ఆలయాలు వివిధ ధనరాశులతో మూలుగుతూ ఉండేవి. ధనం అవసరమైనప్పుడు వంద గ్రామాలు దోచేబదులు ఒక ఆలయం దోస్తే ఫలం దక్కేది. హిందూ దేవాలయాలను ముస్లిములు మాత్రమే దోచుకోలేదు. హిందువులు సైతం దోచినారనడానికి శాసనాధారాలు

ఉన్నాయి. అదీకాక ఆలయాలు కోటలుగా ఉపయోగపడేవి, వానిని ధ్వంసం చేస్తేకాని సైనికంగా దేశ అక్రమణ పూర్తయ్యేదికాదు. మరొక విశేషం: మధ్యయుగంలో భారతదేశ సామాజిక జీవనం ఆలయంచుట్టూ అల్లుకొని వుండేవి. ఆలయాన్ని నేలమట్టం చేసినప్పుడు సామాజిక జీవనం విచ్ఛిన్నమై దేశాన్ని జయించడం సులభమవుతుంది. ఇన్ని కారణాలవల్ల హిందూ ఆలయాలపై ముస్లింలు తమ దృష్టిని కేంద్రీకరించినారు. కాబట్టి, దాసదస్యమ్లేచ్ఛ పదాలతో నిండిన మన సారస్వతం, విదేశ పర్యటనను నిషేధించింది. సంఘబహిష్కార ప్రాయశ్చిత్తాది కర్మకాండలతో నిండిన మన ధర్మశాస్త్రం, అంటరాని తనంపై ఏర్పడిన మన సమాజ వ్యవస్థ, సహనశీలానికి నిదర్శనం కాదు. అందుకు మరో నిదర్శనం, సత్యాహింసలను సహనాన్ని ప్రబోధిస్తూ రాజకీయాలను నీతివంతం చేయడానికి కృషిచేస్తున్న గాంధీజీ హత్య కూడా.

## శాంతి ప్రియత్వం:

భారతీయుల శాంతిప్రియత్వాన్ని గోరంతలు కొండంతలు చేస్తూ వుంటారు. ఈ ప్రచారం కూడా సత్యదూరమే! భారతీయ చక్రవర్తుల బిరుదాలు వారి యుద్ధోన్మాదానికి నిదర్శనాలు! విక్రమాదిత్య, భండనాదిత్య, వరగండభైరవ, అనేవి ఆ బిరుదాలు. మన చరిత్రలో ప్రాధాన్యం ఇస్తున్నది చంద్రగుప్త, సముద్రగుప్త, రాణాప్రతాప్, శివాజీల వంటివారికేగదా! వారుచేసిన యుద్ధాలేగదా వారి ఘనతకు కారణం? "అసంతుష్టా ద్విజానష్టా సంతుష్టా ఇవ పార్థివా'' అని గదా మన రాజనీతి. అంటే రాజులు వున్నదానితో తృప్తిపడక సర్వధా విజిగీషులై వుండాలి. ఇక యుద్ధాన్ని త్యజించి సామ్రాజ్య పాలనకు తన కీర్తికి గీటురాయిగా అహింసా ధర్మాన్ని చేపట్టిన అశోక చక్రవర్తికి శాంతి కాముకులైన హిందువు లిచ్చిన గౌరవం ఏమో ఆలోచించండి? బుద్ధుని నామధేయానికి వలె అశోకుని అభిమాన బిరుదమైన 'దేవానాంప్రియ' అనే పదానికి 'బుద్ధిహీనుడ'నే అర్థం కల్పించారు. ఇదేనా హిందువుల శాంతిప్రియత్వం?

భారతీయ చక్రవర్తులు విదేశాలపై దండెత్తి జయించి ఆక్రమించలేదనడం యథార్థమే. కానీ అందుకు కారణం వారి శాంతిప్రియత్వం కానేకాదు. హిందూదేశ భౌగోళిక పరిస్థితులే కారణం. దేశం సువిశాలమై మన చక్రవర్తుల యుద్ధప్రియత్వానికి సామ్రాజ్య విస్తరణకాంక్షకు తగినంత అవకాశం కల్పించింది. అసేతుశీతనగ పర్యంత సామ్రాజ్యమే మన చక్రవర్తుల ప్రథమాశయం. 'ఇంటగెలిచి రచ్చగెలువమన్నారు గదా!' దేశాన్నే పూర్తిగా జయించ లేనప్పుడు విదేశాలపై దండెత్తే ప్రసక్తి ఎక్కడిది? కాబట్టి విదేశాల నాక్రమించనంత మాత్రంచేత మన రాజులు శాంతికాముకులనడం చారిత్రక పరిజ్ఞానం లేకపోవడమే. ముస్లిం చరిత్రను పరిశీలించే సందర్భంలో వారి కుటుంబ కలహాలను పరిహసించడం హిందువులకు పరిపాటి. ఇది కేవలం వెర్రితనం, హిందూ రాజవంశాల చరిత్రలో ఇట్టి కలహాలు కోకొల్లలు. అజాతశత్రువు తన తండ్రిని చంపి సింహాసనం ఆక్రమించాడు. అశోకుడు తన సోదరులను వధించాడు. హైందవ చరిత్రలో సువర్ణయుగాన్ని సృష్టించిందని భ్రమిస్తున్న గుప్తవంశంలో అడుగడుగునా సోదర కలహాలున్నాయి. చాళుక్యచరిత్ర సమస్తం సోదరపోరాటమే. శ్రీ కృష్ణదేవరాయులు తిమ్మరుసుల గురించి ప్రచారంలో వున్న కథలో చారిత్రక సత్యం లేకపోలేదు. ఇంతెందుకు, హిందువులకు పరమపవిత్ర ఇతిహాసాలైన మహాభారత, రామాయణాలలోని ఇతివృత్తాలు కుటుంబకలహాలు జ్ఞాతి వైరాలేకదా! బహుశా ఆ ఇతిహాసాలే మన రాజవంశాలకు ఆదర్శాలై వుంటాయి. కాబట్టి, రాజకీయాలు రక్తసంబంధాన్ని గుర్తించవు' అన్న ఆంగ్లసామెత ముస్లిములకు, ఆంగ్లేయులకు మాత్రమే కాక భారతీయులకు సహితం వర్తిస్తుంది.

## సనాతన ప్రియత్వం:

మరొక అంశాన్ని మాత్రం పరిశీలిద్దాం. సనాతన ప్రియత్వం భారతీయ సంస్కృతికి మరొక విశిష్ట లక్షణంగా భావిస్తుంటారు. అనాదిగా వచ్చే సంప్రదాయాల పట్ల సంస్థల పట్ల భారతీయులకు అభిమానమున్నది యధార్థమే. "మా నాగరికత సింధునాగరకత అంతటి ప్రాచీనం" అని సగర్వంగా చెప్పుకొనడం అందరికి తెలిసిందే. ఈ లక్షణం ఎంతవరకు సుగుణమో, ఎంతవరకు సమర్ధనీయమో అనుమానాస్పదం. నేటికీ హిందువులు చెట్లను, పుట్లను, జంతువులను, వినాయకుని వంటి నరమృగాలను పూజిస్తారు. ఇవి ఆదిమ

లేక ఆటవిక జీవిత దశకు చిహ్నాలు జీవపరిణామ క్రమంలో కిరీట ప్రాయమైన మానవుడు జంతువులకు సాష్టాంగపడటం ఎంత వరకు సమంజసం అన్న ప్రశ్నకు ఎవరికి వారే సమాధానం చెప్పుకోవాలి.

అనేక అనర్థాలకు మూలమైన వర్ణవ్యవస్థను నేటికీ పరమ పవిత్రంగా కొందరు హిందువులు భావిస్తారు. ఆ వ్యవస్థకు దివ్యత్వం ఆపాదించి సమర్థించే భగవద్గీత ఈ నాటికీ పరమ పవిత్ర గ్రంథం! ఇవన్నీ హిందువుల సనాతన ప్రియత్వానికి సామాజిక ప్రగతిపట్ల విముఖత్వానికి నిదర్శనాలు. వాస్తవానికి సనాతన ప్రియత్వం మానవ పురోగతికి ఆటంకమైన మానసిక రోగాల్లో ఒకటి. కాని ఈ లక్షణం సయితం ఒక జాతికిగాని, ఒక మతానికి గాని ప్రత్యేకంగా సొంతమైన లక్షణం కాదు. అది మానవ లక్షణం. ఈ గుణాన్ని కవచంగా రక్షణగా పెంపొందించు కుంటూ ఉంటాడు. ప్రాచీన సంప్రదాయాలనుండి, సంస్థల నుండి విముక్తి పొంది నూతన సంప్రదాయాలను నిర్మించుకొనడం చాల శ్రమతో గూడిన పని. కొత్త సంస్థల నిర్మాణం ఒక ఎత్తు. వానికనుగుణంగా జీవితాన్ని తీర్చిదిద్దుకొనడం మరొక ఎత్తు. అందుచేత పాతను వదిలించుకోవడం కష్టమైన బాధ్యత. ఈ బాధ్యతా భారం వహించడానికి బదులు పాత సంస్థలకు మనం దివ్యత్వాన్ని ఆపాదించి తృప్తి పడుతుంటాం. మానవునిలోని ఈ సనాతన ప్రియత్వమే చరిత్రలో హింసాయుత విప్లవాలకు ఒక ప్రధానకారణం. మనదేశంలో కూడా మార్పులు రాకపోలేదు. కాని అవి విప్లవాల వల్ల వచ్చినవి కావు. విదేశపు దాడులవల్ల వచ్చినవి. మన సంస్కృతి చరిత్రలో అభ్యుదయ యుగాలన్నీ విదేశ దండయాత్రల తరువాతవే. ఆర్య దండయాత్ర తరువాత బౌద్ధయుగం, శక యవన కుషాణ దండయాత్రల తరువాత గుప్తయుగం, ముస్లిం దండయాత్రల తరవాత కబీర్–రామానంద, రామదాసుల యుగం, ఆంగ్ల రాజ్యస్థాపన తరవాత రాజారామమోహన రాయ్‌తో ప్రారంభమైన భారత పునరుజ్జీవనోద్యమం. ఈ ఉద్యమాలు సైతం ద్విముఖంగా సాగినాయి. ఒకటి సనాతన సంప్రదాయాన్ని రక్షింపగోరేది, రెండోది సంస్కరణను ఆహ్వానించేది. ఇతర దేశాల్లో నేటికీ కన్పించే అనేక రాజకీయ సాంఘిక సమస్యలకు సనాతన ప్రియత్వమే కారణము.

ఈ పరిశీలనవల్ల భారతీయ సంస్కృతి కేవలం మానవ సహజ గుణాలు నిర్మించినట్టిదేనని తేలిన సారాంశం. ఈ గుణాలు భారతీయుల కెంత నిసర్గమో ఇతర జాతులకంతే సహజం. చాలాగుణాలు ప్రకృతి చేత నియమితాలు కావు. వీనిలో మార్పు, పరిణామాలు కూడా సహజమే. మానవుని ప్రవర్తన చాలావరకు సంప్రదాయన్ని బట్టే ఉంటుంది. కాని సంప్రదాయాలను నిర్మించినది మానవుడే. వాని పునః నిర్మాణం కూడా మానవుని చేతిలోనిదే. ఎంత సంప్రదాయ ప్రియుడైనా మానవుడు పరిస్థితుల కనుగుణంగా మారడానికి ప్రయత్నిస్తాడు, సాధ్యమైనంతవరకు పరిస్థితులను తనకనుకూలంగా మలచుకుంటాడు. ఈ రెండు కార్యక్రమాల కథనమే చరిత్ర. జీవితంలో విజయానికి, మానవజాతి పురోగతికి ఈ కార్యక్రమాలే కీలకం. అందుచేత "ఒక సంస్థగానీ, ఒక విలువగానీ, ఒక జాతి ఉపజ్ఞకు మాత్రమే సరిపడుతుంది. మరొకజాతికి సరిపడదు" అనడం యుక్తం కాదు. తన ప్రయోజనార్థమే మానవుడు సంస్థలు నిర్మించుకుంటాడు. ఆ ప్రయోజనం నెరవేరడంతో ఆ సంస్థను వదలి వేరొకదాన్ని నిర్మించుకోగలడు. ఇట్టి మానవ సృజనా సామర్థ్యము ఏ ఒక్క జాతికి పరిమితం కాదు. సమస్త మానవజాతి ఉమ్మడి వారసత్వం. మానవజాతి అభ్యున్నతికి అచంచలమైన విశ్వాసం అవసరం.

గ్రాహం క్లార్క్ అనే పురాతత్త్వవేత్త చెప్పినట్లు "మానవజాతి ఉమ్మడి చరిత్రను అధ్యయనం చేయడమే మన తక్షణ కర్తవ్యం. నేడు మానవజాతి సమైక్యం అవుతుంది. కాని అది కేవలం ఆధునిక ప్రయాణ సౌకర్యాల వల్ల కానీ, పారిశ్రామిక నాగరికతలోని భౌతిక తత్త్వాల వల్లగానీ సాధించే సమైక్యత కాదు. మానవజాతి ఉమ్మడి వారసత్వాన్ని గ్రహించడం ద్వారా సాధింపగల ఐకమత్యం."

ఈ సందేశంలోని సత్యాన్ని గుర్తించి ప్రతివ్యక్తీ ప్రతిసంస్థ మానవజాతి ఉమ్మడి వారసత్వాన్ని గుర్తించేటట్లు చేసి, ఈ వారసత్వానికి మెరుగులు దిద్దడం అవసరం. మానవజాతిలోని భిన్నత్వంపై గాక, ఏకత్వంపైనే తమ దృష్టిని, కృషిని కేంద్రీకరించాలి. మానవత్వానికి గుర్తింపు కలిగినపుడే వసుధైక కుటుంబం సాధ్యం. ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది.



# సైగల్‌గానం

## చరిత్రలో 'రికార్డ'యిన అద్భుత అధ్యాయం

- ఆలపాటి రవీంద్రనాథ్

**మొ**యిలిని చూసి నెమలి ఆడితే, సైగల్‌పాట మనుషుల మనసుల్ని తాకి ఆడుకొంటుంది. ఈ రెండింటికి సామ్యము ప్రత్యక్షంగా అల్పమైనా, పరోక్షంగా బహుళం.

నాదం నుంచే సృష్టి జరిగిందనే వాదం నిజమే అయితే పంచ భూతాలలో నాద మూలకమైన ఆకాశం సర్వత్రా వ్యాపన శీలమైనది. తద్గుణమగు నాదం కూడా సర్వత్రా వ్యాపించినదే 'The music of spheres' అన్న పాశ్చాత్యుల భావన కూడా దీని అనుసరణ జనితమేననవచ్చు. నాదం (గానం, సంగీతం) ప్రతి జీవిలోనూ ఏదో ఒక రూపంలో కనబడకపోదు. ఈ సంగీతం కొందరికి సాధనతో సాధ్యమైతే, మరికొందరికి జన్మతః వచ్చినది. అలాంటి వరప్రసాదే మన కుందన్‌లాల్ సైగల్.

1904 ఏప్రిల్ 4న జలంధర్‌లో జన్మించిన కె.యల్. సైగల్, రైల్వేశాఖలో పనివారి మీద అజమాయిషీ చేసే గుమాస్తాగా తన జీవితాన్ని ప్రారంభించాడు. ఏ గురువు వద్దా సంగీతం నేర్చుకోని సైగల్‌కు పాటలు పాడటం ప్రవృత్తి. ఆ పాట అతని జీవితంలో ఒక భాగమైందనడం కంటె పాటే అతని జీవితమైంది అనడం సబబు. అతని గానాన్ని అతని చుట్టుపక్కల వారంతా విని ఆనందించేవారు. రైల్వేశాఖలో ఉద్యోగం మానివేసి సైగల్ కొంతకాలం 'టైప్ రైటర్స్' అమ్ముతూ జీవించాడు. ఆ జీవనంలో కూడా అతని పాటే అతని బాట, ఎక్కువగా ప్రయాణంపై మక్కువలేని సైగల్ ఆ ఉద్యోగం కూడా వదులుకొని, కలకత్తాలోని 'న్యూ థియేటర్స్'లో గుమస్తాగా చేరాడు. ఆ సంస్థలో పనిచేసుకుంటూ యథాప్రకారం కూనిరాగాలు తీస్తున్న సైగల్ గాత్రం విని, ఆ సంస్థ నిర్మిస్తున్న 'శుభ్ కా సితారా' చిత్రంలో గాయకునిగా పరిచయం చేశారు. ఈ సంఘటన 1932లో జరిగింది. అదుగో, అప్పుడే ఓ అద్భుతగాయకుడు మన భారతావనికి అవతరించాడు. లోకం సంతోషించింది. నిజానికి సైగల్ పాడడు. అతడు పలికేమాటలే పాటగా రూపు దిద్దుకుంటాయి. అంతటి మధుర కంఠం సైగల్‌ది. తుమ్మెదల ఝుంకారాన్ని యథాతథంగా పలికించిన సైగల్ గళం అద్భుతమైనది. అమరమైనది. ఆరోహణ, అవరోహణలు పుట్టుకతోనే అబ్బిన సైగల్ సాధారణంగా అష్టమస్వరాన్ని (ఆలాపన) ఎప్పుడో ఒకసారి ఉచ్ఛస్థాయిలో ఆలపించేవాడు. అందుకే కాబోలు 'గానకోకిల' లతామంగేష్కర్ ఒక

ఆలపాటి రవీంద్రనాథ్ : 'మిసిమి' సంస్థాపక సంపాదకులు.

ఇంటర్వ్యూలో ''సైగల్ లాగా అష్టమ స్వరాన్ని ఆలపించాలన్నదే తన జీవితాశయం"గా పేర్కొన్నారు.

ఒక్క లతామంగేష్కర్ కాదు, ముఖేష్, కిశోర్‌కుమార్, తలత్ మహమ్మద్ లాంటి ప్రఖ్యాత గాయకులందరూ సైగల్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన గాత్రాన్ని అనుకరించిన వారే. సైగల్ వర్ధంతి సందర్భంగా 'ఆల్ ఇండియా రేడియో' వారి కార్యక్రమంలో లతా మంగేష్కర్ సైగల్‌పాట ''సోజా రాజకుమారీ!...''ని ఆలపించగా అంతటి మాధుర్యం రాకపోయేసరికి రేడియో స్టేషన్ వారు తెలివిగా సైగల్ గాత్రాన్నే జత చేశారు. అందుకే లత, "చూశారా! ఇంతకీ ఆయనెక్కడా?...ఆయన నన్ను (సైగల్‌ని) అనుకరించవద్దు, నీ సొంత బాణిని నీవు పెంపొందించుకో అన్నార"ని తన అనుభవాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. అందుకే ముఖేష్ తొలిపాట "దిల్ జల్తా హై తో జల్నేదే"లో పల్లవిలో సైగల్‌ని అనుకరించి విఫలుడైనా, చరణాలలో తన గొంతులోని మాధుర్యాన్ని పలికించి విజయం సాధించాడు. ఆ తరువాత ముఖేష్ ఎప్పుడూ సైగల్‌ని అనుకరించలేదు. సైగల్ గొంతును అనుకరించాలంటే అందరూ విఫలమౌతామేమోనని భయపడేవారు. అందుకేనేమో తలత్ మహ్మద్ మాత్రం లభ్యంకాని సైగల్ పాటలోని పంక్తుల నేరుకుని మరీ పాడతాడు. అయినా సైగల్ సైగలే. శ్రావ్యమైన గానం సైగల్ ఆస్తి. గాయకుల్లో అతనో మకుటంలేని మహారాజు. ఆయననెవరూ అనుకరించలేరు. సి.హెచ్. ఆత్మ అనే మంచి గాయకుడు తన జీవిత కాలంలో సైగల్ పోలికలున్నా అనుకరించలేకపోయానని వ్యథనొందాడు. అంతటి శక్తివంతమైన ఇంద్రజాల గాత్రం సైగల్‌ది. ఆ గాత్రంలోని సమ్మోహక శక్తి ఎవరినైనా ఇట్టే ఆకర్షించేది. సైగల్ మాత్రం ఇది 'దేవుడిచ్చిన వరమనే' నమ్మేవాడు. అదే అందరితో చెప్పేవాడు.

ఉస్తాద్ ఫియాజ్‌ఖాన్ మాత్రం, సైగల్‌ని ఒక వీధి పాటగాడిగా మాత్రమే గుర్తిస్తానన్నాడు. అయినా ఆ అపశ్రుతిని సైతం సంతోషంగా స్వీకరించిన సైగల్, నిజమైన శ్రుతి తెలిసినవాడు. అందుకు నిదర్శనం, హెచ్.యం.వి. వారు రికార్డు చేసిన "ఝుల్నా జలావోరీ..." అన్న సైగల్ పాటకంటే శ్రావ్యంగా పాడాలని ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలుడయ్యాడు ఆ ఉస్తాద్ ఫియాజ్‌ఖాన్.

"దుఃఖ్‌కే అబ్ దిన్ బీతాత్ నహీ", "కరుణ్‌క్యా ఆశ్ నిరాశ్ భాయి" అన్న కరుణ రసాత్మకమైన పాటలైనా, "ఏక్ రాజేకా బేటా'' అన్న చిన్న పిల్లల పాట అయినా, ఉల్లాసభరితమైన "హమ్ ఆప్నా ఉన్వే బనా న సకా" అన్న పాట అయినా ఒక్క సైగల్ గొంతు నుండి జనించడం మూలంగానే అతనికి దగ్గరలో కూడా ఎవ్వరూ రాలేకపోయారు. ఎప్పటికీ మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తాయి. "మధుకర్ శ్యామ్ హమారే ఛోర్", "అంధేకి లాఠీ తూ హి హై", "నైన్ హీన్ కోరాహ్ దిఖా ప్రభూ!", "నిస్ దిన్ బర్సత్ నైన్ హమారే" అన్న పాటలు ఎంతటి కఠిన హృదయులనైనా కరిగించి కన్నీరు పెట్టించక మానవు. ఆయనను గాయకుడిగా చలన చిత్రరంగానికి పరిచయం చేసి బి.యస్. సర్కార్ (న్యూ థియేటర్స్, కలకత్తా)తో కలిసి పాడిన "కొంటె పాటలు" సైతం అందరినీ ఆసక్తిలో ముంచుతాయి. సైగల్‌ను గాయకుడిగా తీర్చి దిద్దడంలో తోడ్పడిన పంకజ్ మల్లిక్‌ని సైతం అనతికాలంలోనే అధిగమించాడు సైగల్. ఒకసారి సైగల్ జలుబు కారణంగా ఒక సినిమాకు పాటలు పాడలేకపోయాడు. ఆ సంస్థవారు పంకజ్ మల్లిక్‌తో పాడించి విడుదల చేయగా ఆ సినిమా 'బాక్సాఫీసు' వద్ద ఘోరపరాజయాన్ని చవిచూసింది. సైగల్ కోలుకున్న తరువాత అవే పాటల్ని సైగల్‌చేత పాడించి, మళ్ళీ విడుదల చేయగా అఖండ విజయం సాధించిందా చిత్రం. అంతటి ఇంద్రజాలం సైగల్ గొంతులో ఉంది. అయినా పంకజ్‌మల్లిక్ గానీ, ఎవరూ గానీ సైగల్‌పై అసూయ, ద్వేషం పెంచుకోలేదు సరికదా అందరూ ఆయనను, ఆయన గానాన్ని అభిమా నించేవారు.

సైగల్ గానం ఎంతటి ఉన్నతమైందో, అతని శీలం, వ్యక్తిత్వం కూడా అతని కీర్తి శిఖరానికి సమానస్థాయిలో ఉండటం విశేషం. ''ఉదార చరితానాం తు వసుధైక కుటుంబకమ్" అన్నట్లు సైగల్‌కు రాజూ-పేదా తేడాలు ఉండేవి కావు. ఒకసారి సైగల్ తన మిత్రుడైన ఓ ధనవంతుడి పార్టీలో ఉండగా ఆ మిత్రుడు సైగల్‌ని పాట పాడమని కోరాడట. అందుకు సైగల్, "నీకు నా పాట వినాలనిపిస్తే మా ఇంటికి వచ్చి ఫీజు చెల్లించి నా అపాయింట్‌మెంట్ తీసుకో, అప్పుడు వీలైతే నేను పాడగలను" అన్నాడట. కానీ అదే సైగల్, మరోసారి ఓ పేదవాడు అతని తలుపుతట్టి, "మీ పాట కచేరి టిక్కెట్టు కొని మీ పాట ప్రత్యక్షంగా వినే

స్తోమత నాకు లేదు. అయినా మీ పాట ప్రత్యక్షంగా వినాలన్నది నా జీవితాశయం" అంటూ భయంతో, వణుకుతూ అడగ్గా సైగల్ అతణ్ణి సాదరంగా ఆహ్వానించి, అతిథి మర్యాదలు చేసి కేవలం అతని కోసం మూడు గంటలపాటు ఏకధాటిగా పాడారు. సైగల్ మాటల్లో చెప్పాలంటే ఎవరూ ధనవంతుడు కానీ, ఎవరూ పేదవాడు కానీ లేదంటాడు సైగల్. 'అందరమూ విధి చేత చిక్కినవారమే' అన్నది అతని నమ్మకం. శక్తివంతమైన వ్యక్తిత్వం కలిగిన సైగల్ శీలవంతుడిగానూ ఉన్నతుడే. ఆయన కుమార్తె శ్రీమతి నీనా మర్చంట్ 4 డిశంబర్, 1993న ఒక లేఖలో "కొంతమంది మా నాన్నగారి జీవితాన్నో ప్రణయగాథగా చిత్రించాలని చూశారు. కానీ మా నాన్న ఎప్పుడూ ఎవరితోనూ ఎలాంటి ప్రణయ సంబంధం ఏర్పరచుకోలేదు. ఒక్క మా అమ్మతో తప్ప. మా అమ్మ చాలా అందంగా ఉండేది. మా నాన్నకు మా అమ్మ అంటే ప్రాణం. నేను పుట్టిన రోజున మా నాన్న విపరీతమైన జలుబుతో బాధపడుతూ కొంచెం 'బ్రాందీ' సేవించారు. తరువాత అది ఆయన అలవాటుగా మారింది. కుటుంబ స్నేహితులైతే తప్ప ఏ స్త్రీలూ కథానాయికలు గానీ, మహిళాభిమానులు గానీ ఎవరూ మా ఇంటికి వచ్చేవారు కాదు. మా నాన్న శీలవంతుడు" అని చెప్పుకుంది.



సైగల్ పేరుతో నాటి గ్రామ్‌ఫోన్ రికార్డు

తన గాత్రంతో స్వరాల మాయాజాలం చూపే సైగల్ జనన, మరణ కాలాల విషయంలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. "గ్రామ ఫోన్ కంపెనీ ఆఫ్ ఇండియా"కు చెందిన శ్రీమతి రోనితా మిత్రా చెప్పిన దాని ప్రకారం రికార్డుల మీద 1904–1946 అని ఉన్నది కానీ, సైగల్ కుమార్తె శ్రీమతి నీనా మర్చంట్ మాత్రం ఆయన జీవిత కాలాన్ని 1905–1947గా చెబుతున్నారు.

హిందీ, ఉర్దూ, పంజాబీ, పర్షియన్, తమిళ, బెంగాలీ భాషల్లో తన గాత్రాన్ని వినిపించి ఎన్నో హృదయాలను ఆనంద డోలల్లో ఊగించిన సైగల్ మొత్తం ఎన్ని పాటలు పాడాడన్న ఖచ్చితమైన సంఖ్య తెలియడం లేదు. యం.వి. కామత్ అనే ఆయన ప్రకారం సైగల్ అన్ని పాటలు భారతదేశంలో ఇద్దరి వద్ద మాత్రమే ఉన్నవి. వారిలో ఒకరు ప్రఖ్యాత హిందీ నటుడు అశోక్‌కుమార్, మరొకరు విఖ్యాత క్రికెటర్ బి.యస్. చంద్రశేఖర్. చంద్రశేఖర్ మాత్రం సైగల్ పాటలు వినడానికి మాత్రమే ప్రత్యేకంగా ఒక టేప్‌రికార్డర్‌ని ఉపయోగిస్తారట. ఆయన ఆ టేప్ రికార్డర్‌ని, సైగల్ పాటల కేసెట్స్‌ని పవిత్రంగా భావిస్తారట. ఐ.యన్.ఆర్.ఇ.సి.వో (INRECO) వారు 1970లో స్టీరియో ఫోనిక్ విధానంలో 'కె.యల్.సైగల్ పాటల ఆల్బమ్'ని విడుదల చేశారు. కానీ 'స్టీరియో సూపర్ ఇంపోజిషన్' మూలంగా ఆ ఆల్బమ్‌లోని సైగల్ గాత్రం సరిగా వినిపించక, అభిమానులకు బాధ కలిగించింది. సైగల్ ఎప్పుడూ తక్కువ వాయిద్యాలతోనే పాడేవాడు కటీజ్ అన్న పాటకు అసలు వాయిద్యాలు తోడులేవు. అసలు సైగల్ కంఠానికి నేపథ్య సంగీతం అనవసరము అనే వారున్నారు. ఎన్నో సైగల్ పాటలను గమనిస్తే ఆయనకు మాత్రమే సాధ్యమైన ఆరోహణ, అవరోహణ క్రమబద్ధతలు స్పష్టం కాగలవు.

1950 నుండి పాకిస్తాన్ రేడియో సైగల్ పాట వినిపించే ముందు "షాహెన్‌షాహి మౌషిఖి మెర్హూమ్ కుందన్‌లాల్

సైగల్" అని ఆయనను గౌరవిస్తూండగా, మన ఆకాశవాణి, దూరదర్శన్‌లు ఆ మహాగాయకుడి పేరు జ్ఞప్తికి తెచ్చుకోక పోవడం విచారకరం. అయితే 'సిలోన్ రేడియో' మాత్రం కె.యల్. సైగల్ అనే పేరునైనా గుర్తుంచుకోవడం విశేషం. ప్రతిదినం ఉదయం గం. 7.55 ని.లకు ఆ ఇంద్రజాల గానాన్ని వినవచ్చు. జనవరి 18 సైగల్ వర్ధంతి, ఏప్రిల్ 4 సైగల్ జయంతి తేదీలలో మాత్రం రోజంతా ఎప్పుడైనా ఆ మధుర స్వరాన్ని వినవచ్చు. 1970లో 'ఆల్ ఇండియా రేడియో' వారు 'వివిధ భారతి'లో రెండు అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో ఒకటి ప్రసిద్ధ సంగీత దర్శకులు, దర్శకులు, నటులు ఆయన పాటలను గుర్తు చేసుకుంటూ ఆయనకు అర్పించిన నివాళి. మరొకటి ఏకధాటిగా గంటసేపు సాగిన సుప్రసిద్ధ సంగీత దర్శకులు నౌషాద్ సంగీత విభావరి. అందులో నౌషాద్ సైగల్ పేరును విస్మరించడం సంగీత అభిమానులకు విస్మయం కలిగించింది. కానీ 'వివిధ భారతి'లో "పత్తర్ బోల్ ఉఠే" పేరున సైగల్ జీవితంలోని కొన్ని సంఘటనల ద్వారా సైగల్ మానవత్వాన్ని గురించి తెలియజేసి సంతోష పరచింది.

ఎదుటివారికి నీతులు చెప్పి, తాము పాటించకుండా ఉండేవారి కోవకు చెందకుండా సైగల్ తన పాటల ద్వారా ఏ సందేశం తెలిపాడో ఆ సందేశానికి కట్టుబడి ఉన్న మహామనీషి, "రెహ్మత్ పే తేరి మేరే కో నాజ్ హై, బందా హూ మై జాన్తాహూ, తూ బందా నవాజ్ హై" అంటూ తనను తాను దేవునికి బందీగా చేసుకున్న ఆస్తికుడు. సైగల్ పాడిన పాటల్లో ఏది గొప్పదో చెప్పాలంటే కష్టం! ప్రయత్నించినా వ్యర్థం! ఆయన ప్రతిపాటా అమూల్యమైన ఆణిముత్యం. "బాబుల్‌మోరా నైహార్ ఛోటా జాయే". "దియా జలావ్", "లగ్ గయి ఛోట్ కరే జ్యామే", "లాభ్ సహిపీకి బాతీయా", "అబ్ క్యా బాతా మై తేరే మిల్నే సే క్యా మిలా", "దునియా మైహూ, దునియా కా తలబ్‌గార్ నహీ", "పీయేజా అవుర్ పీయేజా", ఈ పాటల్లో ఏది గొప్పదో చెప్పలేము. ఆయన కంఠం నుండి జాలువారిన పాటలన్నీ చిరంజీవులే నన్నది మాత్రం నిత్యసత్యం. "పంజాబ్ యూనివర్శిటీ (చండీగడ్) వారు 'సైగల్ బాణీ' మీద ఒక ప్రత్యేకమైన కోర్సు ప్రవేశపెట్టాలన్న ఆలోచనలో ఉండటం ఆనందించదగ్గ విషయమే.

సైగల్ తన మొదటి చిత్ర "శుభ్ కా సితారా" నుండీ తన ఇంద్రజాల కంఠంతో శ్రోతలకు, "దేవదాసు"లో "బాలమ్ అయే బాసో మేరీ మన్ మే" అంటూ పాడుతూ, నటించి ప్రేక్షకులకు తన సమ్మోహక శక్తితో ఆరాధ్యుడైనాడు. ఇప్పటి వరకూ అంతటి సమ్మోహక శక్తి కలిగిన నట, గాయకుడెవరూ, భారతదేశంలో లేరనే చెప్పక తప్పదు. భారతదేశంలో సంగీతం గురించి ఎప్పుడు, ఎక్కడ మాట్లాడినా విన్పించే మహత్తర నామం కె.యల్. సైగల్. 'మనసు' కవి ఆచార్య ఆత్రేయ తొలి సినిమా గీతం 'పోరా బాబూ! పో...' (దీక్ష 1950) సైగల్ గానం ప్రేరణతోనే రచించారట.

1934లోని సైగల్ ''దేవదాసు'' ప్రభావం భారతదేశమంతటా ఉండటంతో, తెలుగులో "దేవదాసు"ను నిర్మించే సమయంలో (దాదాపు 18 ఏళ్ళ అనంతరం, 1952లో) కూడా దర్శక, నిర్మాతలు, సంగీత దర్శకుడు ఎంతో ఆలోచించి చివరకు శరత్ 'దేవదాసు'ను మూలంగా తీసుకుని 'దేవదాసు' పాత్రను మార్చుకున్నారు. అంతేగాకుండా "మోర్టల్ మెన్ ఇమ్మోర్టల్ మెమొరీస్'' (Mortal Men Immortal Memories) కార్యక్రమంలో, "హిందీ చిత్రరంగంలో అద్భుత తారగా, భారతదేశంలో గాత్ర మాయావిగా నిలిచిన సైగల్ ప్రతి పాటా మనల్ని మత్తెక్కించక మానదు'' అన్నది నిజమేననిపిస్తుంది.

సైగల్‌కి ఇష్టమైన పాట "హమే జీకే క్యా కరేంగీ, జబ్ దిల్ హీ టూట్‌గయా" (హృదయం పగిలిపోయాక మనం జీవించి లాభమేమిటి?) అంటూ లోకంతో పనిలే దనుకున్నారేమో లేక 'ముహ్ పార్ లగీ హై, మోహ్రే ఖామోషీ మై క్యా కహూ? జో మౌత్ నే కహా హై వో హస్తి కా రాజ్ హై" (మౌనంతో పెదవులు మూత పడితే నేనేం చెప్పను? మరణం అస్తిత్వం యొక్క రహస్యం చెప్పింది) అని అస్థిత్వ రహస్యాన్ని తెలుసుకున్నాక ఈ లోకంలో ఉండటానికిష్టం లేక జనవరి 18, 1946లో 42 ఏళ్ళ వయసులోనే శాశ్వతంగా మూతబడిన పెదవులు, ఈనాడు మన మధ్య లేకపోయినా ఆ పెదవుల నుండి బయల్పడిన పదాలు మన మనసులను తాకుతూనే ఉంటాయి.

'కుందన్ లాల్ సైగల్ గానం' చరిత్రలో నిలిచిపోయిన మహత్తరమైన అద్భుతం.

# మేల్కొలుపు

**- వల్లభనేని అశ్వినికుమార్**

**ఆ సహ్యాద్రి పర్వత సానువుల్లో ఎప్పుడూ ఏదో జరుగుతూనే ఉంటుంది. కొన్ని రాత్రులు చీకట్ల కురులు విప్పకుంటాయి. ఎన్నో రాత్రిళ్లు వెన్నెల్లు పిండార బోస్తుంటాయి. ఎండలు బండల్ని బద్దలు కొడుతుంటాయి. ఇక వసంతం వింత వింత పూలు పూస్తుంటుంది.**

**ఆకురాలు కాలంలో అకాలవర్షాలు అతలా కుతలం చేస్తుంటాయి. కారు మేఘాలు కొండల మీద కూర్చుని ఘూర్ణిల్లుతుంటాయి. పెను గాలులు ఆ లోయల్లో సుడులు తిరిగి తుఫానులే చెలరేగుతుంటాయి.**

ఆ సహ్యాద్రి పర్వత లోయల్లో ఎప్పుడూ ఏదో జరుగుతుంటుంది. ఒకరోజు ఎడతెరపని వాన, ఒకరాత్రి చీకటి రాజ్యంలో ఈలకోళ్ళ సంగీతం, మరొక మధ్యాహ్నం పెళపెళ కాగే ఎండల మంట. ఆ సహ్యాద్రి కొండల్లోనే ఒక కొనచివర చిన్న ఆశ్రమం లాంటి కుటీరం. మూడు ప్రక్కలా లోయ, ఒక్కదారే మా వూరికి చేరుతుంది.

మా వూళ్ళో అందరూ, తెలివిగలవాళ్ళు. ఒకరు ఆ ఆశ్రమంలో వున్న బాబుగారు భగ్నప్రేమికుడని, మరొకరు అన్నివదిలి వేసిన ఖరీదయిన సన్యాసి అని, మరొకరు ఏ కాంత కోసమో, ఏకాంతంలో ప్రశాంతంగా కవిలాగా బ్రతుకుతున్న పిచ్చివాడని, ఇలా పుకార్లున్నాయి.

కాని నా వరకు నేను ఏమీ నిర్ణయానికి రాలేదు. ఎందుకంటే ఇంత మార్మికంగా బ్రతుకీడ్చే వ్యక్తి, ఈ వూరు వారి పరిధిలోకి రాడని, ఏదోవిధంగా ఆయన్ని కలసి, విషయం ఏమిటో తెలుసుకోవాలనే తపన నాలో రోజురోజుకు పెరిగిపోతుంది. కాని ఆయన గురించి సత్యాన్ని తెలుసుకునే నా ప్రయత్నాలన్నీ వృధాగానే మిగిలిపోయాయి.

మొదటిసారి కలిసినప్పుడు, ఎంతో ఆశతో ఆ చిట్టడవిలో పలకరించాను, కేవలం తల పంకించి కదిలిపోయాడు.

మరొకసారి, ఏదో మఠం ప్రక్కన ద్రాక్ష తోటలో నిలబడి వున్నాడు, అదే అదునుగా "అయ్యా ఈ మఠం నిర్మాణం జరిగి ఏండ్లు పూండ్లు గడిచిందటగా, మీకేమయినా తెలుసా?" అని ఎంతో ఆశగా ఆయన సమాధానం కోసం ఎదురు చూశాను.

"ఇది ఎవరు, ఎప్పుడు నిర్మించారో నాకేమి తెలుసు? నాకంటే పెద్దవారయిన మీ తాతనో నానమ్మనో అడగరాదూ?" అంటూ కదిలిపోయాడు, ఇంతకంటే నిరాశ ఏముంటుంది? నా తప్పుకు చెంపలు వేసుకుంటూ, వెళ్ళిపోయాను. ఇలా రెండేళ్ళు గడిచిపోయాయి.

ఆకురాలే కాలంలో ఒకనాడు, ఆ కొండ కోనల్లో తిరుగుతూ, అకాల వర్షంలో, కారుమేఘాల చీకట్లలో, ఈదురు గాలుల్లో చిక్కుకు పోయాను. దారి తెన్నూ తెలియక నడిసంద్రంలో నావలాగా కొట్టుకు పోతూ, ఆ కొండమీద మినుకు మినుకు మంటున్న వెలుతురు వైపు పడుతూ లేస్తూ చేరాను. ఆ బాబు ఆశ్రమం చేరుతూనే, నాకు ఇదే మంచి అవకాశం, ఈ రహస్యాన్ని తెలుసుకోవటానికి అనుకుంటూ తలుపు తట్టాను. ఇన్నాళ్ళు మర్మయోగిలా ఉండిపోయిన మహానుభావుడు తలుపు తీశాడు.

"అయ్యా మీరు నా అకాలమైన రాకను క్షమించాలి, కాని బయట తుఫాను" అంటూ నసిగాను. అప్పుడు ఆయన చేతుల్లో ఒక పక్షి. బహుశా నాలాగానే తుఫానులో చిక్కి అక్కడ వాలి వుంటుంది, రెక్కలు విరిగి వుంది.

"ఈ చుట్టుప్రక్క చాలా గుహలున్నాయి. ఏగుహలోనైనా

తల దాచుకోవచ్చు..” అంటూ తలుపు మూయకుండానే, ఆ పక్షిని ఎంతో ప్రేమగా నిమురుతూ అటుగా తిరిగాడు.

ఇదే అవకాశంగా నేను లోపలికి చేరి, తలుపు మూశాను. ఈ వింత మనిషి, మనసు ఎంత దయతో నిండిందో అప్పుడు ఆ దృశ్యం చూస్తుంటే ఆశ్యర్యం కలిగింది.

పక్షిని అంత దయగా చూస్తున్న వ్యక్తి, నాపట్ల ఇంత నిర్దయగా ఎట్లా మాట్లాడగలిగాడు? ఏమయినా మొండిగా ఉండి పోదలిచాను. ఆయన

“ఈ తుఫాను ఎంత పవిత్రంగా ఉందో, అది ఇక్కడి కుళ్లనంతా కడిగివేస్తుంది కదా, నీవెందుకు తప్పించుకోవాలనుకుంటున్నావు?” అన్నాడు. నాకు వెన్నులో వణుకు పుట్టింది. అయినా పట్నపు తెలివి తేటలు కదా.

“అయ్యా ఈ తుఫానుకు నాలాంటి పాపిని ఉద్ధరించే ఉద్దేశ్యం వున్నట్లు లేదు, కాని మళ్ళీ దొరికితే మాత్రం వదలదండీ. కొంచెం హాస్య ధోరణితో అన్నాను.

‘‘అంటే, పిచ్చివాడా ఎంతగొప్ప అవకాశం పోగొట్టుకున్నావు, అయినా అంత అదృష్టం నీకు లేదేమో...”

“అవునయ్యా. నేను పిరికి వాడిని, అందుకే తుఫాను భీభత్సంలోంచి పారిపోయాను, ఆ అదృష్టాన్ని అందుకోలేక పోయాను”.

ఇది బహుశా ఆయనకు నువ్వు తెప్పించి ఉండవచ్చు అటుగా తిరిగి నన్ను చలి కాసుకోమని కట్టెల పొయ్యి దగ్గర కూర్చోమని వళ్ళారబెట్టుకోమని చెప్పాడు, నా ఆనందానికి హద్దేలేదు.

అక్కడ వున్న రాతిపైన కూర్చున్నాం, ఏదో నూనె తీసి ఆ పక్షి గాయానికి రాసి “ఈదురు గాలులు ఈ పక్షిని చావు బ్రతుకుల్లో పడవేసినాయి” అన్నాడు. “అదే గాలి, వాన నన్ను మీ ముంగిట్లో నిలబెట్టినాయి” అంటూ మాట కలిపాను.

నా వంక తీక్షణంగా చూస్తూ “మనిషికి, పక్షిలాగే సహజజ్ఞానం ఉంటే బాగుండును.

తుఫానులు, ఈదురు గాలులు, మనుషుల పిరికితనాన్ని, భయాన్ని మేల్కొలుపుతాయి, పిరికిపందలాగా, గుహల్లోకో, రాళ్ళక్రిందకో దూరి దాక్కుంటాడు, ధైర్యంగా తుఫానును ఎదుర్కోవాలని ఆశిస్తాను. అందులో వున్న అనుభవాన్ని పోగొట్టుకుంటున్నాడు. ఏవో దెబ్బలు తగులుతాయని వంకతో గూట్లో చేరుతున్నాడు.”

ఆయనతో ఇంకా మాట్లాడించాలని, “అవునయ్యా, పక్షులకున్న ఆత్మగౌరవం మనిషికేది? తనకు తాను ఏర్పాటు చేసుకున్న సూత్రాలు, అలవాట్ల నీడలో బ్రతుకుతుంటాడు, కాని పక్షులు, జంతువులు ఈ నిరంతర పరిభ్రమణంలో వున్న భూమితోపాటే ప్రచండభానుని వెలుగు దారిలో పయనిస్తూ ఉంటాయి” అన్నాను.

ఆయనలో ఉత్సాహాన్ని గమనించాను, తనమాటలను విని అర్థం చేసుకునే శిష్యుడు తారసపడినట్లు కళ్ళు మెరిసాయి. ఆయన “బాగా చెప్పావు, నిజంగా నీవు చెప్పింది నీవు నమ్మితే, తక్షణం ఈ కృత్రిమమైన, కళంకితమైన నాగరకతను వదిలివేయాలి. మిగతా జంతు జాలంతో, అద్భుతమైన ఈ విశ్వాంతరాళపు విధానంలో మేళవించాలి. నమ్మటం వేరు, నమ్మిన దాన్ని ఆచరించటం కష్ట సాధ్యం.

“ఎందరో సముద్రాల్లా ఘోషిస్తారు. కాని వాళ్ళు బ్రతికేది చీలమండల లోతు కుళ్లుతున్న నీళ్ళలోనే.

“చాలామంది శిఖారాల్లో తలలెత్తుకుని తిరుగుతారు, కాని ఎంత పిరికి పందలంటే కాస్త చీకటికే గుహల్లో చొరబడి దాక్కుంటారు” అని అంటూ తన చేతిలోని పక్షిని మెత్తని గుడ్డలో పెట్టి ఒక బుట్టలో ఉంచాడు. వెలుగుతున్న మంటలో నాలుగు కట్టెలు వేశాడు, అవి చిటపటమంటూ అంటుకుని, మంటలు నాల్కలు చాచాయి.

“నువ్వు తడిగా వున్నావు, అది ప్రమాదం, పై అంగీ తీసి, ఆరబెట్టుకో, ఆ బూట్లు కూడా తీసి, నీ పాదాలు వేడి చేసుకో...”

ఆయన ఆతిధ్యం నాకు ఇంకా ధైర్యాన్ని ఇచ్చింది, ఆ చలిమంట వెచ్చదనం మరింత నమ్మకం కలిగించింది. ఆ ధైర్యంతోనే, ఆయన, జీమూత మేఘాలు పరిగెడుతున్న ఆకాశం వైపు చూస్తుండగా... కాస్త అమాయకంగానే...

“అయ్యా మీరు ఇక్కడకు వచ్చి ఎన్నాళ్ళయింది..?” అని నసిగాను.

ఆ మర్మయోగి, నా ఉనికిని ఉపేక్షిస్తూనే...

"ఇక్కడికా? ఈ భూమి పుట్టక ముందు, ఈ శూన్యం అంధకారంలో మునిగి ఉన్నప్పుడు, ఈ సముద్రాలపై మహాశక్తి కదలాడుతున్నపుడు..." అంటూ ఘోషించాడు. నిజం చెప్పొద్దు, నాకు భయం ఆవహించింది, నన్ను నేను సంబాళించుకోవటానికి కొంత సమయం పట్టింది.



ఈ మహానుభావునిది ఎంత మార్మికమైన ప్రవృత్తి? ఈ అయోమయపు అసత్యపు మనిషి, నైజాన్ని తెలుసుకోవటానికి, నిర్లక్ష్యాన్ని ఛేదించటానికి చాలా ఓర్పుకావాలి... అనుకుంటూ ఆలోచనలో మునిగిపోయాను.

లోయలన్నీ చీకటిలో మునిగిపోయాయి. వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. తుఫాను గాలి భయంకరంగా ఊళలు వేస్తోంది. బైబిల్‌లో చెప్పినట్లు మనిషి మాలిన్యాన్ని ప్రక్షాళనం చేయటానికి నోవా ఉపద్రవం రాదుకదా?

బయటి భీభత్సం ఈ మర్మయోగి హృదయంలో ఏదో ప్రశాంతిని నింపినట్లు, ఆయన ఒంటరి తనాన్ని ఆయనకు తోడుగా నిలిపినట్లనిపిస్తుంది, రెండు క్రొవ్వొత్తులు వెలిగించి, గాజుపాత్రలో మధువు ఒంపి నాముందు పెట్టాడు-. ఒక పళ్ళెంలో పళ్ళు-రొట్టె తేనె పెట్టి నా ముందుకు తెచ్చాడు-. నాకు దగ్గరగా కూర్చొని, ఇంతకంటే తన దగ్గర ఎక్కువ లేదని, అందుకు క్షమించవలసినదిగా కోరి ఈ పదార్థాలను తనతో పంచుకోమని అడిగాడు-.

నిశ్శబ్దంగానే ఆ కార్యక్రమం పూర్తి చేస్తుండగా బయట గాలి ఊళలు, వాన ఆక్రందనలు నాకు వినపడుతూనే వున్నాయి, ఆయనలోని రహస్యాల్ని, ఆయన గతంలోని లోతులను ఏ విధంగా తెలుసుకోవాలో అని నేను మధనపడుతూనే పూర్తి చేశాను.

రెండు పింగాణీ కప్పులలో మంచి వాసన వచ్చే కాఫీ పోసి, చలిమంట దగ్గరకు తెచ్చాడు.

ఒక సిగిరెట్టు ఆయన వెలిగించి, నాకు ఒకటి ఇచ్చాడు, ఇదంతా నాకు నమ్మశక్యంగా లేదు.

"నీవేమనుకుంటున్నావో నాకు తెలుసు. ఈ మధువు ఏంటి, కాఫీ ఏమిటి, సిగరెట్టు ఇవన్నీ వింతగా, ఇక్కడవున్న సౌకర్యం కూడా నీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు.

అందరిలాగానే నీవుకూడా, ఏమిటి అన్నిటికీ అందరికీ దూరంగా ఉన్న సన్యాసి, జీవితాన్నుంచి వైదొలిగిన వింతమనిషికి ఇన్ని సుఖాలు ఎందుకు అని అనుకోవచ్చు."

"అవునయ్యా, చింతనాపరులు ఆధ్యాత్మిక పరిధిలో పయనించే వారికి ఇవన్ని అవసరం లేదనే అనుకుంటారు."

ఆయన దీర్ఘంగా నిట్టూర్చి, "అవును అందరితో వుంటూనే నేను దైవాన్ని పూజించే వాడినే, ఎందుకంటే పూజా పునస్కారాలకి ఏకాంతం, ఒంటరితనం అవసరం లేదుకదా- నేను దైవాన్ని చూడాలనీ ప్రజలకు దూరంగా లేను, నా తల్లిదండ్రుల చెంత నాకు ఎప్పుడూ దేవుడు దగ్గర గానే వుండేవాడు.

కాని నేను ఈ ప్రజల్నించి దూరమైనది, వారికి నాకు నైజంలోని ఘర్షణతో, వారి వ్యాపకాలు నాకు సరిపడక నేను మనిషి నుంచి దూరమయ్యాను. నా మనసు, మనుగడ ఇతరుల ధోరణికి, జీవన సరళికి భిన్నంగా తిరగడమే, నేను ఆ సంఘర్షణ నుంచి బైట పడేందుకే.

ఈ నాగరకత నుండి దూరంగా వచ్చింది, కాలం చెల్లిన, కుళ్ళిపోయిన, బలీయమై భ్రష్టుపట్టిన ఈ నగర వృక్షపు నీడలో వుండలేక, ఈ విషవృక్షపు వేళ్లు, భూమి లోతుల్లో చొచ్చుకు పోయి వున్నాయి. ఊడలు అవని అంచుల దాకా వ్యాపించి వున్నాయి. పరిమాణం ఆకాశంలో మేఘాలవరకు పెరిగిపోయి ఉంది.

కాని ఈ నాగరక మహావృక్షం, మనకు ఏమి ఒరగ పెట్టింది? అత్యాశ, ద్రోహం, దుఃఖము, వినాశం, కన్నీళ్ళు, కాక? ఎందరో మహానుభావులు దీన్ని శుద్ధి చేద్దామని ప్రయత్నం చేసి పరాజితులైనారు. నిరాశ నిస్పృహలతో హతాశులైనారు, ఈ కుళ్ళిపోయిన వృక్షం, విషం క్రక్కుతూనే వుంది--"

ఆయన కొద్దిగా చలిమంటవైపు ఒరిగి నా వైపు చూడకుండానే, "లేదు తమ్ముడూ, నేను ఒంటరి తనంలో వుంటున్నది, దైవప్రార్థన కోసం కాదు, ఎందుకంటే, దేవుణ్ణి మనస్సుతో ప్రార్థిస్తే ఎంత గందరగోళంలోనైనా, ఆయన వినకపోడు. ఏకాంతంగా ఉండడం మనల్ని మనం బాధించుకోవటమే, మన శరీరమే దేవాలయం. అందులోనే ఆత్మాన్వేషణకు కాంతి దీపాలున్నాయి.

"కాని నేను దైవకార్యం కోసమే ఈ మనుష్యులకు దూరంగా వుండలేదు, ఈ నాగరక సమాజానికి దూరంగా వుండాలనే, వారి అలవాట్లకు, కట్టుబాట్లకూ, భేషజాలకు బాధలకూ దూరంగా ఉండాలనే, అంతేకాదు.

కొంతమంది, తమ విలువలేని ముఖాలను ఎక్కువ వెలకట్టి అమ్ముకోవడమో, ముసుగులు కొనుగోలు చేయటమో చూడలేక, మానసికంగా వారి లేకితనాన్ని, శారీరకంగా వారి డంబాన్ని చూడలేక-

గర్వంగా ముఖంలో నవ్వు పూసుకుని వయ్యారంగా నడిచే స్త్రీలను, వారి మనసులో కల్మషాన్ని చూడలేక, తమను తాముగా ఎంతో జ్ఞానులుగా పరిగణించుకొని సమాజంలో తలెత్తుకు తిరుగుతూ, కలల్లో విహరించే కుటిలత్వాన్ని చూడలేక, అంతేకాదు, మేము ఎంతో సాధించాము, మేము మీకంటే గొప్పవాళ్ళము, ప్రపంచంలో మేము సత్యాన్ని చూసిన ఉన్నతులమనే వాచాలురను వినలేక, దూరంగా పారిపోతున్నా. ఇంకా - ఒదిగి ఉండేవాడిని పిరికి వాడని, దయగలవాడిని చేతకాని వాడని పరిగణించి, డాంబికాలు పలికే వాడు దర్పం కలవాడని అనుకుంటున్న వాళ్ళనుంచి దూరంగా వుండాలని, అంతేకాదు, వాళ్ల ఆజ్ఞలేకుండా సూర్య చంద్రులు ఉదయించరని, అస్తమించరనే వీళ్ల డాంబికాలు విని విని విసిగిపోయాను. ఇంకా, అధికారంలో వుంటూ, వారి లోగిళ్ళలో సర్వసుఖాలు గుమ్మరించుకుంటూ, సామన్యుల నోళ్ళ మట్టికొట్టే అధికారులకు దూరంగా పోతున్నా. మంత్ర తంత్రాలతో ప్రజలను మభ్యపెట్టే మతాధిపతులకు, ఆత్మవంచన చేసుకునే పీఠాధిపతులకు, దూరంగానూ, ఏనాడూ, డబ్బుకు తప్ప దయచూపని ఈ మనుష్యజాతికి ఎడంగానూ, వారి నిర్దయకు నిరసనగా, ప్రజలు ఏదైతే నాగరకత అని అంటున్నారో ఏ విధానాన్ని మానవజాతి ఔన్నత్యం కోసమని నిర్మించి చట్టాలు, శాసనాలుగా పిలుస్తూంటే అదే నాగరకత ప్రజలకు శాపమై, దుఃఖకారణమైందని నిరసిస్తూ నేను దూరంగా ఉండిపోతున్నా.

ఈ ఆశ్రమ వాతావరణంలో నాకు ఎంతో విలువైన ఆధ్యాత్మికమైన జీవితం లభిస్తోంది. సూర్యోదయంలో ఎన్నో వింతకాంతులు చూస్తున్నా. ఈ పూలు వికసించటం, వాటి సువాసనలు గాలిలో తేలిరావడం, ఈ సెలయేళ్ల సంగీతం, నదులు శ్రావ్యంగా సాగరంలో సంగమం చెందడం, వసంతం నిద్ర మేల్కోటం, వేసవి రంగుల్లో వెలిగిపోవడం, శిశిరవు పండుటాకులు నిశ్శబ్దంగా రాలిపోవడం, తెల్లని మంచు చిక్కటి చీకటి చూడటం-ఈ ప్రకృతి అందాలన్నీ చూడగలుగుతున్నా. ఏకాంతంలో ఈ అనుభూతే నేను దైవానికి దగ్గర వస్తున్నాననే నమ్మకాన్ని గలిగిస్తోంది."

ఏదో కొంత మనసులో బరువు తగ్గినట్లు నిట్టూర్చి నా వంక చూశాడు. ఆయన కళ్ళు వింతగా వెలుగుతున్నాయి. ఆయన ముఖంలో ఏదో క్రొత్త వెలుగు కనబడుతుంది.

ఒకరకమైన తృప్తి, దృఢచిత్తం గోచరిస్తున్నాయి. మరికొంత సేపటికి... "అయ్యా మీరు చెప్పిన చాలా విషయాలతో నేను ఏకీభవిస్తున్నాను, ఈ సంఘానికి పట్టిన చీడ తప్పనిసరిగా వదిలించ వలసిందే, అందుకు మీలాంటి వారే పూనుకోవాలి, మరి మీరు దూరంగా ఉంటే ఎలా-- రోగికి దూరంగా వైద్యుడు వెళ్లిపోతే...?"

నావంక సాలోచనగా చూసి "తమ్ముడూ, ఈ సమాజం

పుట్టినప్పటి నుంచి వైద్యులు, ప్రజల్ని ఉద్ధరిద్దామనే ప్రయత్నించారు. కొంతమంది మందులు, మరి కొంతమంది లేపనాలు, ఇంకొంతమంది కత్తులు వాడుతూ వచ్చారు, కాని ఏమి జరిగింది? ఈ కుళ్ళు విస్తరించిపోతోంది, ఈ రోగి ఆ కంపులోనే పడివున్నాడు, ఏదో ప్రార్థన చేస్తున్నట్లు నటిస్తూ, చేతులు చాచి వైద్యుని పీకను నులిమి చంపుతున్నాడు. అరె ఎంత గొప్ప వైద్యుడు అని పైకి పొగుడుతున్నాడు.

లేదు తమ్ముడూ, ఈ మానవజాతిని ఏ ఒక్కడూ ఉద్ధరించలేడు, ఎంత వివేకవంతుడైనా వారి అజ్ఞానానికి బలికావల్సిందే. మంచుతో నిండిన నేల పై ఏమి పెరిగి చస్తుంది కనక?"

"అయ్యా ఈ ప్రజలకు మంచుకాలం గడిచిపోతుంది. తర్వాత వసంతం రాదంటారా? పూలు పూసి, పంటలు పండవంటారా?"

"అయ్యో, దేవుడు మనిషి జీవితాన్ని ప్రకృతి ఋతువుల్లా మలిచి వుంటే, నీవు చెప్పింది జరగవచ్చు, కాని ఏ జాతి, సమితి అయినా తమ జనన గుణాలతో సహజ రీతిలో బ్రతుకుతున్నారా?

మనిషి పగటి వెచ్చటి ఎండలో, రాత్రి సుఖమైన చీకటి, వెన్నెలలో జీవిస్తున్నాడా? రాత్రి నిశ్శబ్దాన్ని విని ఆనందిస్తున్నాడా? ఇక ఈ భూమి అంతా మనుష్య జాతి రక్త మాంసాలతో నిండిపోయిన తర్వాత ఎలా సాధ్యం, ఇంత విధ్వంసం తర్వాత ఋతువులకు విలువేమిటి"

ఆయన చేతిని చీకటి ఆకాశంలోకి చూపుతూ, "ఇక్కడ నా సాధన వృథాగా పోదు. నా గుండెల్లో రూపు దిద్దుకుంటున్న స్వప్నం, ఈ లోయల్ని, పర్వతాలనూ ఆవహిస్తుంది... ఇప్పుడు నా మాటలు, నా లోగొంతులోని వేదన, ఇక్కడ నా ఉనికి, జ్ఞాన తృష్ణకోసమే, నా జీవనం ఆనంద లోకాలను, అలౌకిక జ్ఞానంతో అందుకోవాలనే, ఇందుకోసమే. బయట నాగరకతను జనసమూహాన్ని వదలివేసి ఈ ఏకాంతాన్ని ఆశ్రయించాను. ఇది చివరి వరకూ సాగే ప్రయాణమే..."

ఆయన మాటల్లోని నిజాన్ని, ఈ సమాజపు నాగరకత మరకలను, గాయాల్ని గురించి ఆలోచిస్తూ ధైర్యంచేసి ఇలా అన్నాను.

"మీ అభిప్రాయాలు చాలా ఆదర్శపాయమైనవి, ఎంతో గౌరవించ దగినవి, మీ ఏకాంతం అసూయ పడదగినదే, కాని అయ్యా ఈ ప్రజలకు ఈ దేశానికి ఇంతటి దుర్గతి అధోస్థితి గలిగినప్పుడు మేల్కొలిపే శక్తి, వ్యక్తి అవసరం కదా?"

"ఏమన్నావు? ఈ దేశమా? అయ్యో అన్ని దేశాలు అన్ని దిక్కులూ ఇలాగే తగులబడినాయి. పైకి మెరుగులు మారవచ్చు. తూర్పు దేశాల విషాదం, అదే కుళ్ళిన సమాజం పశ్చిమ దేశాలలోనూ ఉంది, కాకపోతే తీరుతెన్నులు. వేషభాషలూ మారవచ్చు అంతే తమ్ముడూ.

"లేనిపోని గొప్పలు చెప్పుకుని లేదా ఉన్నవి లేనివి డప్పు కొట్టుకొనే తీరు, రంగులు మారుతుంటుంది. కాని మోసం, వంచన ఎక్కడైనా ఒక్కటే. ఎంత మర్యాదగల మాటల్లో చెప్పినా, వంచన వంచనే. గోళ్ళకు రంగు పూసుకున్నా, సిల్కుబట్టలు వేసుకున్నా మోసాన్ని దాయలేం. పేరాశను కప్పిపెట్టలేం ఇవన్నీ విలువగల వాటిగా మాయ చేయలేం.

మనిషిని, తమ కట్టుబాట్లతో, అలవాట్లతో, బోధనలతో కట్టిపడవేసే ఈ నాగరకత, ఎన్ని హంగుల్లో ఉన్నా, ఎన్ని రంగులు పూసుకున్నా చివరికి, మనిషి బానిసత్వాన్ని పోగొట్టలేదు. ఇదే స్వాతంత్ర్యం, ఇదే స్వేచ్ఛ అని ఎంత ఘోషించినా మనుషుల బానిసత్వం, భావదాస్యం పోదుకదా! అంతులేని బానిసత్వపు ప్రలోభాలు, కట్టుబాట్లతో చరిత్రలో, నాగరకత ఎన్నిమారు వేషాలు వేసినా, ఎన్ని గొంతుకలు మార్చినా, మనిషిని స్వతంత్రుణ్ణి చేయగలదా?

తన వికృతాకారంతో నవ్వుతూనే 'నేను స్వేచ్ఛను, నేనే స్వాతంత్ర్యాన్ని' అని వేయి గొంతుకలతో అరుస్తు ఉంటుంది.

ఈ విషయంలో తూర్పు పడమరల భేదం ఏమిలేదు. ఏదో ఒక సమాన ప్రమాణంలో మానవ జాతిని, మానవ సంఘాన్ని, అజ్ఞానాన్ని దుఃఖాన్ని, సంపదను నిలిపి దేనికి ఏదీ తీసిపోకుండా పోటీపడుతున్నాయి.

ఆకలి గొన్నప్పుడు – పులికి, సింహానికీ పెద్ద తేడా ఏముంటుంది?

కొందరిని బలవంతుల్ని చేయడానికి, సంపన్నులను చేయటానికి మరికొంతమందిని, పేదలుగా బలహీనులుగా మారుస్తున్నాయి. అంతే తమ్ముడూ" అని ఆగాడు.

నేను "అవునయ్యా నాగరకత అంటేనే దర్పం, అహంభావ ప్రదర్శన..."

"అవునవును, నాగరకత అంటేనే డాంబికం, గర్వ ప్రదర్శన, అహంకార పూరితం, దురభిమానం, అవివేకం, నిరర్థక మానవేచ్ఛ, విధ్వంసం....

"మనిషి తయారు చేసిన పరికరాలన్నీ, శారీరక సుఖానికే పరిమితం, అలసిపోయినప్పుడు గిలిగింతలు పెట్టే పెట్టెలే ఎక్కువ.

అంతేకాదు, మనిషి తయారు చేసుకున్న బొమ్మల పెట్టెలన్నీ అతని మంచిని – మేధను నిద్రపుచ్చటానికే ఉపయోగపడుతున్నాయి. ఇంకా, అతనిలో ప్రచ్ఛన్నంగా వున్న విధ్వంస గుణాన్ని, హింసా ప్రవృత్తిని రేకెత్తించటానికే దోహదం చేస్తున్నాయి.

"అతను సముద్రాలు జయించినా, దూరాల్ని దాటినా ఏవో క్రొత్త తీరాలను, దేశాలను చూసేందుకే కాని, ఆత్మ శోధనకు కాదు. మానసికానందానికి అసలేకాదు. ఎందుకంటే, ఈ యంత్రాలన్ని ప్రకృతికి శత్రువులే కాక వినాశకారులు కూడా. ఇంకా చెప్పాలంటే, మనం ఏదయితే విజ్ఞానం, పరిజ్ఞానం, పరిశోధన అంటున్నామో, అవన్ని మనిషికి బంగారు సంకెళ్ళు. ఆ పసిడి మిసమిసలో, ఆ సంకెళ్ళ గుసగుసలో పాపం అతడు బందీ అయి అదే ప్రపంచం అనుకుంటున్నాడు, అదే స్వర్గం అనీ భ్రమిస్తున్నాడు.

"తరతరాలుగా, అనంతకాలం నుంచీ ఈ బోనులో ఉండిపోయాడు. తన చుట్టూ తానే లోపల నుంచి కట్టుకున్న ఈ కారాగారంలో, అదే నివాసమని, అందులోనే అతనికి భద్రతవుందనే భ్రమలో వుండిపోతున్నాడు.

"రంగులు పూసుకుని హంగులు వేసుకున్న ఈ నాగరక సమాజం ఎన్ని తరాలయినా తన నైజాన్ని మార్చుకోలేదు. అన్నీ వేళప్రకారమే జరుగుతుంటాయి. ప్రణాళికాబద్ధంగానే, అందరూ సుఖంగా వున్నట్టు కనబడుతుంది. నీ మంచితనం ప్రక్కవాడి దుర్మార్గంతో చేతకానితనం, పిరికితనంలా కనబడుతుంది. ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నట్లే వుంటుంది. ధరలు పెరిగి పోతుంటాయి. ఎన్ని పన్నులు వేసినా అధికారులకు, ప్రణాళిక లోటుగానే కనబడుతుంది.. న్యాయస్థానాల్లో పద్ధతి ప్రకారమే అన్యాయం జరిగి పోతుంటుంది. యుద్ధాలు చేస్తుంటారు. కారణాలు ఎప్పుడూ బలంగానే చూపిస్తారు. ఎవరూ బాధ్యత వహించరు. మనుషులే మనుష్యుల్ని చంపుతుంటారు. ఆ మనుష్యులే వైద్యం చేస్తుంటారు. ఆ మనుష్యులే విలపిస్తుంటారు. ఆ మనుష్యులే తాగి తూలుతుంటారు. వ్యభిచారం సాగుతూనే ఉంటుంది. ప్రకృతి సర్వనాశనం అయిపోతూనే ఉంది. అడవులు కూలిపోతూనే వున్నాయి. మంచుకొండలు కరిగిపోతూనే వున్నాయి. వినాశం విధ్వంసం అంతా పద్ధతి ప్రకారమే జరిగి పోతుంటుంది. అతడు చేస్తున్న ప్రణాళికలన్ని వృథానే, అతడు పడుతున్న శ్రమ కూడా వంచనే...

"ఇంత దర్ప ప్రదర్శనతో అతనికి కానరానిది, మనసులో వున్న ప్రేమ, హృదయంలో వెలిగే జ్యోతి..."

"అయ్యా ఏమన్నారు? ఏమిటది" అని వణికే గొంతుతో అడిగాను.

చాలాసేపు నిశ్శబ్దంగా వుండి, రెండు చేతులు గుండెల మీద వేసుకుని, ఊపిరిపీల్చి వదిలాడు, ఆయన ముఖం ఒక్కసారిగా వెలిగి పోయింది, ఎంతో నిర్మలంగా, స్ఫటికంలా కనిపించింది.

"అదే మేల్కొలుపు, నీ అంతరాత్మను నిద్రలేపడం, హృదయపు లోలోతుల నుండి వెలికివచ్చే ప్రేమామృతాన్ని, అందులో వున్న అద్భుతమైన శక్తిని గుర్తించడం, అప్పుడే నీకు కనువిప్పు. అప్పుడే జీవితపు విలువ తెలిసేది. ఈ ప్రకృతి సంగీతం, సప్తవర్ణాలు, నీలాకాశపు సౌందర్యం, అద్భుతమైన కాంతిపుంజం అన్నీ నీకు గోచరిస్తాయి. ఒక సౌందర్యానందపు మహావృక్షంలా మనిషి భూమ్యాకాశాల మధ్య నిలబడినపుడే అతనికి సార్థకత, అతనిలో వెలిగే ఆ జ్ఞానజ్యోతి అతణ్ణి పునీతుణ్ణి చేస్తుంది, అతనిని చుట్టు ముట్టి వున్న కుళ్ళు నుంచి, పరివేష్టించి వున్న అజ్ఞానం నుంచి అతణ్ణి రక్షిస్తుంది, అదే అతని జీవితానికి పరమార్థం. ఆ అదృశ్యహస్తమే నా కళ్ళముందున్న చీకటి తెరలను తొలగించింది. ఎన్నోసార్లు ఆశ్చర్యపోయాను తమ్ముడూ, నన్ను నేను ప్రశ్నించుకున్నాను కూడా,

"ఏమిటా ఈ విశ్వరహస్యం? నేనెవరిని? ఇక్కడెందు కున్నాను, ఈ జనం నుంచి ఎందుకు వేరైపోయాను, ఎందుకు

వాళ్లతో కలవలేక పోతున్నాను. విలక్షణంగా ఎందుకున్నాను? వాళ్ళంతా నాకెలా తెలుసు? ఎక్కడ కలిశారు, వీళ్ళ మధ్యలో ఎందుకుంటున్నాను? వీళ్లంతా ఈ భూమికి అపరిచితులేనా? వీరంతా నవ్వుతూ తుళ్లుతూ ఉన్నారే, వీళ్ళంతా ఏడుస్తూ కన్నీరు కారుస్తున్నారే, మరి నేనెందుకు వేరేవిధంగా ఆలోచిస్తున్నాను, ఇక్కడ నుంచి వీరంతా ఎక్కడకు వెళ్తారు? మరి నేనెక్కడి పోతాను? వీటన్నిటికీ సమాధానాలు ఎక్కడున్నవి?

"అదీ, అదే జరిగింది నాలుగేళ్ళ క్రిందట", అంటూ చేతులు ముందుకు చాచి "అవును అప్పుడే ఇక్కడికి వచ్చాను, సమాధానం కోసమే...ఇక్కడే మేల్కొన్నాను, నిశ్శబ్ద సౌందర్యాన్ని అనుభూతి పొందాను."

తలుపు దగ్గరకు వెళ్లి, చీకట్లోకి చూశాడు, తుఫాను భీభత్సాన్ని ఆస్వాదిస్తున్నట్లు, "అవును అదే ఆత్మ సాక్షాత్కారం. అది తెలిసినవాడే గుర్తించగలడు. కాని ఇతరులకు చెప్పాలంటే కష్టసాధ్యం, మాటల్లో ఇమడనిది. ఒక్కసారి ఆ అనుభూతి పొందినవాడే తన అస్తిత్వాన్ని అర్థం తెలుసుకోగలడు" అని అన్నాడు.

రాత్రి గడచిపోతోంది, ఆ మర్మయోగి, అలా అటూ ఇటూ తిరుగుతూనే వున్నాడు. ఆయన ప్రశాంత ఏకాంత జీవితంలోని సౌందర్యాన్ని అర్థం చేసుకున్నాననే అనుకున్నాను. ఎంతో రాత్రి గడిచింది, నా దగ్గరగా వచ్చి నన్ను దీక్షగా చూశాడు.

తనను అర్థం చేసుకున్న వాడి ముఖాన్ని గుర్తు పెట్టుకోవాలనేమో? ఆయన రహస్యాల్ని విన్న వాడి ఉనికిని గుర్తించాలనీ కావచ్చు, అప్పటికే నా మనసు బరువెక్కిపోయింది, నా కళ్ళలో నీరు నిండింది.

ఒక్కసారిగా "తమ్ముడూ, నేను వెళ్తున్నాను, చీకట్లలోకి ప్రవేశిస్తున్నాను. ఆకురాలు కాలంలో, మంచుకురిసే వేళల్లో నాకీప్రయాణం చాలా ఇష్టమైనది, ఆహ్లాదకరమైనది. ఇప్పుడు ఈ తుఫానులోకి ప్రవేశిస్తున్నాను.

"ఇదీ నీ యిల్లే అనుకో–" అంటూ, పైన అంగీ వేసుకుని "తలుపు గట్టిగా వేసుకో, ప్రొద్దున్నే ఎవరైనా లోపలికి రావచ్చు. ఇతరుల కొంపల్లో దూరాలని, రహస్యాల్ని తెలుసుకోవాలనే బలహీనత ఇక్కడ అందరికీ ఉన్నదే కదా...

రేపంతా అడవిలోనే వుండి పోవాలను కుంటున్నా" అంటూ చేతి కర్ర తీసుకుని తలుపు దగ్గరకు వెళ్ళి, "ఈ తుఫాను నిన్ను భయపెట్టింది కదా, మళ్ళీ అటువంటి సందర్భం వస్తే ఇక్కడికి రావటానికి సందేహించకు, తమ్ముడూ వస్తా...." అని తలుపు తీసి, ఆ తుఫాను గాలిలోకి, ఆ వాన భీభత్సంలోకి, ఆ చీకటి రాత్రిలోకి తలెత్తుకుని నిర్భయంగా ప్రవేశించాడు.

ఆయన ఆ వానతెరలో కలిసి పోయేవరకూ చూస్తూ ఉండిపోయాను...తెల్లవారింది. తుఫాను తగ్గి, వర్షం ఆగిపోయింది. ఆకాశం కడిగినట్లు నీలంగా మెరిసిపోతున్నది. సూర్యుని వెచ్చని కిరణాలు వర్షంలో తడిసిన చెట్లమీద పడుతున్నాయి. గలగలపారే సెలయేళ్లు మిలమిల మెరిసి పోతున్నాయి.

నా కీ నీరెండ తళతళలో కొత్త వెలుగు కనబడుతోంది. రాత్రి తుఫాను విధ్వంసంలో ఇప్పుడు మార్మిక సత్యం గోచరిస్తోంది. నాలో ఇన్నాళ్ళు ఉన్న ఊగిసలాట తెల్లమబ్బుల్లా విడిపోయింది. ఉత్సాహంగా కొండ దిగటం మొదలుపెట్టాను. అంతలో వెన్నులో వణుకు ప్రారంభమైంది. ఏదో ఎక్కడో మేల్కొన్నట్లు ఒక్కసారిగా నా హృదయం నిదురలేచి ఈ ఉదయ కాంతిలా ఆవరించింది. పరిసరాలతో తెలియని మమేకం తెలియవచ్చింది. ఆనందంతో పరుగు పెడుతున్నాను.

రాత్రి ఆయన చెప్పిన ఆత్మ సాక్షాత్కారం, మేల్కొలుపు నాలో స్పష్టంగా గుర్తించగలిగాను, మనసు కొంత హాయిగా అనిపించింది.

మనిషికి తనను తాను తెలుసుకోవటం, మనసు మేల్కోవటం ఎంతో ముఖ్యం, అతని అస్తిత్వానికి అదే పరమార్థం. ఇప్పటి నాగరకత వక్రవేషాలు, అవినీతి మయమైన జీవన విధానం వదలి, ధర్మమార్గంలో బ్రతుకుని పండించుకోవటంలో మానసికానందాన్ని పొందాలి.

కాని పదార్థాన్ని ఎలా నిర్లక్ష్యం చేయగలం? అదీ ఎన్నో రూపాలతో మన చుట్టూ వుండగా? ఇప్పటి కృతక నాగరకత, త్వరలోనే అంతం కావచ్చు, దాని అవసరం కూడా అదేనేమో? కాని, అనంతమైన భ్రమణ సూత్రం, మనకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించదా? మనల్ని విముక్తుల్ని చేయదా?

తర్వాత మళ్ళీ ఆ మర్మయోగి నాకు కనిపించనే లేదు.

మిమ్మల్ని మధ్యలో వదిలివెళ్తున్నందుకు క్షమిస్తారు కదూ...

**మా నాన్నగారు...** **14వ పుట నుంచి...**

పిల్లల్ని స్నేహితుల్లా చూసుకున్నారు. వాళ్ళ గాఢమైన జీవితేచ్ఛ కొంతమంది పిల్లలనైనా ప్రభావితం చేసిందనిపిస్తుంది. భారతం ఆదివారాలు వినడం ఆంధ్రదేశానికి వ్యసనం చేసిన రేడియో పౌరాణికుడు ఉషశ్రీ ఛాందసుడు కాడు. ఒక కుమార్తెకు సివిల్ వివాహం చేసి రాఘవాచారిగారితో ఎన్నో అటువంటి ఇటువంటి వివాహాలు చేయించాడు.

వేదుల సత్యనారాయణశాస్త్రిగారు కావలిలో ఉన్నపుడు ఒంగోలు మా ఇంటికి వస్తూండేవారు. పెళ్లిళ్ల దగ్గర్నించీ కుమార్తెల అభిరుచుల్ని అర్థం చేసుకుని వాళ్ల జీవితాన్ని వాళ్లు నిర్వహించుకునే అవకాశాన్నీ, విశ్వాసాన్ని పంచిన మంచి నాన్న వేదులు. "నీనింక బతకనురా. అమ్మని జాగ్రత్తగా చూసుకోండి'' అని చెప్పి వెళ్ళిపోయారట. తుమ్మల సీతారామమూర్తిగారు. ఎంత నిరాడంబరుడాయన. అచ్చమైన గాంధేయవాది. హుందాగా, నిక్కచ్చిగా జీవించాడు. చాసోగారు. చాగంటి తులసిగారు చాసో నఖచిత్రాన్ని బాగా చేశారు. ఆయన నమ్మకాలూ జీవనం ఒకటే. హడావుడి లేకుండా తన పార్థివ శరీరాన్ని కళ్లనీ వైద్యాలయానికి దానం చెయ్యమని చెప్పి కథ ముగించుకున్నా రాయన. ఈ పుస్తకంలో నాకు నచ్చిన మరో విశేషం ఉంది. నాన్నగారి గురించి రాసిన వాళ్లలో 30 మంది కూతుళ్లు. వారి జ్ఞాపకాల్లో, అందరూ బాగా రాయలేకపోయినా గొప్ప ఆర్ద్రత.

ముఖ్యంగా చాగంటి తులసి, కాత్యాయని, అపరాజితల వ్యాసాలు చదివిన తరువాత మంచి తండ్రిని చూసి కూతురు ఎక్కువ గర్విస్తుందనే నా అభిప్రాయం బలపడింది. కేతవరపు రామకోటి శాస్త్రిగారంటే నాకు గౌరవం. పరిచయం కూడా ఉండేది. ఆయన పట్ల ప్రేమ, గురు భావం కాత్యాయని గారి వ్యాసంలో తొణికిస లాడుతోంది. నిజానికి ఈ మాట, హేమలతగారే, సీతగారికే అందరికీ వర్తిస్తుంది. మొక్కజొన్న పంట ఉన్నంతకాలం సుద్దాల హనుమంతు పాట ఉంటుంది. ఆయనేపాట. జ్ఞాపకం చేసుకున్నారు. అశోక్ తేజగారు. ఇంద్రగంటి హనుచ్ఛాస్త్రిగారు మంచి వక్త. ఒంగోలులో ఆయన ఉపన్యాసాలు విన్నాను. కవిగానే కాకుండా వ్యక్తిగా బాగా పరిచయం చేశారు శ్రీకాంతశర్మగారు. అందరూ అలా చెయ్యగలిగి ఉంటే బాగుండేది.

చాలా మంచి ప్రయత్నం చేసిన ద్వానా శాస్త్రిని మరోసారి అభినందిస్తున్నాను. ఆయన శ్రమ వృథాకాదు. ఎవరో ఒకరు దీన్ని కొనసాగిస్తారని నమ్మతున్నాను.

---

# ఏరువాక




**పల్లవి :** ఏరువాక – ఎదలోపలి
తేనెవాక కాదా
తూరుపు సిందూరములో
వెలుగు రేక కాదా.
ఈ పున్నమ వెన్నెలలో
ఎన్ని ఆశలో...
రేపటి గాదెల నిండా
ఎన్ని రాసులో...

**చరణం :** చినుకు చినుకులో ఏదో
పచ్చని సంకేతం
చిరుమువ్వల గిత్తలలో
ఏదో సంగీతం.
రైతు చెమట చుక్కలలో
దేశం కనిపించింది
ఆతని శ్రమ గీతిలో
త్యాగం వినిపించింది. ॥పల్లవి॥


**చరణం :** తలపాగా చుట్టినపుడు
అతడె భువికి నేత
హలంపట్టి దున్నినపుడు
అతడె అన్నదాత.
మట్టితోడ మాటాడే
మంచి మనసు అతనిది
చెట్టు తోడ – చేమ తోడ
స్నేహ బంధమతనిది. ॥పల్లవి॥

**- రసరాజు**



# సంస్కర్తల కథలు

- ఎన్.సి. రామానుజాచారి



గురజాడ

తెలుగు కథానిక 'సంస్కరణ శీలత'తోనే ప్రారంభం అయింది. సంస్కరణ అనగానే సామాజిక పరిస్థితులు అన్నింటికీ ఒక్కబిగిని కూలంకషంగా మార్చివేయడం అనుకోనక్కర లేదు. తనలో తన ఇంటిలో, తను ఉంటున్న సంఘంలో, దేశంలో, ప్రజానీకంలో 'అంటువ్యాధి'లాగా వుండి ఎంతకూ కదలిపోని దురాచారాన్ని దూరం చేసుకోడం కోసం జరిగే ప్రయత్నం సంస్కరణ. ఇంట్లో సిగరెట్లు తాగడం దగ్గర్నుంచి, పబ్లిక్ ప్లేస్‌లో పొగతాగరాదు అనే నియమం శాసనం అవటానికి దాదాపు నూరేళ్ళు పట్టింది. చిన్నపిల్లలకు వివాహాలు జరిపించగూడదు, అనేది దీన్ని పోల్చి చూస్తే తొందరగానే శాసనం అయినట్లు కనిపిస్తుంది. స్త్రీవిద్య ఆవశ్యకత గురించి యిరవయ్యో శతాబ్దం మొదట్లో పత్రికలు, సభలు, సమావేశాలు జరిపినట్లుగా యిప్పుడు పాటు పడవలసిన అవసరం లేదు. వెనకటి రోజుల్లో ఆడపిల్లలకు చదువులు చెప్పించేవాళ్లు కాదు, అంటే యీ తరం యువత నమ్మలేకపోవచ్చు. సంస్కరణ రూపురేఖలు అలా నమ్మబుద్ధి కాకుండా వుండడం కూడా సహజం.

సంస్కరణ అభిప్రాయాలను కథావస్తువుగా తీసుకుని, మానవ మనస్తత్వంలో సమూలమైన మార్పు తీసుకు రావటానికి ప్రయత్నించిన కథలు మనకు అనేకం వున్నాయి. మార్పు మాట అట్లా వుంచి, మనస్తత్వ పరిశీలనలు పరిణితిని ఎరుక పరిచే మూడింటిని ఒక వ్యాసంలో విశ్లేషించడం యిప్పటి ప్రయత్నం.

మొదటి కథ గురజాడ అప్పారావు పంతులు గారి 'సంస్కర్త హృదయం' ఇది అప్పారావు బహుశ 1910, 15 మధ్య రాసి వుండాలి. ఆయన దీనిని తెలుగులో రాయలేదు. ఇంగ్లీషులో రాసిన కథ అముద్రితంగ వుండిపోతే శ్రీ అవసరాల సూర్యారావు తెలుగు దేశ ప్రకటనార్థం 'భారతి'కి యిచ్చారు. ఈ కథ ఇంగ్లీషు పేరు Stooping to Conquer అనగా, శ్రీ సూర్యారావు 'సంస్కర్త హృదయం' అని తెలుగులో శీర్షిక వుంచారు. ఈ కథ భారతి వర నామసంవత్సరం శ్రావణమాసం పత్రికలో అచ్చయింది. తరువాత గురజాడ కథాసంపుటాలలో చోటు చేసుకొని అనేక పునర్ముద్రణలు పొందింది.

రెండవ కథ శ్రీ పాలగుమ్మి పద్మరాజు గారి 'గాలివాన'. ఇది ఆంధ్రపత్రికలో 12-5-1951న ప్రచురితం. 1952లో ప్రపంచ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొంది బహుళ ప్రచారానికి నోచుకుంది. ఆంధ్ర పత్రికలు ప్రచురణ అయిన తరవాత అనేక సంకలనాలలో, సంపుటాలలో చోటు చేసుకుంది.

మూడవ కథ శ్రీ 'శ్రీ విరించి' రచన, 'ఇలలో ప్రణతార్తి హరుడనుచు' అనేది. ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో 18-9-96లో ప్రచురణ అయి దరిమిలా 2000లో 'గంధపుచుక్క' అనే ఆ రచయిత కథసంపుటాలలో చోటు చేసుకుంది.

ఈ మూడు కథలకు ఒకదానికి మరొకదానికి నలభయి సంవత్సరాలు పైబడ్డ కాలవిరామం వుంది. ఈ మూడింటిలోను, సమాజంలో మనుషుల వర్తనాన్ని


డా. ఎన్.సి. రామానుజాచారి : పేరుగాంచిన కథకులు, విమర్శకులు.

మార్చవలెనన్న సంస్కర్తల తపన, యత్నము విరివిగ వున్నాయి. మనిషి వర్తనం మారినందువల్లనే సమాజం కూడ మారుతుంది అన్న ఆలోచన పాఠకుడికి కలుగుతుంది. మార్పును గురించి నినాదాలు గాని, తీవ్రమైన ఉపన్యాసాలు గాని చూపకుండ, ఆయా సంస్కర్తల వ్యక్తిగత జీవితాలలో 'గుంజాటన' మటుకే స్పష్టంగా చెబుతారు. ఈ కాల విరామంలో సామాజిక స్థితిగతులలో వచ్చిన మార్పులు, అందుకు అనుగుణంగా సంస్కర్తలు అవలంబించిన కొత్త పద్ధతులు సూచితం అవుతాయి. చదువరికి సామాజిక చరిత్రను, ఒక శతాబ్దంలో వచ్చిన పరిణామాన్ని కొంతవరకు అంచెనా వేసుకుందుకు దోహదం చేస్తాయి.

ఈ కథలలో సామాన్య విషయమేమంటే మగవాడు సంస్కరణవాది ఉపన్యాస కర్త. స్త్రీ అబల, అసహాయ, పరాధీన. స్త్రీ పురుష సంబంధాలను గురించి అనుకోని, ఊహించని, పరిస్థితులు.

'సంస్కర్త హృదయం'లో ప్రొఫెసర్ రంగనాథయ్యరు, సరళ, ప్రధాన పాత్రలు. ఆయనకు 'మానవునిలో శారీరక మానసిక దౌర్బల్యాలు వున్నాయని వింటేనే, జుగుప్స, అవినీతిని, అన్యాయాన్నీ యే రూపంలో వున్నా సరే, ఏరిపారవేయాలనే పట్టుదల అతని అణువణువునా కనిపిస్తుంది. 'ఆయన ఆంటినాచ్. పడుపు వృత్తిని అరికట్టడం యెలాగు అనే విషయాన్ని గురించి అందరితో ప్రస్తావిస్తూ వుంటాడు. 'సరళ' అనే బోగం పిల్లను 'చూసి, కొంత పరీక్షిస్తాను' అని ప్రిన్సిపల్‌తో చెబితే ఆయన 'మనో వికారాలకు లోను కాకూడదు, ప్రొఫెసర్; మనలాంటి వాళ్ళు, ఆకర్షణల దరిదాపులకైనా పోరాదు. మంచివాళ్లకీ పద్ధతి మరీ మంచిది' అంటాడు. 'నా దరిని ఎంతటి విషయలోలుడు అనుసరించినా మారకమానడు' అని ధీమాగా అని తనప్రయత్నం కొనసాగిస్తాడు, రంగనాథయ్యరు.

"సరళ గదిలోనికి వెడుతూ రంగనాథయ్యరు 'హమ్మయ్య' నరకంలోంచి స్వర్గానికి' అన్నాడు. అంతకుముందు సరళ తల్లి గది ఆయనకు నరక కూపంలా కనిపిస్తుంది. సరళ కనిపించగానే, యింతకు ముందు తయారు చేసుకున్న ఉపన్యాసం మరిచిపోతాడు. 'ఇప్పుడతనికి ఒకటే కోరిక. లలితమైన ఆమె పెదవులమీద అచ్చువేసినట్లు ఒక ముద్దుపెట్టుకుంటే!' అని.



పాలగుమ్మి పద్మరాజు

'నన్నీ నరక కూపం నుంచి బయటకు తీసుకుపోరూ? నన్ను కనికరించి, ప్రబోధించండి. మీతో ప్రపంచం చివరికైనా పయనించి వస్తాను. రక్షించండి' అని సరళ అన్నప్పుడు ఆయన 'ఎవరినైనా వివాహం చేసుకుంటే బాగుండును సరళా!' అనిమాత్రం బదులు చెప్ప గలుగుతాడు.

'అంటే ఎవడో ఒక ఛండాలుడికి నేను కలకాలం బానిసనై పడి వుండాలని మీ తాత్పర్యం' అని సరళ మందహాసం చేస్తుంది. 'నాబోటి బోగం పిల్లలను ఏ మర్యాదస్థుడు పెళ్లాడుతాడో మీరే చెప్పండి' అని బదులు ప్రశ్న వేస్తుంది.

'పుస్తకాలలోని సిద్ధాంతాలు, వల్లె వేయడం తప్ప అని జీవితంలోనికి పరివర్తింప జేయడమెలాగో' ఆయన ఊహించుకోలేదు.

సరళ వీణ మీద ఒక జావళీ పాడి వినిపిస్తుంది. ప్రొఫెసరు లేచి గబుక్కున ముందుకు వెళ్లాడు. ఆమె పెదవులను ముద్దు పెట్టుకున్నాడు. సరళ చేతిలోని వీణ జారిపోయింది'. "ప్రొఫెసర్ దగాలో పడ్డాను; మోసం మోసం అని వికృతంగా అరుస్తూ అక్కడి నుంచి వెళ్ళిపోతాడు." మరునాడు తన ఉద్యోగానికి రాజీనామా ఉత్తరం పంపుకుంటాడు. పడిన దురవస్థను వివరిస్తూ ప్రత్యేకంగా ప్రిన్సిపల్‌గారికి రాసిన ఉత్తరంలోని పంక్తులను చదువుతున్నప్పుడు ప్రిన్సిపల్ కళ్ళు నీళ్ళతో గిర్రున తిరిగాయి.

సంస్కర్త హృదయం కరిగిపోయింది. సంస్కరణను గురించి పూర్వపరాలు పరిపూర్ణంగా ఆలోచించుకోకుండ

అరకొర అభిప్రాయాలతో ముందుకు నడిస్తే, ప్రయత్నం అంతా 'కౌంటర్ ఎఫెక్టివ్' అవుతుందని అప్పారావు గారు స్పష్టపరుస్తారు.

'గాలివాన' కథలో రావుగారు అనేక విషయాలను గురించి తీవ్రమయిన అభిప్రాయాలు వున్నవాడు… "వేదాంతం జీవితం తోటి, జీవిత విధానం తోటి వ్యక్తికో సంఘానికో మధ్య ఏర్పడే రకరకాల సమస్యల తోటి అనుసంధించి వుంటుందని ఆయన వాదము'. 'ఆస్తిక సమాజము' వారి ఆహ్వానం మీద 'సామ్యవాదమూ రమ్యరసామోదము' అనే విషయం పైన ఉపన్యాసం యివ్వటానికి ఆయన ప్రయాణం చేస్తున్నాడు, రైలులో. ఒక ముప్ఫైయేళ్ల ముష్టిమనిషి కళ్లలో 'తమాషాగా మెరిసే ఒక తళుకు' ఆయనకు కనిపిస్తుంది. బిచ్చమెత్తుకోవడం తప్పని ఆయన అభిప్రాయం. గాలివాన వచ్చి ఒక చిన్న స్టేషన్లో వెయిటింగ్ రూమ్‌లో చిక్కుపడిపోతాడు. ఆమె కూడ అక్కడకు వస్తుంది. ముష్టి అడుక్కున్నప్పుడు యేమి యివ్వకపోగా చీదరించుకున్న మనిషి, యిప్పుడామె తనసామాను తెచ్చి వెయిటింగ్ రూంలో పెడితే 'కొంత డబ్బు యివ్వబోయాడు. ఆమె వద్దన లేదు గాని, ఏదో వినబడకుండ అని చటుక్కున మాయమయిపోయింది'. ఆమెను గురించి ఆలోచించుకొంటూ వుంటే 'ఏంటండీ బాబుగారూ! నాకేసలా చూస్తారు అంటుంది ఆమె, మునుపున్నంత రంగుగా యిప్పుడు లేనండి…' అంటుంది. 'తన మనస్సులో అశ్లీలమయిన భావాలు వుంటాయన్నట్లు ఆమె సూచించినందుకు ఆమె మీద అసహ్యం కలిగింది ఆయనకు. గాలివాన ఉధృతానికి ఆమెను కౌగిలించుకు పడుకుంటాడు. ఆ తరవాత లైటు వెలిగించి ఆమె ముఖం వంక చూచాడు. నిద్రలో ఆ ముఖం అమాయకంగా, నిశ్చింతగా వుంది. స్వచ్ఛమైన, నిసర్గమయిన ఒకశోభ ఆ ముఖంలో దివ్యత్వం స్ఫురింప చేసింది'.

ఆయనకు మెలుకువ వచ్చి చూచేసరికి ఆమె (ముష్టి ఆమె) అక్కడ లేదు. గాలివాన హోరు కూడ తగ్గింది. ముష్టి ఆమె చచ్చిపోయి పడివున్న దృశ్యం చూచి ఆనకు ఏడుపు వస్తుంది. ఆమెకు ఒక చేతిలో ఆయన పర్సు, రెండోచేతిలో కొన్ని నోట్లు కొంత చిల్లర వుంది.

…ఆ గాలివానకు ఆమె బలి అయిపోయింది!' ఆయనలో లోతుగా మాటు పడివున్న మానవతత్వాన్ని ఈ జీవి వికసింప చేసింది. ఆయన భార్యగాని, ఆయన పిల్లలలో ఎవరుగానీ ఈమె వచ్చినంత దగ్గరగా రాలేదు. ఆయన విలువలు, నియమాలు, ధర్మచింత, వేదాంతం అన్నీ త్యజిస్తాడాయన, ఈ వ్యక్తికి ప్రాణం పొయ్య గలిగితే'!

'తన పర్సు ఆమె చేతిలోంచి విడదీయటానికి ఆయనకు మనస్సు వొప్పలేదు. తనకు సంబంధించినదేదో ఒక చిహ్నంగా ఆమె శరీరం తోటి ఉండిపోవాలని ఆయనకు అనిపించింది. ఆమె దొంగతనం చేసిందనుకొంటే ఆయన భరించలేడు. జాగ్రత్తగా పర్సులో నుంచి తన పేరుగల కార్డు తీసివేసి బరువైన హృదయంతో అక్కణ్ణించి వెళ్లిపోయారు'.

పరిస్థితులకు తనకు తెలియకుండానే లొంగిపోయి, చిరకాలంగా మనసులో తిష్ట వేసుకున్న అభిప్రాయాలు, మృత్యుదర్శనంతో కరిగిపోవడం, మనిషి పట్ల ఆప్యాయత పెల్లుబికి రావడం మనిషి ప్రవర్తన రీతులలో అతని సంస్కారం తీసుకువచ్చే ప్రకంపనలను స్పష్టపరుస్తుంది. ఈ కథ. మానవత ధోరణినే కాక, అస్తిత్వ వాదానికి ప్రతీకగా గొప్ప కథగా యిది రూపొందుతుంది.

'ఇలలో ప్రణతార్తి హరుడనుచు' అన్న కథానికలో సత్యానందం 'ప్రజలలో చైతన్యం, ఎవేర్‌నెస్ తీసుకు రావడంకోసం నగరాలు, పట్టణాలు, పల్లెలు తిరిగి అనేక సాంస్కృతిక విషయాల మీద మాట్లాడడం అనే పనిని స్వచ్ఛందంగా స్వీకరించి ఉద్యోగం కూడా మానుకుని గత పదేళ్లుగా తిరుగుతున్న' ఒక కాలేజీ మాజి ప్రొఫెసర్. ఈ రోజు 'మానవ పునర్వికాసం' గురించి ఉపన్యాసం యివ్వాలి. మరుసటి రోజు యూనివర్శిటీలో కూడ ఒక ఉపన్యాసం వుంది. అతడు హోటలు గదిలో వున్నప్పుడు ఒక అమ్మాయిని దూరంగా గమనించి 'ఎక్కడో చూచానే!' అనుకుంటాడు. మరనాడు ఆ అమ్మాయి భర్తతో సహా అతన్ని కలుసుకుని, తాను ఎక్స్‌స్టూడెంట్ మైధిలినని పరిచయం చేసుకోవడమే కాకుండా, అతడు లోగడ చేసిన ఉపకారాన్ని ప్రస్తావించి ప్రస్తుతిస్తుంది. అంతకుముందు 'వికాస' అనే ఆమె అతన్ని బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించి నిన్న సాయంత్ర సమావేశంలో అతని ఉపన్యాసం తనకు బాగా నచ్చిందని చెబుతుంది.

'మనిషిలో మంచితనం నిజంగా వున్నదా?… అంతనమ్మకం చిక్కడం లేదండీ' అంటుంది ఆమె. తన

అపనమ్మకానికి జీవితంలో తటస్థించిన భర్తతో అనుభవాలే యేకరువు పెడుతుంది.

'అతనితో కలిసి బతకడం కష్టం అయిపోతుంది. తీరికగా ఆలోచించుకుందుకు వారం రోజులు సెలవు తీసుకుని ఇక్కడకు వచ్చికూర్చున్నాను. నా ఆలోచన యింకా తెగలేదు' అంటుంది ఆమె, వికాస.

ఆమెను తనతోపాటు యూనివర్శిటీ ఉపన్యాసానికి కూడా రమ్మని ఆహ్వానిస్తాడు. తనను కలుసుకున్న మైథిలి, ఆమె భర్త శ్రీనివాసరావులకు వికాసను పరిచయం చేయడానికి వాళ్లను ఆ మధ్యాహ్నం తన రూంకి టీకి ఆహ్వానిస్తాడు. 'ఆమెకు మీ సహాయం అవసరం' అని చెబుతాడు.

మనిషి మారడం అవసరం అని గుర్తించినప్పుడే అవకాశ ద్వారాలు వాటంతట అవే తెరుచుకుంటాయనీ, అలా మారడం సాధ్యమా అని ప్రశ్న వేసుకున్నప్పుడు ఆ ద్వారాలు ఎప్పుడూ మూసుకునే ఉండిపోతాయనీ చెప్పుతాడు సత్యానందం. వికాసను కూడ టీకి ఆహ్వానించి 'మీకు వాళ్ల పరిచయం ఉపకరించవచ్చు' అంటాడు

'మంచితనం ఉంది. కాని అది మరుగు పడిపోయింది. చావలేదు. మంచితనం చావదు. తాత్కలికంగా లుప్తమై పోతుంది, తగిన పోషణ లేకపోతే అందుకు దాన్ని వెలికి తీసుకు రావడానికి యింత సాహిత్యం, యిన్ని పుస్తకాలు, ఎన్నో సెమినార్లు ఉపన్యాసాలు...' అంటాడు సత్యానందం.

సమాజం మారాలా, వ్యక్తి మారాలా అనే సంశయాన్ని ప్రత్యక్షంగా తర్కించకుండానే, వ్యక్తి మారడం ద్వారా వ్యవస్థ మార్పు జరుగుతుందని సూత్రప్రాయంగా చెబుతాడు.

ఈ కథలో స్త్రీ పురుషుల పరస్పర ఆకర్షణల సంపర్కం లేదు. కేవలం భావాలు మటుకే సంభావనం చేసుకుంటాయి.

తను ప్రత్యక్షంగా యేమీ చేయకుండా, భావ విప్లవం లాంటి దాన్ని ప్రేరేపిస్తూ మానవ చేతనంలో అంతర్మథనం తీసుకువచ్చి 'నవనీతం' బయట పడేట్లు చేయడం సత్యానందం పరిశ్రమ. ఎవరికివారు జీవితాన్ని అనుభవించి, పలువరించి, సరిపోల్చి చూచుకుని తోటివారితో సంప్రదిస్తూ 'అనంత విశ్వంలో అనుకోకుండ మళ్లీ మళ్లీ వచ్చే వికాసాన్ని' ఆహ్వానించుకుంటూ నవసమాజాన్ని నిర్మించుకోవాలని, దీనికోసం పెనుగులాట, సంఘర్షణ అవసరం లేదని, మన ఆలోచన ధోరణి, సరళి సజావుగా వుంటే అంతా అదే సర్దుకుపోతుందనీ మాటలలో కాకుండా ఆచరణలో చేతలలో చెబుతాడు సత్యానందం.

మనిషి ఆలోచనల్లో కాలనుగుణంగా కాలపరిణామ ఫలితంగా వచ్చే మార్పులను ఈ మూడు కథలు చాలవరకు సూచిస్తాయి. మొదటి కథలో సంస్కర్తకు, తన ఆలోచనల పూర్వాపరాలు స్పష్టంగా తెలియవు. రెండో కథలో సంస్కర్త అభిప్రాయాలు తారుమారయిపోయి, అభిమానం, ఆత్మీయత మొలకెత్తుతాయి. మూడో కథలో 'మంచి తనం' మనిషి నుంచి మనిషికి వ్యాపిస్తుంది. జీవనగమనాన్ని సుగమం చేస్తుంది. పాత్రల సామ్యం వున్న, ప్రవర్తనలలో 'పరిణామం', భావపరమైన 'ప్రభావం' చదువరులు గమనించడం కోసం ఈ విశ్లేషణ. ప్రగతిశీల వ్యక్తిత్వాలు సాంఘిక సామాజిక రంగాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు తీసుకురావడానికి 'కథానిక' ప్రయోజనకరమైన వాహకం, అనడంలో ఎలాంటి సందేహమూ లేకపోగా నిర్ధారితం కూడ అయింది.

## చీకటి గూడు

ఈ గూడు వదిలి
వాళ్ళు వెళ్ళిపోయారు...
ఇంకా నేను పుడకలు
ఏరుకుంటూనే ఉన్నా...
దిగిపోయే పొద్దు కన్నుల్లో,
దినమూ ఆశను వెలిగిస్తూనే ఉంది.
రాత్రి నక్షత్రాలు - వాళ్ళు ఏరుకునే రత్నాలా?
చీకటిలో వెర్రిగా తిరిగే చక్రాలు -
ఎర్ర కళ్ళ దెయ్యాలా?
నా పగటి చీకటికి,
అర్ధరాత్రి స్వప్నాలా!!

**- కవిత**

# మహాకవి

**- రాచకొండ విశ్వనాథశాస్త్రి**

**లో**కంలో దుఃఖం ఉంది.

అందుచేత, మనం కన్నీటి పాటలు పాడుకొని, జాలిగేయాలు రాసుకొని, అయ్యో అయ్యో కథలు చెప్పుకుని సంతృప్తి పడవచ్చు. అలా చేసినట్లయితే, లోకంలో దుఃఖం ఉండడంవల్లనే, సుఖపడ గలిగేవారు మనజోలికి రారు, అడిగినట్లయితే మనజోలె కూడా నింపుతారు. కాని, ఆ దుఃఖానికి కారణం ఉంది సుమా అని చెప్తే మాత్రం ఆ సుఖపడేవారు మనగురించి తగు జాగ్రత్తలు తీసుకుంటారు; "ఆ అవ్వే మరణిస్తే" వారు కూడా మనతోపాటు అయ్యో అయ్యో అంటారు.

ఆమెని కాల్చడానికి కట్టెలు కొని మనకి దానం చేస్తారు. ఆమె మరణం గురించి మనం నీటి పాటో, మేటి గేయమో, తేనీటి కథానికో రచిస్తే వారు మనల్ని మెచ్చుకొందికి కూడా వెనుదియ్యరు; మనకి బహుమానాల్విడానికి ముందుక్కూడా వస్తారు.

అయితే –

శ్రీశ్రీగారి వెర్రిగాలి ప్రశ్నించినట్లు ఆ అవ్వే మరణిస్తే 'ఆ పాపం ఎవ్వరిదని' మనం ప్రశ్నించినట్లయితే మాత్రం, ఆ సుఖపడే పెద్దలు "వీడెవడ్రోయ్"! అంటారు. మరింక, ఆ దుఃఖానికీ కారణం ఉంది. ఈ పెద్దల పాపమే ఆ దుఃఖానికి ముఖ్యకారణం. దీన్ని నిర్మూలించడానికి మార్గం ఒక్కటే సుమా, ఆ దుఃఖాలన్నీ పోవాలంటే ఆ పాపాలన్నీ నాశనం కావాలిసుమా అని మనం చెప్పినట్లయితే ఆ పెద్దలు "వీడెవ్వడ్రోయ్" అని ఊరుకోరు. "వీణ్ణి తీసుకుపోయి కొట్లో వెయండ్రా" అంటారు. లేకపోతే "వీణ్ణి పట్టుకుపోయి లిక్విడేటు చెయ్యండ్రా'' అంటారు. అలా వేయించగలడానికీ, చేయించగలడానికీ వారికి అన్ని సదుపాయాలూ ఉన్నాయి. అన్ని అధికారాలూ వున్నాయి. ఎన్నెన్నో రూపాల్లో ఎందరెందరో నౌకర్లున్నారు. మరింక పాపం అంటారా? లక్ష పాపాలు కడిగేసుకొందుకి లక్ష మంది దేవుళ్ళున్నారు. లక్షలాది పుణ్యక్షేత్రాలున్నాయి. చేసేవాళ్ళం 'మనమే' కావొచ్చు కాని, చేయించేవాడు పరమాత్ముడు కదా! నారు పోసినవాడు నీరుపోసినట్టే, పాపాల్ని చేయించినవాడు పాపాల్ని క్షమించడా!

మనసు దాచుకొందికి, సరిపుచ్చుకొందికి సవాలక్ష మార్గాలున్నాయి. కూటికోసం కోటివిద్యలున్నట్టు, పుట్టబోయే విప్లవాలకి కట్టి ఉంచిన జెయిళ్ళున్నట్టు, కోటి పాపాల్ని దాచడానికి వారికి శతకోటి సరదాలున్నాయి. రంగుపూసి మార్చడానికి తీపి తీపి రంగులున్నాయి. ప్రశ్నించిన వారిని పట్టి ఉంచనూగలరు, పాపాల్ని దాచుకోనూగలరు వారు.

అవసరం వచ్చినపుడు పబ్లిగ్గా జలియన్‌వాలాబాగ్‌లో లాగ, దక్షిణాఫ్రికాలోలాగ, కాంగోలోలాగ, అల్లప్పుడు తెలంగాణాలోలాగ, అలనాడు మలయాలోలాగ, మొన్నమొన్న ఇండోనేషియాలోలాగ వారు మనల్ని కొట్లో వేయనూగలరు, కత్తుల తోటల్లో వేళ్ళాడదీయనూగలరు.

కాని, ప్రశ్నించి, పాపాల ఆరాతీసే శ్రీశ్రీగారి గాలి మామూలు గాలికాదు. అది వెర్రిగాలి. అది స్వేచ్ఛాయువు. అది ప్రచండ ప్రభంజనం. కొన్నిచోట్ల కొందరు పెద్దలు దాన్ని కిటికీలు మూసి, తలుపులు వేసి, తాళాలు బిగించి ఉంచగలరేమో కాని దాన్ని లొంగదియ్యలేరు. లిక్విడేటు చెయ్యలేరు. సముద్రంలోంచి నీరు తోడగా అది ఆఖరికి నిన్నే ముంచేస్తుంది. దాన్ని ఎన్ని కొట్లలో దాచగలవు నువ్వు? దాన్ని వేడెక్కించి, ఉడుకులెత్తించి ఆవిరిగా మార్చినా అది నీరుగా మారి మళ్ళీ నిన్నే ముంచేస్తుంది.

శ్రీశ్రీగారు కవిత్వంలోనే ప్రభంజనం రేకెత్తించలేదు. ప్రజలలో కూడా ప్రభంజనం రేకెత్తించేరు. నీ కవిత్వానికీ ప్రజలకీ సంబంధం లేనపుడు ఆ కవిత్వం ఎన్ని సుళ్లు తిరిగినప్పటికీ అది నీ టీ కప్పులోనే ఉంటుంది. అందుచేతనే పెద్దలంతా మన కవిత్వాన్ని రంగురంగుల పింగాణీకప్పుల్లో తెచ్చి వారికివ్వమంటారు. అదిబాగుంటే తాగి మెచ్చుకొంటారు. గంటకి ఓ బియ్యపుగింజ మీద బట్ట విప్పుకున్న ఆడదానిబొమ్మ వేసినట్టు, మనం వారికి దినానికో మంచి పద్యం వండి సువాసనకి సుగంధ ద్రవ్యం కలిపి, కంటికింపుకి మంచి రంగేదో కలిపి కప్పులో కలిపి ఇస్తే, అఫ్‌కోర్స్, వారవి తాగుతారు. అయితే శ్రీశ్రీగారు పేదజనుల దీనజనుల ప్రభంజన కవేకాని పెద్దింటివారి వంటకవి కారు. అందువల్లనే పెద్దింటివారికీ, వారి వంటవారికి శ్రీశ్రీగారంటే అంతమంట.

కాని, మా శ్రీశ్రీ మహాకవి మీ పెద్దింటివారి కోపతాపాలకి గాని, మీ వంటింటి మంటలకి కాని బెదరడు, జడియడు, వెనుకాడడు. కొండలా నిలబడతాడు, పిడుగులా మాట్లాడతాడు, ప్రళయంలా అరుస్తాడు. మెరుపులాంటి, గేయాలా? వచనాలా? లేక, వచనగేయాలా?, ఏవయితే అవి మెరుపుల్లా మీ మీదికి విసిరేస్తాడు, అవి మీ మీదికి పిడుగుల్లా పడ్డాయి, ఇంకా పడతాయి. అప్పుడు రుషి మంత్రం పనిచెయ్యలేదనుకోండి. అప్పుడు గడ్డం గొరిగించుకొని రుషిగారు ఊరుకోరు. ఊళ్ళోకి వెళ్ళి ఏ రామలక్ష్మణుల్నో రేకెత్తించి, లేపుకొచ్చి రాక్షసుడి మీదికి పంపిస్తారు.

అక్కడ ఉంది వంటకవులకీ, మహాకవులకీ మధ్య ఉండేతేడా. వంటకవి నానా రుచుల పద్యాలూ వండుతూ కూర్చుంటాడంతే. అతను ప్రేయసినీ పొయ్యినీ విసరగలడంతే.

కాని మహాకవి ప్రభంజనాన్నీ జనాన్నీ రేకెత్తిస్తాడు. అతని తుఫానుగాలికి జనంలో ప్రళయం లేస్తుంది. అది పాపాత్ములమీదికి విరుచుకుపడుతుంది.

మహానుభావులు వారి ప్రతిభచేతా, కృషిచేతా మనల్ని ఆశ్చర్య చకితుల్ని చెయ్యడమే కాకుండా లోకానికి ఉపకారం చేదామనే ఉత్సాహం కూడా మనలో పుట్టిస్తారు. విజ్ఞానపు లోతులు తరిచి చూడాలనే జిజ్ఞాసా, ఆకాశపుటంచులు అందుకు వెళ్ళాలనే ఆకాంక్షా వారు మనకి కలిగిస్తారు. అన్యాయాన్ని ఎదుర్కొని దాన్తో పోరాడి దాన్ని జయించి న్యాయాన్ని నిలబెట్టాలనే ఉద్రేకం మనలో కలిగిస్తారు. ఆ ఉద్రేకం ఒక దీక్షగా మారేటట్టుగా వారు చేస్తారు. మానవలోకపు కల్యాణానికి మన, ధన మాన ప్రాణాల్నీ, సర్వస్వాన్నీ త్యాగం చేయగల శక్తిని కూడా వారు మనలో కల్పిస్తారు. మనల్ని వారు కార్యోన్ముఖులుగా చేస్తారు. గౌతమబుద్ధుడా, ఏసుక్రీస్తా, గాంధీ మహాత్ముడా? ఎవరైనా సరే అలాంటి వారంతా అటువంటి శక్తియుక్తులున్నవారే. అటువంటి పనులు చేసి చూపించినవారే. వారిని మహాపురుషులన్నాం. వారే కవులైతే వారిని మహాకవులంటాం.

మహాకవి శ్రీశ్రీగారి కవిత్వంలో ఆ శక్తీ, ఆ ప్రతిభా ఉన్నాయి. వీరి కవిత్వం, కవిత్వాన్ని కూడా మార్చి ఉండవచ్చును. వీరి గేయాలు, ఛందస్సు లేకుండా పరిగెట్టవచ్చును. వీరి వచనం, గేయపు కండువా వేసుకోవచ్చును. వీరిగేయాలు పంచెలకి బదులుగా పంట్లాలు తొడుక్కోవచ్చును. అవన్నీ ముఖ్యంకాదు. షోకులన్నీ పెద్దింటి కవులు కూడా చేస్తారు. వారినడిగితే వారు అదే ముఖ్యం అంటారు. వారు శ్రీశ్రీని మెచ్చుకుంటే అందుకోసమే మెచ్చుకుంటారు. నాకు తెలిసిన ఒకాయనకి స్టాలిన్ అంటే మహాకోపం. కాని స్టాలిన్ మీసం గురించి మాత్రం అతను చాలా మెచ్చుకొనేవాడు. మనిషి మంచివాడవాలి కాని మీసం మంచిదైతే మనకెందుకు!

శ్రీశ్రీగారు కవిత్వానికి ఏ తొడుగు తొడిగేరు అనే ముఖ్యం కాదు. కవితామతల్లి ఆదిశక్తి. ఆ శక్తిని అతను పతితుల భ్రష్టుల బాధా సర్పదష్టుల పక్షాన నిలబెట్టేడు. ఆమె చేతికి ఆయుధాలుగా ఇచ్చేడు తన కవితల్ని. శ్రీశ్రీ మహాకవి ధర్మపక్షాన నిలబడ్డాడు. ఆయన కవిత ధర్మంచేతిలో బాణం.

అందువల్లనే శ్రీశ్రీ గారంటే మాకు ఎంతో ఇష్టం. ఆయనంటే మాకెంతో గర్వం. వ్యక్తిగా కూడా ఆయనెంతో మంచివాడు. మహామనీషి అని ఈయన గురించి చెప్పడానికి వీలుండకపోతే మరే వ్యక్తి గురించి కూడా అలా చెప్పడానికి వీలుండదన్నమాటే. వ్యక్తిగా ఎవరికైనా ఉండవచ్చు తప్పులు. గాంధీ అంతటి మహానుభావుడికి బోసుబాబు మీద అంతకోపం ఉండడం ఎంత తప్పు అని ఎంచినట్లయితే,

తక్కినవారిలో ఎన్నెన్ని తప్పులుండవచ్చునో ఆలోచించండి. కాని గాంధీగారి జీవితంలో అదికాదు గమనించతగ్గ విషయం, ధర్మాధర్మాల మధ్య జరిగే సంఘర్షణలో ఈ మనిషి ఏపక్షం నిలబడ్డాడు అనేది ఏ మనిషిలో అయినా సరే చూడదగ్గ ముఖ్య విషయం. తనకున్న శక్తినంతా ఈ మనిషి ధర్మపక్షం నెగ్గడానికా, అధర్మం నెగ్గడానికా ఉపయోగిస్తున్నాడని చూసినట్లయితే ఈ మహాకవి, ఈ మహామనీషి, ఈ శ్రీశ్రీ తన శక్తినంతా ధర్మపక్షం నెగ్గడానికే వినియోగిస్తున్నాడనేది తిరుగలేని సత్యం.

శ్రీశ్రీగారు మా మహాకవి. ఆయనంటే మాకు ఎంతో గొప్ప. మాకు చాలా గర్వం. ఈయన కవిత ప్రజలకీతడు ధారబోసిన శక్తి. భారతజాతికీ, ప్రపంచ సాహిత్యానికి ఈతడు తెలుగువారిచ్చిన వెలుగు కానుక. తెలుగుభాష ఉన్నంతకాలం ఈయన ఉంటారు. తెలుగుభాష మాసిపోతే, ఈయన మిగతా భాషల్లో మిగిలి ఉంటారు. ఈ ప్రపంచంలో మానవుల మనుగడ ఉన్నంతకాలం ఈయన ఉంటారు. మానవుడు మరో ప్రపంచాన్నీ మరికొన్ని లోకాల్నీ వెతుక్కువెళ్తే, శ్రీశ్రీగారు వారితోపాటు అక్కడ కూడా ఉంటారు.

అవును! శ్రీశ్రీ మహాకవి! మహామనీషి!

*(1-2-70న విశాఖలో శ్రీశ్రీకి జరిగిన సన్మానం సందర్భంగా ప్రచురించిన సావనీర్‌లోని వ్యాసం)*


మి

---

## మూడవ అట్ట చిత్రకారుడు ద్రోణాదుల గోవిందరాజులు

ఇంద్ర కీలాద్రి పాదాల మరుగున, కంకర రాళ్ల క్వారీల దగ్గర్లో, నిత్యము జనం పరుగులు పెట్టే బ్రతుకుబాట ప్రక్కనే, ఓ ఒంటిస్తంభం మేడలాంటి గూడు. ఆ గూటిలో ఎనిమిది దశాబ్దాల కపోతం, నిశితమైన పెన్సిల్, సుశిక్షతమైన కుంచె, ఒకటి, రెండు, రంగులు కలిపిన పళ్లాలు – ఇవే ఆస్తి, ఆయుధాలుగా ఒక కళా సామ్రాజ్యాన్ని సృష్టించుకున్న ఓ వాల్మీకి. మీ కోసం గుమ్మంలోనే నిరీక్షించి ఆహ్వానించి, మెత్తని కుర్చీలో కూర్చోపెట్టి, ఆత్మీయంగా నవ్వుతాడు – ఎన్నో విషయాలు, వివరాలు మీకు వినిపిస్తాడు. మీరు చనువు చూపితే, ఒక కళా ప్రపంచాన్ని మీ ముందుంచు తాడు. అవి మామూలు, చిత్రాలు కావు, మన అజ్ఞానపు ధూళిలో ఇన్నేళ్ళుగా మరుగునపడి, మినుకు మినుకుమనే సుదూర నక్షత్రాల వంటి కళాజ్యోతులు. వాటి సృష్టికర్త, అమాయకంగా, తొంభయ్యో పడిలో స్వచ్ఛమైన ముత్యంలా కాలసముద్రంలో దాగి ఏదైనా గాఢ కిరణకాంతికి మెరవటానికి సిద్ధంగా వుంటాడు. నిత్యమూ బ్రతుకు చీకటిలో వెతుకులాడుకునే మనబోటి దురదృష్టవంతులకు ఆయన ఎలా కనపడతాడు? వెలుగులోకి వస్తాడు? ఏదో దారి తప్పి వెళ్ళిన, నాబోటి తిరుగురాయునికి దారి ప్రక్కన దర్శనమిచ్చాడు. ఇదే నేపథ్యం. ఆయన ప్రస్థానం ఇక ఆయన మాటలలోనే త్వరలో తెలుసుకుందాం.

– అశ్వినికుమార్



**రాగాల పడవలో నిశ్శబ్దంలోనికి ప్రయాణం...**

## పుట్టు మచ్చ

నేను పుట్టకముందే
దేశద్రోహుల జాబితాలో
నాపేరు నమోదై వుంది

కన్నబిడ్డని సవతి బిడ్డగా
చిత్రించిన చరిత్ర
అన్నదమ్ముల్ని చీల్చి
నన్ను ఒంటరివాణ్ణి చేసింది

నా ప్రమేయం లేని పరిణామాలతో
నన్ను కర్తను చేస్తుంది వర్తమానం

నా అస్తిత్వం చుట్టూ
అనుమానాల వలయం, వర్తమానం...

నా నెత్తిమీద నీడ
నిగా కెమెరా వర్తమానం,
వివాదాల నర్తనశాలలో
నన్ను కీచకుణ్ణి చేస్తుంది వర్తమానం

రాజ్యాంగం నాతో ఆడిన
పవిత్రమైన పరాచికం నా పౌరసత్వం

నా రక్తం రియల్ వ్యాపారం
నా రక్తం రాజ్యాధికారానికి రక్ష
నా నెత్తురు భరతమాత నుదుటి తిలకం!
పదవీ సోపానానికి హస్తం!

వెండి తెర మీద
రంగస్థలాల మీద

విదూషక ఖల్‌నాయక్ వేషం నాది
సాంస్కృతిక వికలాంగుణ్ణి నేను

చరిత్రను మతంగా
కులాన్ని చరిత్రగా
చిత్రిస్తున్న పాలకులను
చూసి నవ్వుకుంటాను
నిజానికి అది నవ్వు కాదు
అనునిత్యం దిగమింగే ఆర్తనాదం!

నాకీ పుట్టుమచ్చ వారసత్వం
ఎప్పటికీ మాయని గాయం

- ఖాదర్ మొంయిద్దీన్

## శూన్యగతి

నీవూ నేనూ ఒకటైనప్పుడు
భూమ్యాకాశాలు కలిశాయి అన్నావు
ఒకరికొకరం తోడూ నీడా అనుకొన్నప్పుడు
గాలి కూడా చొరలేదనుకున్న
మనిద్దరి మధ్యా ఈ తేడాలెందుకు?
అవును ఎందుకు?

నీవు సగం నేను సగం
ఒకటిగా రూపొందినప్పుడు
రూపం గుణం అన్నింటిలో
నీది కొంచెం నాది కొంచెం
ఒకే మూర్తిగా మారి
సాకారమైనప్పుడు, సరాగమైనప్పుడు



పాప పాల కోసం ఏడ్చినా, పక్కబట్ట తడిపినా
బాబు నిద్రలో ఉలిక్కిపడి లేచి నీళ్లడిగినా
అది నా సమస్యే, నీకేమీ పట్టదు
విసుక్కుంటావు, అటు తిరిగి పడుకుంటావు

బూట్లు కొనలేదని అడిగినా, బ్యాడ్జీలని ఏడ్చినా
యూనిఫారం చినిగినా, లేసులు ఊడిపోయినా
విసుగేస్తుంది నీకు, నాదే తప్పనిపిస్తుంది
హోమ్‌వర్క్ చేయకున్నా, టీచర్ రమ్మన్నా
ర్యాంకులు పడిపోయినా, రిక్షావాడు ఎగ్గొట్టినా
నీ దృష్టిలో అది నా చేతగానితనమే.

అయినా వాళ్లు నీ వారసులే!
అలా ఎలా అయ్యారో, ఎప్పుడయ్యారో
నాకు అంతుబట్టదు మరి
పట్టించుకునే తీరికేది?
ఎంతైనా ఆడదాన్ని
మట్టి బుర్రను కదా!
అవును, నేను భూమిని
నీవు ఆకాశానివి.
అబ్బో! అందుకే శూన్యానివి.

- సుమతీ నరేంద్ర

# మానవేంద్రనాథ్ రాయ్ ఆలోచనలు నేటికీ అక్కరకు వస్తాయా?

**- నరిసెట్టి ఇన్నయ్య**

అబ్బూరి రామకృష్ణారావు నుండి ఆలపాటి రవీంద్రనాథ్ వరకు ఆంధ్రలో 15 సంవత్సరాలపాటు ప్రభావితం చేసిన ఎం.ఎన్.రాయ్ పునర్వికాస కర్త. అలాంటి మనిషి నిజంగా వుండేవాడా అన్నట్లుంటుంది ఆయన జీవన పయనం.

జాతీయ ఉగ్రవాదిగా బెంగాల్‌లో కార్యక్రమాలు ఆరంభించిన నాడు ఆయన పేరు నరేంద్రనాథ్. 1915 వరకు పోరాటాలు జరిపి తరువాత పేరు మార్చుకొని, అమెరికా వెళ్ళి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేట్ అయిన, ఎవిలిన్‌ను పెళ్ళాడి, ఆమెతో పదేళ్ళు కాపురం చేశాడు. 1917లో మెక్సికో వెళ్ళి కమ్యూనిస్టు అయ్యాడు. అంతా సినిమాల్లో సాహసవీరుని కథవలె సాగుతుంది.

ఆ తరువాత రష్యా నాయకుడు లెనిన్ పిలుపుపై మాస్కో వెళ్ళి 1920-30 మధ్య అంతర్జాతీయ కమ్యూనిస్టు అగ్రనాయకులను, హోచిమిన్ వంటివారిని తయారు చేశాడు. చైనాలో కమ్యూనిస్టు పార్టీలో కీలక పాత్ర వహించాడు. ఆ తరువాత యూరోప్‌లో పత్రికలు పెట్టాడు. అసలు విషయం భారత కమ్యూనిస్టు పార్టీని తాష్కెంట్‌లో ఆరంభించి, సాహిత్యాన్ని శిక్షణనూ దిగుమతి చేశాడు. అదో పెద్ద మలుపు. రెండు ప్రపంచ యుద్ధాలు చూసిన వ్యక్తి. జర్మనీలో సుభష్ చంద్రబోసు నాజీ నియంత హిట్లర్‌తో చేతులు కలిపితే, రాయ్ అతన్ని వ్యతిరేకించాడు.

ఐన్‌స్టీన్ మెచ్చిన రాయ్, సైన్స్‌లో నిష్ణాతుడై, శాస్త్రీయ అవగాహన రాజకీయాల్లో సైతం కావాలన్నాడు. అతన్ని బ్రిటిష్ వారు 1930లో అరెస్టు చేసినప్పుడు, అలాంటి



ఎమ్.ఎన్. రాయ్

మేధావిని జాగ్రత్తగా కాపాడమని ఐన్‌స్టీన్ బ్రిటిష్ వారికి విజ్ఞప్తి చేశాడు.

యూరోప్ పునర్వికాసం సరిగా అవగాహన చేసుకోవాలంటే రాయ్ పుస్తకం (రీజన్, రొమాంటిసిజం అండ్ రివల్యూషన్) చదవమని ప్రముఖ సైకాలజిస్టు ఎరిక్ ఫ్రాం చెప్పడం రాయ్ నిశిత దృష్టికి అద్దం పడుతుంది.

భారతదేశానికి 15 సం॥ల తరువాత తిరిగి వచ్చి ఆరేళ్ళు బ్రిటీషువారి జైళ్ళలో వుండి బయటపడిన తరువాత మళ్ళీ కాంగ్రెస్ జాతీయవాద రాజకీయాలలో ప్రవేశించాడు. అచిర కాలంలోనే రాడికల్ ప్రజాస్వామ్య పార్టీ పెట్టి శాస్త్రీయంగా ఆలోచనలు వ్యాపింప జేశాడు. ఆ తరువాత పార్టీ తత్వమే తప్పని తేల్చాడు.

డా. నరిసెట్టి ఇన్నయ్య : రచయిత, జర్నలిస్ట్, హేతువాది.

ఎమ్.ఎన్. రాయ్ సిద్ధాంత కర్తగా మానవవాదాన్ని పెంపొందించి, ఆధునిక వైజ్ఞానిక శాస్త్రీయ ఫలితాలు అన్వయించుకుంటూ పోవాలన్నాడు. ఆ దశలో దేశమంతా పర్యటించి ఎందరో మేధావులను ప్రోత్సహించి సెక్యులర్ హేతువాద ఆలోచనలను ఆకర్షణీయంగా చెప్పాడు.

1938 నుండి 1950 వరకూ అనేక పర్యాయాలూ ఆంధ్రదేశమంతటా పర్యటించి వివిధ రంగాలలో పత్రికలు ప్రారంభించటానికి, శిక్షణాతరగతులు నడపటానికి, విపరీతంగా సాహిత్యం సృష్టి జరగడానికి, కొత్త తరహాలో సినిమాలు తీయటానికి కారకుడయ్యాడు. ఆ దశలోనే తెనాలిలో త్రిపురనేని గోపీచంద్, ఆవుల గోపాలకృష్ణమూర్తి, కోగంటి రాధాకృష్ణమూర్తి, పి.వి. సుబ్బారావు, ఆలపాటి రవీంద్రనాథ్, బైరాగి, జి.వి. కృష్ణారావు, పాలగుమ్మి పద్మరాజు, డి.వి. నరసరాజు, పెమ్మరాజు వెంకటరావు, యం.వి శాస్త్రి, అబ్బూరి రామకృష్ణారావు, పి. కృష్ణచౌదరి, మల్లాది రామమూర్తి మొదలగు ప్రముఖులు విజృంభించి పునర్వికాస ఉద్యమానికి కృషి చేశారు. అప్పటి ఛాందస సంఘానికి ఎదురీదారు. సంస్కరణలకు పూనుకున్నారు.

యం.యన్. రాయ్ అందించిన ఆలోచనలు శాస్త్రీయమైనవి. నిత్యనూతనంగా ముందుకు సాగాలే గానీ, దేనినీ మూఢంగా నమ్మి ఆరాధిస్తూ ఆగిపోకూడదని ఆయన విశదీకరించారు. అది తేలికగా అధిక సంఖ్యాకులకు మింగుడు పడలేదు. ఒకవైపున శాస్త్రీయ ఫలితాలను సమాజానికి అన్వయిస్తూనే మరొక వైపున ప్రశ్నించకుండా గుడ్డిగా నమ్మే తత్వాన్ని ఖండించాడు. దానివల్ల సమాజప్రగతి కుంటుపడుతుంది, అది తొలగిపోవాలని చిన్నతనం నుండి ప్రశ్నించే ధోరణి, స్వేచ్ఛగా ఆలోచన చేసే పద్ధతి ప్రోత్సహించాలని ఎం.ఎన్. రాయ్ పదేపదే చెప్పారు. ఆచరణలో కష్టసాధ్యమైనా అది నేటికీ అక్కరకు వచ్చే ఆలోచనే.

ఎం.ఎన్. రాయ్ రచనలు భారతీయ భాషలలో, ముఖ్యంగా తెలుగులో వచ్చాయి. అయితే అవి ప్రస్తుతం గ్రంథాలయాలకు, విశ్వవిద్యాలయాలకు పరిమిత మయ్యాయి. విస్తృతంగా సమాజంలో అటువంటి శాస్త్రీయ ధోరణి వస్తే తప్పనిసరిగా ప్రగతి పథంలో సాగవచ్చు.

త్రిపురనేని రామస్వామి, చలం వంటివారు ఎమ్.ఎన్.రాయ్‌ని తెనాలిలో కలిసిన తరువాత పరస్పర చర్చలు కొనసాగలేదు. అందువలన జరగవలసినంత ప్రయోజనం జరగలేదు.

ఆలపాటి రవీంద్రనాథ్ 1940 ప్రాంతాలలోనే 'జ్యోతి' పత్రిక స్థాపించి, కుటుంబ నియంత్రణ సమాజానికి అవసరమని రాయ్ వలన ప్రభావితుడై చెప్పారు. ఆనాటికి అది సమాజాన్ని ఆశ్చర్యపరచిన అంశమే. అలాగే మిగిలిన రంగాలలో కూడా రాయ్ ఆలోచనలు ప్రజా బాహుళ్యంలోకి రావాలంటే చాలా కృషి అవసరం.

1955లో రాయ్ చనిపోయిన తరువాత ఆయన మార్గాన్ని అనుసరిస్తూ రావిపూడి వెంకటాద్రి, ఆవుల సాంబశివరావు, భట్టిప్రోలు హనుమంతరావు, కల్లూరి బసవేశ్వరరావు మొదలైన వారు వివిధ రంగాలలో కృషి చేశారు. ఇది నేటికి అసంపూర్తిగానే ఉండిపోయింది.

మానవ విలువలు అమలుపరచాలని ఎమ్.ఎన్. రాయ్ విస్తృతంగా చర్చ జరిపి చెప్పారు. కానీ చాలా సందర్భాలలో వివిధ మతాలు ఆయన ఆలోచనలకు అడ్డుపడుతూ వచ్చాయి. అంతర్జాతీయంగా ఐక్యరాజ్య సమితి మానవ హక్కులు, విలువలు ఆమోదించినా, నేటికీ వివిధ మతాలు అవి అమలు జరగకుండా చూస్తున్నాయి. కనుక ఎమ్.ఎన్. రాయ్ తాత్విక ఆలోచనలు నేటికీ ఎంతో అవసరమనిపిస్తుంది.

ఉత్తరోత్తరా 1990 ప్రాంతాలలో 'మిసిమి' పత్రికను ప్రారంభించి ఆలపాటి రవీంద్రనాథ్ అటువంటి కృషి జరిపారు. అది ఆదర్శంగా తీసుకుని యువతరం ముందుకు సాగవలసి ఉన్నది.

సంజీవదేవ్ లాంటి కళాద్రష్టలు సైతం ఎమ్.ఎన్.రాయ్ పట్ల ఆకర్షితులై ఆయన ఆలోచనలు మెచ్చుకోవటం గమనార్హం. వి.ఆర్. నార్ల చివరి దశలో ఇంచుమించు రాయిస్టుగా మారి ఆయన ఆలోచనా స్రవంతిని వ్యాపింప చేయటం ఆశ్చర్యకరమే అయినా హర్షించదగినది.

*(మిసిమి ప్రారంభ సంచికలో వ్రాసినవారు*
*'బూదరాజు రాధాకృష్ణ, నరిసెట్టి ఇన్నయ్య)*

మి

# తనికెళ్ల భరణికి 'శ్రీపాద పురస్కారం'



శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాజమండ్రి దగ్గర అనపర్తి మండలంలోని పొలమూరులో జన్మించారు. అనేక రచనలు, కథలు, నవలలు, నాటకాలు వ్రాసిన వీరు ఎంతోమంది రచయితలకు స్ఫూర్తి... అలాంటి మహనీయుణ్ణి నిత్యం స్మరించుకుంటూ, ఆరాధిస్తూ... ఆనందిస్తారు ఆ గ్రామప్రజలు.... 2010 మార్చి 30వ తేదీన పొలమూరు గ్రామంలో శ్రీపాదవారి సంస్మరణోత్సవం ఓ పండుగలా జరిగింది.

బి.ఎస్.ఎన్. కుమార్‌గారు "శ్రీ బుద్ధవరపు చారిటబుల్ ట్రస్ట్" ద్వారా ఏడాదికొక రచయితకు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి జ్ఞాపికను అందజేసి సత్కారం చేయడం ఆనవాయితి అయ్యింది. ఇది వరకు శ్రీ బేతవోలు రామబ్రహ్మం, శ్రీ ప్రయాగ రామకృష్ణ, శ్రీ గొల్లపూడి మారుతిరావు గార్లకు ఈ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఇప్పుడు ప్రముఖ కథా, కవితా, నాటక రచయిత, నటుడు 'తనికెళ్ళ భరణి' గారికి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్‌గారు, ప్రముఖ రచయిత, సాహితీవేత్త మృణాళిని గారు, ప్రముఖ సినీగీత రచయిత అదృష్ట దీపక్‌గారు, ప్రముఖ టి.వి. రచయిత బ్నిం గారు, హాస్యనటుడు గౌతంరాజు గారు, మిమిక్రి ఆర్టిస్ట్, జూనియర్ మోహన్‌బాబు ప్రముఖ కవి యమ్. సూర్యనారాయణగారు, రావులపాలెం సర్పంచ్ వి. వెంకటరెడ్డి, రంగస్థల నాటక నిర్వాహకుడు పంతం సీతారామమూర్తి, సి.ఆర్.సి. నాటక కార్యదర్శి త్రిమూర్తులు, ఇలా ఎంతోమంది శ్రీపాద వారి అభిమానులు, భరణిగారి అభిమానులు విచ్చేసి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి మీద అభిమానాన్ని చాటుకున్నారు.

ముందుగా జూనియర్ మోహన్‌బాబు, హాస్యనటుడు గౌతంరాజు చిరునవ్వుల జల్లులతో సభ ప్రారంభమైంది. తర్వాత మృణాళినిగారి ఉపన్యాసనం సభికులందరిని మంత్ర ముగ్దుల్ని చేసింది. తర్వాత అదృష్ట దీపక్‌గారు, ఉండవల్లి అరుణ్‌కుమార్ గారు ప్రసంగించి శ్రీపాదవారి మీద వారికున్న మమకారం ఎటువంటిదో వారి ఉపన్యాసాలతో తెలియ జేశారు. అనంతరం 'తనికెళ్ళ భరణి' గారికి శ్రీపాదవారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. తర్వాత ఆయన ప్రసంగిస్తూ, 'శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి తాను ఏకలవ్య శిష్యుడని, ఆయన రాసిన కథల్లో 'గులాబి అత్తరు' కథ తనను కదిలించిందని, అటువంటి మహానుభావుడి పురస్కారం రావడం తనకు ఎంతో ఆనందమని చెప్పారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తన రచనలను అచ్చువేయించి తానే సైకిల్ మీద తిరుగుతూ, అణాకు, బేడాకు అమ్ముకునే వారని, అటువంటి స్థితి మళ్ళీ ఏ రచయితకు రాకూడదని గద్గద స్వరంతో ప్రసంగించారు.

శ్రీపాదవారు చివరి రోజుల్లో వ్రాసిన వీలునామా (ఉత్తరం) ఆనాటి రచయితల దుర్భర జీవితాలకు పరాకాష్ఠ. ఆ ఉత్తరాన్ని భరణిగారు ఆర్ద్రంగా చదివి సభికుల హృదయాలను కదిలించారు.

*సభికులను కదిలించిన ఉత్తరం ప్రక్క పుటలో...*



# పురిపండాకి శ్రీపాద ఉత్తరం



*పురిపండా అప్పలస్వామి గారికి!*

ఇవాళ తెల్లవారేటప్పటికి నాకు పక్షవాతం సందేహం కలిగింది. మీరు హైదరాబాద్ నుంచి ఎప్పుడు వస్తారు?

నాగేశ్వరరావుగారికి కథల పుస్తకాలు ఇచ్చెయ్యదలచుకున్నాను. వెనక ఒకమాటు వారు పేజికి మూడు రూపాయల చొప్పున బేరం చేసి స్థిర పరచుకున్నారు. నేను కథలు పట్టుకు వెళ్ళి యివ్వబోతే, డబ్బులేదు, ఇప్పుడు వద్దన్నారు. ఆ బేరం మొన్న జ్ఞాపకం చేశాను. నిజమే అప్పుడు డబ్బులేక పోయిందన్నారు. ఇప్పుడు ఆ రేటున ఫైసలు చెయ్యండి. కుదరకపోతే మీ ఇష్టం వచ్చినట్లు ఫైసలు చెయ్యండి. తక్కిన పుస్తకాలున్నూ యిప్పించెయ్యండి. వారికి నాలుగు వేల చిల్లర నేను బాకీ. నవలలూ, నాటకాలూ వగైరా కాపీరైట్లు, స్టాకు అంతా యిప్పించండి. మీకు సాధ్యమైన ధరకు యిప్పించి రుణం లేదనిపించి అదనంగా యిస్తే అది నా భార్య చేతికి యివ్వండి. నా కుటుంబానికి మీరే సాయం చెయ్యగలరు. కథలు సాఫు రాసి వున్నాయి. పేపరు కటింగులున్నాయి. ముందు చికిత్సకూ, తిండికి డబ్బు కావాలి. ఇప్పించండి. ఈ నెల ఇంకా అద్దె యివ్వలేదు.

పుస్తకాల వ్యవహారం పూర్తిగా పరిష్కరించి మరీ వెళ్ళాలి మీరు. 'అనుభవాలు 2' విశాఖపట్టణం పంపాలి. పోషకులకూ తక్కినవారికీ, రాజమండ్రిలో మైలవరపూ, వింజమూరీ, రామచంద్రపురంలో దువ్వూరీ, చావలీ, వేపా వారికి మాత్రమే యిచ్చాను. వేపా వారు 116 ర్లు ఇస్తానన్నారు. ఇప్పుడే కొంత ఇవ్వవచ్చు. కాకినాడ సాహిత్యవేత్త గారంటే, శ్రీ పార్థసారథిగారు, వారికి నాయెడ చాలా దయ. మీరు చెప్పితే నాకు గాని, నా కుటుంబానికి గాని వారేమైనా సాయం చేయించవచ్చు.

నా కుటుంబం చెట్టు క్రింద వుంది.

మీరు సాయం చెయ్యండి. విశాఖలో కూడా ఏమైనా వీలవుతుందేమో చూడండి.

గుంటూరులో చావలి సూర్యనారాయణగారు (I.L.T.D. లేబరు ఆఫీసరు) 66-00 ఇవ్వాలి. ప్రయత్నం చెయ్యండి. వారు, రామచంద్రపురం గాంధీ డాక్టరుగారి అన్నగారు. డాక్టరు ద్వారా ప్రయత్నించండి. డాక్టరుగారున్నూ రామచంద్రపురం మిత్రుల చేత యేమైనా చేయించవచ్చు. నెల్లూరు శివరామయ్య గారేమైనా పంపవచ్చు. డాక్టరు కనకరాజుగారున్నూ చెయ్యవచ్చు. శ్రీ నాగేశ్వరరావు గారి విషయం, వారికి అభ్యుదయం నా చేతనైనంతా కలిగించాలనుకున్నాను. భగవంతుడిలా చేశాడు. నేను వ్యర్థుణ్ణయి పోయాను. స్నేహితులైనందుకు మీకీ శ్రమ మాత్రం కలిగిస్తున్నాను.

నాగేశ్వరరావుగారి వ్యవహారం మీరే పరిష్కరించాలని నా ఆశ. మీరు మిక్కిలి ఘనంగా సన్మానించారు. మీకు శ్రమ మాత్రమే కలిగించాన్నేను. శ్రీ సింహాచలంగారి స్నేహం నాకు మహామేరువు. వారికి నా కృతజ్ఞత సరిగా చూపించలేక పోయాను. మీకు నేను బరువైనట్టే నిశ్చయం. మీలాగ మనసిచ్చిన వారు నాకు మరొకరు లేరు. మీ రుణం తీర్చుకోలేను. అది తీర్చుకోడానికయినా మరో జన్మ యెత్తుతాను. ఒకటికాదు, పది జన్మలు ఎత్తుతాను. ఒక సామాన్యుడికి మీరూ, సింహాచలం గారూ కనకాభిషేకం చేయించారు. ఇది నాకు పరమేశ్వరుడు చేయించలేనిది.

ఇలాంటి స్థితిలో నేను భారం అయిపోతున్నాను. అయినా విచారించను. అది తీర్చుకోడానికయినా మరోజన్మ యెత్తుతాను కనక. నాకేమీ విచారం లేదు. నా భార్య నన్ను అనేక విధాల కాపాడింది. చిన్నప్పణ్ణుంచీ దాన్ని కష్టపెట్టాను గాని సుఖపెట్టలేకపోయాను. ఇప్పుడు ఇక ఆ వూసే లేదు కదా? నిరర్థక జన్మ అయిపోయింది నాది.

రచనలయినా సాఫురాసి అన్నీ జాతికి సమర్పించుకోలేక పోయాను. పరమేశ్వరుడు మీకు సకల సుఖాలూ కలిగించాలి. సారస్వత సేవలో మీకు సాఫల్యం పూర్తిగా కలిగించాలి. మీ కలం జాతిని ఉద్ధరిస్తుంది.

సం॥

**శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి**

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా రూ. 200/-తో పాటు పంపండి.

ప్రక్క పుటలో ఇచ్చిన **మిసిమి** ప్రచురణలు, వేమన ఫౌండేషన్, ధర్మదీపం ఫౌండేషన్ వారి పుస్తకాలు కూడా మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

**మిసిమి** *నెలనెలా విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**1. పేరు :** ..................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..................................................

వీథి ..................................................

పేట ..................................................

ఊరు ..................................................

పిన్ ..................................................

**3. చందా పంపుతున్న వివరాలు:**

ఎమ్.ఓ. ..................................................

డి.డి.నెం. ..................................................

బ్యాంక్ ..................................................

తేది ..................................................

**4. సంతకం :** ..................................................


| | | | రూ. |
|---|---|---|---|
| **I.** | **మిసిమి ప్రచురణలు** | | |
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| | అన్నపరెడ్డి రచనలు: | | |
| 1. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | (హార్డ్ బౌండ్) | 500.00 |
| 2. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | | 200.00 |
| 3. | ఆచార్య నాగార్జునుడు | | 150.00 |
| **II.** | **వేమన ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | లోకకవి వేమన – మరుపూరు కోదండ రామిరెడ్డి | | 100.00 |
| 2. | మన వేమన – ఆరుద్ర | | 80.00 |
| 3. | వేమన – నార్ల వెంకటేశ్వరరావు | | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం<br>(మూలం : ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి) | | 100.00 |
| 8. | THE FIRST POETIC READER - *K. Jitendra* | | 50.00 |
| 9. | వేమన – రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ | | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం – ఎస్.ఎమ్. సుభాని | | 25.00 |
| **III.** | **ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్<br>*రాహుల్ సాంకృత్యాయన్ అనువాదం : బి. గోవర్ధన్* | | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ<br>*రాహుల్ సాంకృత్యాయన్ అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి* | | 75.00 |
| 3. | మిళింద తన్హ : ఉపమలు – బోధ చైతన్య | | 75.00 |
| 4. | మహా పరిత్తం – బోధ చైతన్య | | 100.00 |
| 5. | జాతక కథలు – శివశంకర స్వామి | | 60.00 |

---


మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com


పల్లెపడుచు

MISIMI / **నలీబానలీ** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



మాతృత్వం